Regd. No. H. 375

ఆంధ్రప్రదేశ్




సంపుటి 1

అగ్రహాయన, 1881 శకం



హైదరాబాదులోని రాష్ట్ర కేంద్ర గ్రంథాలయంలో పిల్లల విభాగం



ప్రణాళికల రాష్ట్ర సలహా సంఘం తొలి సమావేశం 4.11.59న హైదరాబాదులో
సెక్రటేరియట్ కమిటీ హాలులో జరిగింది.

ఆంధ్ర ప్రదేశ్

సంపుటి 4 | డిశంబరు, 1959 | సంచిక 2
అగ్రహాయన, శకము—1881

విషయ సూచిక

ముఖ చిత్రం
కోయ నాట్య బృందం
(నరసంపేట బహుళార్థ సాధక ప్రాజెక్టు వ్యాసం చూడండి)

చందా వివరాలు :

సంవత్సరానికి ... 2 రూపాయలు 16 నయాపైసలు.
విడిప్రతి వెల ... 18 నయాపైసలు.

Edited and Published by the Director of Information and Public Relations, Hyderabad
Printed at: Vir Milap Press, Mukaramjahi Road, Hyderabad

మహోద్యమం

రచన:- శ్రీ ఓలేటి శేషాచార్యులు

ఓహో త్యాగమూర్తీ
స్వాతంత్ర్య సమరనేతా
ఓహో శాంతమూర్తీ
స్వరాజ్య సంప్రదాతా.

మాతృదేశవిముక్తి కొరకు
అష్టైశ్వర్యముల నీవు
దేశసేవకర్పించిన
సాటిలేని త్యాగనిధివి!

...

పంచశీల సూత్రమ్ముల
ప్రపంచానికి చాటి
కల్లోలిత విశ్వానికి
శాంతి పథము చూపినావు!

ఒరుల మనసు నొప్పించని
వెన్నపూసవంటి మనసు
శాంతి పారాల జెప్పు
విశ్వశాంతి ప్రబోధకుడవు!

జాతిమతోన్మాదమ్ములు
అడుగడుగున ప్రజ్వలించు
వర్గద్వేషముల కీవు
అతీతమహోన్నతమూర్తివి!

రాజనీతి చతురులమని
విర్రవీగుపాశ్చాత్యుల
దిగ్భ్రాంతులజేసివైచు
రాజనీతికోవిదుడవు!

..

సాటి ప్రాచ్య దేశమ్ముల
భరత జాతి జయపతాక
ప్రతిష్ఠించి మాతృగేశ
ఘనతనునిల్పిన ఘనుడవు

....

నవభారత మహోదయం
సమజీవన శుభోదయం
లక్ష్యసిద్ధికై నిల్చిన
నిష్కళంకసేవకుడవు!

....

జాతి మతద్వేషమ్ముల
రూపులేకమాపివైచి
నవసమాజనిర్మాణపు
దీక్షగొన్న తాపసుడవు!

సంప్లావిత ఉత్సాహమూర్తి
ఆరోగ్యస్నాతా!
తొలిభారత "రిపబ్లిక్"
ప్రగతిగమన రథ సారధి.!
నీహృదయం మహోన్నతం
నీచేతలు నిస్స్వార్థం
త్యాగమూర్తి జవహర్‌లాల్
నీవే ఒక మహోద్యమం

అనంతపురంలో బంగారు త్రవ్వకం

—శ్రీ సి. కె. మూర్తి, ఐ.ఏ.ఎస్.

1902లో మైసూరు భూగర్భ పరిశోధక శాఖ ఉద్యోగి శ్రీ ఇ. డబ్ల్యు. వెథెరాల్ ధార్వార్ ప్రాంతంలో అంతకు ముందు కనుగొనబడని ప్రదేశాన్ని కనుగొనడంతో అనంతపురం జిల్లాలో బంగారు త్రవ్వకం ఆధునిక చరిత్ర ఆరంభమయింది. 'మద్రాసు రాష్ట్రపు అనంతపురం జిల్లాలో ఉత్తర, దక్షిణ దిశగా 32 మైళ్ళ వరకు వ్యాపించి వుండి మైసూరు రాష్ట్రపు తుంకూరు జిల్లా పావగడ తాలూకా ఈశాన్య మూలను స్వల్పంగా స్పృశించే' యీ ప్రాంతంలో విస్తారమయిన శిలాస్ఫటికపు ప్రదేశాలున్నాయి. బంగారం యీ శిలాస్ఫటికాలలో 'ముఖ్యంగా హరిద, మట్టి' మిశ్రమంలో దొరుకుతుంది. ఈ ప్రాంతంలో రామగిరి గ్రామానికి సమీపంలో బంగారం కోసం చాలచోట్ల త్రవ్వబడినట్టు కూడా కనుగొనబడింది. రామగిరి మైసూరు రాష్ట్రపు పావగడ తాలూకా సరిహద్దుకి దగ్గరగానున్న ధర్మవరం తాలూకాలోని గ్రామం, పెన్నేరు, నాగసముద్రాలకు దాదాపు మధ్యలో వుంది. (ధర్మవరం. పెనుకొండల మధ్య రైల్వే స్టేషను) కొన్ని ప్రాంతాలలో యీ త్రవ్వకాలు 'దాదాపు 10—20 అడుగులు' వున్నాయి. త్రవ్విన ఉపరితలాన్ని 'కొన్ని వందల అడుగుల వరకు గుర్తుపట్టవచ్చు". స్థానిక కథనాల ప్రకారం యీ త్రవ్వకాలు టిప్పుసుల్తాను కాలంలో జరిగాయి. కాని యీ ప్రాంతంలో బంగారం మైసూరు సుల్తానులకు పూర్వం త్రవ్వబడలేదని నిశ్చయంగా చెప్పలేం.

అనంతపురం బంగారు గనుల (ఫీల్డు) లిమిటెడ్ యీ ప్రాంతంలో బంగారం త్రవ్వకానికి మొట్టమొదట నెలకొల్పబడిన కంపెనీ. ఇది 1905లో 30,000 పౌనుల పెట్టుబడితో యేర్పాటయింది. కాని కొన్ని సంవత్సరాల తరువాత అనగా 1908లో అది తన ప్రాంతంలో కొంత భాగమయిన బురుజు ఖండాన్ని (అనగా చెన్న భావి గనులను) ఒక కొత్త కంపెనీ ఉత్తర అనంతపురం బంగారు గనుల లిమిటెడ్‌కీ, మరొక భాగం దక్షిణ జీబూతిల్ * ఖండాన్ని ఆప్షన్ క్రింద మైసూరుకి చెందిన నందిదుర్గ కంపెనీకి యిచ్చివేసింది. కొంత కాలం తరువాత ఉత్తర జీబూతిల్ ఖండాన్ని కూడా అది నందిదుర్గ కంపెనీకి బదిలీచేసింది. అప్పుడు, అనంతపురం జీబూతిల్ బంగారు గనుల లిమిటెడ్ అనంతపురం బంగారు గనుల (ఫీల్డు) లిమిటెడ్ నుంచి ఆస్తుల స్వాధీనానికి చర్య తీసుకుంది.

గుత్తి తాలూకాలో :— ఉత్తర అనంతపురం బంగారు గనుల లిమిటెడ్ యీ ప్రాంతంలో బాగానే కృషి చేసినట్లు కనబడుతుంది. 1913 నాటికి అది అయిదు చాలులను త్రవ్వింది. దాని మిల్లు శక్తి 30 స్టాంపులు. నెలకు 3,000 టన్నులను త్రవ్వగలదు. 1918 నాటికి చాలుల సంఖ్యను తొమ్మిదికి హెచ్చించింది. వీటిలో ఒకటి ప్రధానమయినది, ఒకటి సెకండరీ ప్రాముఖ్యం కలది, మిగిలిన యేడూ గాలి, వెల్తురు వగైరా ప్రయోజనాలకి ఉద్దేశించబడినవి. ఈ కంపెనీ ధర్మవరం తాలూకాలో త్రవ్వకం పనుల్ని 1922 జూలైలోనే మానివేసింది. అయితే 1925లో మిగిలిపోయిన ముడి ఖనిజం నుంచి సైనైడ్ పద్ధతి ద్వారా బంగారం స్వల్పంగా రాబట్టబడింది. ఈ పనికూడా ఆఖరికి 1925 జూన్‌లో మానివేయబడింది. అలాగని యీ జిల్లాలో యీ కంపెనీ పని ఆఖరు కాలేదు. 1922 లో అది జరిపిన (ప్రోస్పెక్టింగు) కృషివల్ల అదే జిల్లా గుత్తి తాలూకాలో పూర్వం బంగారం కోసం కొన్ని చోట్ల త్రవ్వబడినట్టు

* స్థానికంగా జీబేత అని వ్యవహరింపబడే యిది రామగిరి గ్రామానికి దగ్గరలో వుంది.

తెలియవచ్చినది. 1926లో కొంత ప్రాధమిక కృషి జరిపిన పిమ్మట యీ కంపెనీ యీ తాలూకాలో పెన్నేరుకి పైన గల పమిడి రైల్వే స్టేషన్‌కి పశ్చిమాన రామాపురం, వెంకటంపల్లి గ్రామాలకు సమీపంలో గనుల త్రవ్వకం కౌలును సంపాదించింది. ఈ ప్రాంతంలో అదే సంవత్సరం బంగారాన్ని తీయగలిగింది. అయితే యీ పని యెంతో కాలం సాగలేదు. 1927 ఆగస్టులో యీ ప్రాంతంలో గనుల త్రవ్వకం పనికి శాశ్వతంగా స్వస్తి చెప్పబడింది. దీనితో యీ జిల్లాలో బంగారం త్రవ్వకం ఆధునిక కార్య కలాపాలు సమాప్తి చెందాయి; యితర కంపెనీలు, అనగా ** జీబూతిల్ బంగారు గనులు, అనంతపురం బంగారు గనులు (ఫీల్డు) లిమిటెడ్ అదివరకే పని మానివేశాయి. ఈ మూడు కంపెనీలు కూడా ఇంగ్లండులో ఆరంభింప బడినవి.

గనుల త్రవ్వకం పని రెండు సంవత్సరాలు ముందు గానే ప్రారంభమయినా, యీ గనులలో బంగారం 1910 లోనే లభించినట్లు కనబడుతుంది. 1910 నుంచి 1927 లో ఉత్పత్తి ఆగిపోయేవరకు ఉత్పత్తి అయిన బంగారం పరి మాణం (ఔన్సులలో), దాని విలువల వివరాలు దిగువ యివ్వబడినవి:

సంవత్సరం	ఉత్పత్తి	విలువ	సంవత్సరం	ఉత్పత్తి	విలువ
1910	2,532	10,120	1919	11,018	6,16,934
1911	5,419	20,835 •	1920	13,645	8,03,535
1912	7,269	28,499	1921	10,108	7,21,359
1913	11,019	43,194	1922	8,388	6,08,673
1914	19,873	82,939	1923	1,519	1,01,016
1915	23,870	101,324	1924	3,646	2,38,603
1916	22,371	94,789	1925	288	16,517
1917	20,529	87,066	1926	930	53,219
1918	17,831	67,219	1927	2,395	1,37,320

• గనులలో ఒక దాని నుంచి తీయబడిన 135 ఔన్సుల విలువ యిందులో చేరిలేదు.

ముడి బంగారంలో స్వల్పమే అయినా చెప్పుకోతగిన ప్రమాణంలో వెండి కూడా లభించింది. కొన్ని సంవత్స రాలలో (ఔన్సులలోనే) ఉత్పత్తి వివరాలు దిగువ యివ్వబడినవి:

సంవత్సరం	ఉత్పత్తి	సంవత్సరం	ఉత్పత్తి
1916	1,362	1921	619
1917	1,281	1922	554
1918	1,169	1923	100
1919	753	1924	249
1920	868	1926	59

తీవ్ర కృషి

1910 లో మూడు గనులూ పని చేస్తున్నా ఆ సంవత్సరం బంగారం మాత్రం ఒక్కగని నుంచే తీయబడింది. 1911 లో అది రెండు గనుల నుంచి తీయబడింది; ఒక దాని నుంచి 135 ఔన్సులు మాత్రమే లభించింది—మూడ వది కూడా పని చేసింది కాని దానిలో బంగారం యేమీ

** ఈ కంపెనీ గనులత్రవ్వకం పనిని 1924 సెప్టెంబరులో మానివేసింది. అయితే 1925 లో మిగిలి పోయిన ముడి ఖనిజం నుంచి బంగారం స్వల్పంగా తీయబడింది.

లభించలేదు 1912 అంకెలు ఒక్క గనిలో తయారయిన బంగారాన్నే సూచిస్తాయి. మిగిలిన వాటికి సంబంధించిన అంకెలు దొరకలేదు. 1913నుంచి 1917 వరకుగల అంకెలు మూడు గనుల వుత్పత్తిని సూచిస్తున్నట్టు కనబడుతుంది. 1918, 1919 లలో ఉత్పత్తి తగ్గింది, రెండు గనులలో త్రవ్వకం పనులు ఆపివేయబడటమే యిందుకు కారణమని చెప్పబడుతున్నది. వీటిలో ఒకటి రసాయన పదార్థాల అధిక ధర కారణంగా 1919 లో మూసివేయబడినదని చెప్పబడుతున్నది. 1920, 1921 లలో ఒక్కగనే పనిచేసింది. 1922, 1923 లలోనూ (అభివృద్ధి పని సాగుతూ వుండటం వల్ల జీబూతిల్ గనిలో పని అయిదు నెలలకు మాత్రం పరిమితమయి వుంది) 1924 లోనూ, 1925 లో కొంత కాలమూ 3 గనులలోనూ 2 గనులు పనిచేసినట్టు కనబడుతుంది. ఆ తరువాత వాటిలో ఒక్క గని నుంచి మాత్రమే బంగారం తీయబడింది. తొలి ప్రపంచ యుద్ధం సమయంలో మెద్రాసు ప్రెసిడెన్సీలో యితర ఖనిజాల త్రవ్వకం తగ్గిపోగా యీ జిల్లాలో బంగారం త్రవ్వకం మాత్రం మిక్కిలి తీవ్రంగా జరుపబడింది. అనంతపురం జిల్లాలో బంగారం అత్యధికంగా తయారయే కాలంలో, అనగా 1915లో, అప్పుడు భారత దేశంలో తయారయే దాదాపు 6,13,400 ఔన్సులలో (బర్మా, పంజాబుల అంకెలు యిందులో చేరి లేవు) నూ అక్కడ 23,870 ఔన్సులు లభించాయి. ఇది దేశం మొత్తం వుత్పత్తిలో దాదాపు 4 శాతం. ఈ కాలంలో భారత దేశం ప్రపంచం వుత్పత్తి చేసే బంగారంలో దగ్గరగా 2 శాతం వుత్పత్తి చేసేది. ఈ ప్రాంతంలో బంగారం త్రవ్వకానికి ఆధునిక ప్రయత్నాలు ఆరంభమయి మళ్లీ అవి సమాప్తమయేవరకు మొత్తం 1,82,650 ఔన్సుల బంగారం లభించింది. లేక అంతకంటె కొంచెం యెక్కువే వుండవచ్చు. ప్రస్తుతపు చిల్లర ధరల ప్రకారం దాని విలువ దగ్గరగా రూ. 5.5 కోట్లు. ఈ ప్రాంతంలో బంగారానికై త్రవ్విన చాళ్లు విస్తారంగా వున్నాయి. కొన్ని మూసుకొని పోయాయి; కొన్ని యింకా కొంత భాగం తెరచి వున్నాయి, కొన్ని 800—1000 అడుగుల లోతున 3,000 అడుగుల వరకు భూమిలోనికి చొచ్చుకుని వున్నాయి, సైనైడ్ టెయిలింగ్సు వగైరా కనబడతాయి, పాడుపడిన గనులు త్రవ్వే శిబిరాలు, కట్టడాలు వున్నాయి; పవర్ హౌస్‌లు, మిల్లులు వగైరాను జ్ఞప్తికి తెచ్చే కొన్ని గ్రానైటుతో నిర్మించబడి, యింతకు ముందు, శతాబ్దాలకు పూర్వం జరుపబడిన త్రవ్వకం పనులతో కలిసి పోయి వున్నాయి. ఇవన్నీ యీ శతాబ్దారంభంలో యిక్కడ శక్తివంతమయిన గనుల త్రవ్వకం పనులు జరిగినవనటానికి నిదర్శనం.

గనుల త్రవ్వకం పరిశ్రమలో సగటున అవసరమయే రోజు కూలీలు అన్నప్పుడూ లభ్యంకారు. అయితే యీ సంఖ్య 1910 లో 1186, 1911 లో 1110, 1912 లో 1756, 1913లో 1783, 1914 లో 2138 వున్నట్టు కనబడుతుంది. అధికతమ కృషి జరిగిన 1915, 1916, 1917 లలో యీ సంఖ్య 2000 లకంటె బాగా యెక్కువ వుండి వుండాలి. 1924 నాటికి గనులలోను, వాటి చుట్టు పట్ల నియుక్తులయిన వారి మొత్తం సంఖ్య 253 కి తగ్గి పోయింది. ఈ సంఖ్య 1925 లో 193, 1926 లో 308. ఈ పరిశ్రమతో సంబంధం గల వారికి లాభంతో పాటు నష్టం కూడా వుంటుంది. తెలిసినంతమటుకు, ప్రమాదాల వల్ల 1915 లో ఆరుగురు, 1916 లో నలుగురు, 1917లో ఏడుగురు, 1918 లో యిద్దరు మరణించారు. ఇది కాక 1908 లో నలుగురికి, 1915లో యెనమండుగురికి, 1916 లో నలుగురికి, 1917 లో 11 మందికి, 1918 లో యెనమండుగురికి తీవ్రమయిన గాయాలు తగిలాయి. ఆపైన 1922 లో 3 (ఒక ప్రాణాంతక ప్రమాదం తో సహా), 1924 లో 7 (3 ప్రాణాంతకమయినవి), 1927 లో 4 (ఒకటి ప్రాణాంతకం) ప్రమాదాలు సంభవించాయి. ఆ మధ్య సంవత్సరాలలో కూడా కొన్ని ప్రమాదాలు జరిగాయి. ఆ రోజులలో పెక్కు యితర గనుల త్రవ్వకం కేంద్రాలలో వలె కాక భూమిలోపల సాధారణంగా స్త్రీలను, పిల్లలను నియమించినట్టు కనబడదు. గనుల త్రవ్వకంలోనున్న ప్రజలు కలరా, మశూచి, మలేరియా వగైరా వ్యాధులకు గురి అయినట్టు కనబడుతుంది. 1918 లో సీత జ్వరం వల్ల 50 మంది చని పోయారు. అయితే ఇది అక్కడి 'కార్మిక' ప్రాంతాలకు కొత్త అయినట్టు కనబడదు. వేతనాలు కూడా మార్పులకు గురి అయి ఒక సారి హెచ్చుతూ, మరొకసారి తగ్గుతూ వున్నట్టు కనబడుతుంది. 1918 లో ఒక గనిలో మేస్త్రీల రోజు కూలి రూ 1-14-0 నుంచి 1-4-0 తగ్గించ బడినదనీ, 1924 లో మరొక గనిలో మెకానిక్కుల వారం గరిష్ఠ వేత

నాలు రూ 3-13-0 నుంచి రూ 5 లకు హెచ్చించ బడినవనీ పేర్కొనబడింది. 1925 లో కార్మికులలో మగవారు వారానికి సగటున దాదాపు రూ 7 సంపాదిస్తున్నట్టు కనబడుతుంది.

(ఈ వ్యాసంలోని విషయాలు ప్రధానంగా భారత దేశ భూగర్భ పరిశోధక సంస్థ నివేదికలు వగైరా నుంచి, భారత దేశంలో గనుల చీఫ్ ఇనస్పెక్టర్ వార్షిక నివేదికల నుంచి, మద్రాసు ప్రెసిడెన్సీ వార్షిక పరిపాలనా నివేదికలు వగైరా నుంచి గ్రహించ బడినవి.)

ఈ విశాల జగత్తులో మానవమాత్రులమైన మనం ఏ ఒక్క దేశాన్నో గర్వకారణంగా భావించకూడదు; ఏ ఒక్క మతమో వుండవలెనని పట్టు పట్టకూడదు; ఏ ఒక్క కులానికో లేక తెగకో కట్టుబడిపోయి వుండకూడదు. ఈ ప్రపంచంలోని ఉత్తమోత్తమ భావవీధుల్లో మనం సంచరించాలి. ఆ భావాలను జీర్ణం చేసుకోవడానికి సర్వదా ప్రయత్నించాలి, వాటిలో వున్న వైరుధ్యాలను తొలగించుకుంటూ పోవాలి. భావనాలోకం లోని వైశిష్ట్యాల నన్నిటినీ సమ్మేళనం చేసుకొని సార్వజనీనమైన దృష్టిని పెంపొందించుకోవడమే నేటి మన కర్తవ్యం.

— వినోబా

* * *

ప్రజాస్వామ్య వ్యవస్థను ప్రజాస్వామికం చేయడమే నేడు మనమంతా ఎదుర్కొంటూవున్న సమస్య. ఇది అమాంబాపతు సమస్యల వంటిదికాదు. ఏవో అవకాశాలు కల్పించి, ఇష్టమున్నవారు వాటిని వినియోగించుకొనేట్టు చేసే సమస్య కూడా కాదిది. వాటికంటే పెద్ద సమస్య, ప్రజాస్వామ్యమంటే ప్రజలు ఇష్టపూర్వకంగా పాల్గొనే వ్యవస్థ. న్యాయ శాసనం ప్రకారంగా వివేచనతో పరిపాలింపబడడం మాత్రమే ప్రజాస్వామ్యం కాదు. ఏ న్యాయ శాసనం ప్రకారం మీరు పాలింపబడుతున్నారో ఆ శాసనాన్ని రూపొందించడంలో మీ స్వంత అనుభవాన్ని మేళవించడమే ప్రజా స్వామ్యం.

— హెరాల్డు జె. లాస్కీ

పంచవర్ష ప్రణాళిక

- శ్రీ ఎస్. శ్రీనివాసాచార్యులు

గత హిస్టరీ పుటలల్లో
కాగడగా వెలిగినట్టి
భరతదేశ సౌభాగ్యం
పాశ్చాత్య దుమారంలో
కలతైలం హరియించగ
వెలుగ లేక ఆరిపోయి
వట్టి వత్తి మిగిలిపోయె.
పట్టుదలతో దాన్ని తిరిగి
వెలిగించగ చేయునట్టి
పలువిధముల యత్నాలను
అయిదేండ్ల ప్రణాళికలని
అనుకుంటే తప్పు లేదు.

౨

వడిగా ఎడివడిగా తడ
బడకుండా ప్రవహిస్తూ
జన్మించిన పరమార్థం
చరితార్థం కావాలని
తలపోయుచు చేతులెత్తి
తటం పై పుకుతుకంతో
చూసి చూసి ఫలియించని
ఆవలతో రత్నగర్భ
నాశ్రయించ బోవుచున్న
నదుల కోర్కె తీర్చుటకై
ప్రాజెక్టుల కట్టుటనే
ప్రణాళికయని చెప్పవచ్చు.

౩

పదవీ స్థిత స్వార్థపరుల
భాగ్యపూర్ణ గర్వాంధుల
కబంధ హస్త యుగ్మంబుల
కనజాలక నలిగిపోయి
చావు బ్రతుకు సంగరమున
జీవితాలు వెళ్లబుచ్చు
ప్రజల నావరించియున్న
పామరత్వమను చీకటి
బాపునట్టి విజ్ఞానము
ప్రసాదించు చదువు బళ్ల
యభివృద్ధే ప్రణాళికయని
యర్థంబును చెప్ప వచ్చు.

౪

యంత్రాలతో పోటీ చేయు
తంత్రాలే మృగ్యంబై
ఉన్న పనులతోడ తిండి
సున్నయైన కారణమున
క్రొత్త వృత్తి నేర్వబోయి
పాత వృత్తి మరచిపోయి,
ఉభయత్రా భ్రష్టత్వం
ప్రభవింపగ బరువు బ్రతుకు
సీడ్వలేని పనివారికి
కూడుగుడ్డ కల్పించే
పరిశ్రమలను నెలకొల్పుట
ప్రణాళిక కొక మారు పేరు.

ఆంధ్ర ప్రదేశ్

౫

మారుచున్న నవయుగమున
మారలేక పాత బాట
పట్టుకొన్న వ్యవసాయపు
పద్ధతులను క్రొత్త విధుల
నడిపించగ శ్రద్ధ జూపి,
నాగరకత తెలియనట్టి
పల్లెటూళ్ల, పల్లీయుల
బాగుపరచు మార్గాలను
నిర్మాణాత్మక రీతుల
నియమించే పద్ధతినే
ప్రజలకొఱకు నిర్మించిన
ప్రణాళికయని చెప్ప వచ్చు.

౬

ప్రతి క్షణము నుద్ధృతముగ
ప్రజలయొక్క ప్రాణాలకు
నుపద్రవాలు కలిగిస్తూ
అపర మృత్యు దేవతలై
విలయ నృత్య మొనరిస్తూ
విహరించే రోగాలను
పారద్రోలి ఆనందం
ఆరోగ్యం కలిగించే
వైద్యశాలలను హార్దిక
బాధ్యతతో పెంపుసేయు
పనిని కూడ ప్రణాళికయని
అన్వయించి చెప్ప వచ్చు.

౭

రవాణాల సౌకర్యం
రాకపోక సౌలభ్యం
దూరమెంత యైనగాని
భారమనెడి మాటలేక
ఎటుకైనా ఎప్పుడైన
ఎంతకాల మైనగాని
నిరపాయ పరిస్థితిలో
తిరుగుటకై పనికి వచ్చు
ఇనుపదారి శకటాలను
ఇతోధికముగ వృద్ధి చేసి
ప్రజల సేవ చేయించుట
ప్రణాళికలో ఒక ఘట్టం.

౮

హరిజనులకు, గిరిజనులకు
అందరితో సమభావం
సౌహార్దం సౌభ్రాత్రం
సమకూర్చుచు వారలకును
సర్వతోముఖాభివృద్ధి
సత్వరముగ సాధించుట
నోరులేని పశుగణమును
క్రూర వ్యాధి బారి నుండి
కాపాడగ వాటి కొరకు
నాస్పత్రులు నెలకొల్పుట
అను విషయము లన్నికూడ
అన్వయమీ ప్రణాళికకే.

౯

పారిశ్రామిక రంగంలో
భారీ యంత్రాలయములు
శరవేగముతోడ బెంచి
సరిజేస్తూ వాటి కొఱకు
సాంకేతిక విద్యలందు
సమర్థులైన ధీశాలుర
ప్రోత్సహించి తగురీతిని
ప్రోదిసేయు పనులయందు
సాటివారి సహకారం
సానుభూతి పొంది దేశ
భవిష్యత్తు నిర్మించుట
ప్రణాళిక కొక నిర్వచనం.

౧౦

తృటిలో కడు చిత్రముగా
బటన్ నొక్కునంతలోనె

కనులకు మిరుమిట్లు గొల్పు
కాంతి నిడుట కాకుండగ
వంటపనులు మొదలుకొని
వచ్చిపోవు బండ్ల వరకు
వినియోగము సేయునట్టి
విద్యుత్తును పట్టణాల
సరిహద్దుల లోపలనే
పరిమితముగ బంధించక
ప్రతి పల్లెకు అందించుట
ప్రణాళికలో నొక భాగం.

౧౧

వెనుకబడ్డ వర్గాలకు
పనులు లేని మగ్గాలకు
చదువుకొన్న నిరుద్యోగులకు
సదుపాయం కల్గిస్తూ
పరస్పర కులభేదంబులు
తమ వారను భావంబులు
లేకుండా ప్రతివారికి
లేమివలని కష్టంబులు
తొలగజేయు విధానాలు
తలపెట్టుటె కాకుండగ
అమలు పరచుటను గూడా
అనవచ్చును ప్రణాళికయని

౧౨

ఇంతెందుకు? వాస్తవముగ
ఈ ప్రణాళి కొక విధముగ
ఇరుగు పొరుగు వారలవలె
త్వరలోనే మన దేశం
తొలికాలపు టౌన్నత్యం
కలుగజేసికొని—జగమున
కాదన్న ప్రాయముగా
కావాలని మన ప్రియతమ
నాయకుడగు నెహ్రూజీ
శాయశక్తులను కష్టం
చేసి చేసి పంపించే
ఆశాఫల మనవచ్చును.

తాను ఏదో ఒక దాన్ని పొందడం వల్ల మానవునికి శాశ్వతానందం సిద్ధించదు. తనకంటె మహోన్నతమైన వాటికి—తన వైయక్తికమైన జీవితం కంటె గొప్పవైన భావాలకు, ఆదర్శాలకు. అనగా—స్వదేశం. మానవసమాజం, దైవం మొదలైన మహోదాత్త విషయాలకు ఆత్మ సమర్పణ చేసుకోవడంలోనే శాశ్వతానందం వుంది.

— రవీంద్రనాథ టాగూరు

శ్రీకాకుళం

శ్రీకాకుళం, జనాభా దృష్ట్యా, రాష్ట్రంలో మిక్కిలి పెద్ద జిల్లాల్లో మూడవది. దానికి 120 మైళ్ల దీర్ఘమయిన తీరం ఉంది. కలకత్తా-మద్రాసు గ్రాండ్ ట్రంక్ రోడ్డు దానిలో రమారమి 134 మైళ్ల పొడుగున వ్యాపించి ఉంది. దానికి చక్కని రహదార్లున్నవి. ఈ జిల్లాలో మొత్తం దాదాపు 168 మైళ్ల నిడివి గల రైలు మార్గం ఉంది. వర్షపాతం 46.90 అంగుళాలకి బాగా పైన. ఇది రాష్ట్రంలో మిగిలిన అన్ని ప్రాంతాలలోకంటె హెచ్చు. ఇక్కడ రమారమి 12,000 నీటి పారుదల వసరులు ఉన్నాయి. రాష్ట్రంలోని ఏ ఒక్క జిల్లాలోను ఇన్ని పంటవసరులు లేవు.

ఇక్కడ ముఖ్య నదులయిన వంశధార, నాగావళి, బాహుద, మహేంద్ర తనయలు భూమి సారాన్ని ద్విగుణీకృతం చేస్తాయి. శ్రీకాకుళం ఉద్యానమని పేరుపడిన ఉద్దానం ప్రాంతంలో కొబ్బరి, జీడిమామిడితోటలు వ్యాపించి ఉన్నాయి. ఇక్కడ సుమారు 544 చ. మైళ్ల ఏజన్సీ (నోటిఫైడ్) ప్రాంతం ఉంది. అక్కడ అనాదినుంచీ ముక్కుకు సూటిగాపోయే జటపులు, అమాయకులైన సవరలు నివసిస్తున్నారు. వారికి నాగరిక సంపర్కం అసలు లేనేలేదు.

ఈ జిల్లాలో పారిశ్రామికీకరణ సాగుతున్నది. రెండు పంచదార ఫ్యాక్టరీలు ఇదివరకే పనిచేస్తున్నాయి. మూడవది ప్రారంభించబడుతున్నది. మిక్కిలి పెద్ద మాంగనీసు ఫ్యాక్టరీ ఇదివరకే పని ప్రారంభించింది. ఈ జిల్లాలో వివిధ రకాల ప్రకృతి సంపద పుష్కలంగా ఉంది. ప్రకృతి వనరులు ఉపయోగం లోనికి తేబడుతున్నాయి. పనులు అంచెలవారీగా పూర్తి చేయబడుతున్నాయి.

వైశిష్ట్యం

దక్షిణ భారతంలో మిక్కిలి ఎత్తయిన మహేంద్రగిరి యీ జిల్లా సరిహద్దుకి ఆరు మైళ్ల దూరంలో ఉంది. పురాణ ప్రసిద్ధిగల యీ ప్రదేశం ముఖ్యమైన యాత్రా కేంద్రం.

భారత దేశంలోగల సూర్య భగవానుని దేవాలయాలు రెండింటి లోను ఒకటి అరసవిల్లిలో ఉంది.

ఇటీవల త్రవ్వబడిన శాలిహుండం బౌద్ధ స్తూపాలు బౌద్ధ యుగంలో యీ ప్రాంతం ప్రాముఖ్యానికి నిదర్శనం.

శివభక్తులైన గాంగరాజులు వంశధారా తీరాన గల శ్రీ ముఖలింగం నుంచి రాజ్య పాలన చేశారు. అక్కడ ఒక ప్రసిద్ధమైన దేవాలయం, దానిపై శాసనాలు నేటికీ ఉన్నాయి.

ప్రాచీన కళింగ రాజ్యంలో ముఖ్యమైన కోస్తా పట్టణమైన కళింగపట్నం అశోకుని కాలంలో యీ ప్రాంతం ప్రాముఖ్యాన్ని విశదపరుస్తుంది. (దీనిని ఆయన క్రీ.పూ. 260 లో జయించాడు.)

శ్రీకాకుళం అనే పేరు సికే-ఖోలే నుంచి ఏర్పడి వుండవచ్చు. ఈ పేరు మొగలు చక్రవర్తుల కాలంలో యీ ప్రదేశం ప్రాముఖ్యాన్ని చాటుతుంది.

నాగావళి, బాహుదా నదుల పేర్లకు పురాణేతిహాసాలతో సంబంధం వుంది. నాగావళి లేక లాంగుల్య అనే పేరు నాగలినుంచి ఉత్పన్నమైంది. స్థానిక గాథల ప్రకారం యీ నదిని బలరాముడు తన హలంతో త్రవ్వాడు. అలాగే బాహుద పేరు బాహువులు తిరిగి లభించాయనటానికి చిహ్నం.

జనాభా, చదరపు మైలుకి నివసించే జనుల సంఖ్య,

గ్రామీణ జనాభాల దృష్ట్యా యీ జిల్లా రాష్ట్రి జిల్లాలలో మూడవ శ్రేణి నాకమిస్తుంది గ్రామాల సంఖ్య విషయంలో దీని స్థానం రెండవది

రాష్ట్రంలో ఆహార ధాన్యాల విషయంలో స్వయం సమృద్ధిగల జిల్లాలలో ఇదొకటి ఈ జిల్లా రైతులు వరి మున్నగు ముఖ్య పంటలలో అధిక తమ ఉత్పత్తి సాధనకై అఖిల భారత రాష్ట్రిస్థాయి బహుమతులను గెలుచుకున్నారు

డాలరు సంపాదనకు పేరుబడిన జీడిమామిడి గింజలు ఇక్కడ విస్తారంగా పండించబడతాయి

పొందూరు ఖద్దరు నాజూకుకు, నాణ్యానికి మొత్తం భారత దేశంలో ప్రసిద్ధి కెక్కింది ఇటీవల గరివిడిలో రూ॥ 1,20 00 000 ఖర్చుపై నెలకొల్పబడిన ఫెర్రో మాంగనీసు ఫ్యాక్టరీ ఆ రకం ఫ్యాక్టరీలలో మొత్తం భారత దేశంలోనే మిక్కిలి పెద్దది గరివిడిలో రూ॥ 1 00 000 ఖర్చుపై ఏర్పాటు చేయబడిన అధునాతనమైన లేబొరేటరి వంటిది ఆంధ్ర ప్రదేశ్‌లో ఇదివరకు లేదు

ద్వితీయ పంచవర్ష ప్రణాళికా పథకాల క్రింద ఈ జిల్లా ఆమదాల వలసలో త్వరలోనే పంచదార ఫ్యాక్టరీ ఏర్పడుతుంది ఇది దేశంలో అలా నెలకొల్పబడే ఆరు ఫ్యాక్టరీలలోను ఒకటి ఆంధ్రప్రదేశ్‌లోని మూడు విజ్ఞాన మందిరాలలోను ఒకటి ఈ జిల్లా ఆమదాలవలసకి వచ్చింది

శ్రీకాకుళం మునిసిపల్ హైస్కూలు హెడ్‌మాస్టరు శ్రీ వి నరసింహం 1959 లో సెకండరీ పాఠశాలల ఉపాధ్యాయులకు ఉద్దేశింపబడిన రాష్ట్రపతి బహుమతిని పొందారు 1959 లో రాష్ట్రపతి బహుమతికై రాష్ట్రానికొక సెకండరీ పాఠశాల ఎన్నుకోబడింది

చారిత్రక ప్రాముఖ్యం

కళింగను క్రీ శ ఆరవ శతాబ్దంలో బొంబాయిలోని బాదామి చాళుక్యులు, ఏడవ శతాబ్దములో తూర్పు చాళుక్యులు జయించినట్లు శాసనాలలో ఉన్నది ఈ రెండవ వారి దండయాత్ర ఫలితంగా తూర్పు చాళుక్యరాజు మొదటి విష్ణువర్ధనుని ఆధిపత్యంక్రింద వేంగి రాజ్యం నెలకొన్నది (క్రీ శ 615-33) ఈ రాజు ఒకప్పుడు ఉత్తరాన ఈ జిల్లా చీపురుపల్లి వరకు పాలించినట్లు నిదర్శనాలున్నాయి

గాంగరాజులు

వరుసగా కొందరు రాజుల గూర్చిన చరిత్రలో పేర్కొన బడ్డాయి వీరుగాంగ కుటుంబీకులమనీ, కళింగ రాజులమని, మహేంద్రగిరి (ఇక్కడ సైక్లోపియన్ ఆలయాల శిథిలాలు నేటికీ ఉన్నాయి) పైగల గోకర్ణేశ్వర స్వామి (శివుడు) భక్తులమనీ, కళింగ నగరంనుండి రాజ్య పాలన చేస్తున్నామనీ చెప్పుకున్నారు కళింగనగరం, వంశధారా తీరానగల ముఖలింగం ఒకటేనని గుర్తించబడినవి ఇక్కడ ప్రముఖమైన దేవాలయాలు, శాసనాలు నేటికీ ఉన్నాయి

గోలకొండ రాజులు ఢిల్లీ మొగలు పాదుషాలకు నామమాత్రంగా లొంగి ఉన్నారేకాని ఎప్పుడూ వారియందు నిజ



(ఎడమ నుంచి కుడికి)

1. శ్రీ. కె. సుబ్బయ్య నాయుడు—ఆంధ్రప్రదేశ్‌లో గరిష్ఠ వరి పంటకు ప్రథమ బహుమతి పొందారు.
2. పార్వతీపురం వాస్తవ్యులు శ్రీ జనక రామరాజు ఆంధ్రలో గరిష్ఠ వరి పంటకు శ్రీ ఎన్. సంజీవరెడ్డి నుంచి బహుమతిని స్వీకరిస్తున్న దృశ్యం.
3. శ్రీ సాల సీతారామస్వామి—ఫలోత్పత్తిలో అఖిలభారత బహుమతుల నందుకున్నారు.

మైన స్వామిభక్తిని చూపలేదు. దాదాపు స్వతంత్రులుగా వ్యవహరించే వారు. వారి పరిపాలనకు సంబంధించిన కొన్ని వివరాలు ఉన్నాయి. వారి ముఖ్య స్థానికాధికారి చికాకోలు ఫౌజుదారు, ఇతడు గంజాం, విశాఖ పట్నాల పనిని చూసేవాడు. ఇతడు స్థానిక ముఖ్యుడు లేక జమీందార్ల ద్వారా పరిపాలించినట్లు కనబడుతుంది. వీరికి వివిధ మండలాల శిస్తు వసూలు 10 శాతం కమిషన్‌పై అప్పగించబడేది. ఇందులో ఇద్దరు ముఖ్యులు బొబ్బిలి, విజయనగరం రాజుల పూర్వీకులు. వీరు ఈ జిల్లాకు షేర్ మహమ్మద్‌ఖాన్ కాలంలో వచ్చారు (శ్రీకాకుళం సమీపానగల షేర్ మహమ్మద్ పురానికి ఇతని పేరే వచ్చింది,). ఇతడు 1632 లో ఫౌజుదారు.

1786 లో ఢిల్లీ చక్రవర్తి (ఔరంగజేబు) దండెత్తి వచ్చాడు. 1787 లో గోల్కొండ రాజ్యం అస్తమించింది. అతడు దానికి దక్కన్ సుబేదారు అనే అధికారిని నియమించాడు. (తరువాత ఈ అధికారి సాధారణంగా హైదరాబాదు నిజాం అని వ్యవహరింపబడేవాడు.)

దర్శనీయ మైన స్థలాలు

శ్రీకాకుళం తాలూకా శాలిహుండంలోని బౌద్ధ స్థూపాలు, నిర్మాణాలు, పాత పట్నం తాలూకాలో ముఖలింగం దేవాలయము, పాలకొండ తాలూకా నెల్లయ్య పలసలోని పాండవుల పంచలకు పురాతత్త్వ ప్రాముఖ్యమున్నది. అవి యాత్రాస్థలాలుకూడా.

సోంపేట తాలూకా సరిహద్దునుంచి ఆరుమైళ్ల దూరంలో గల మహేంద్రగిరి (4920 అడుగులు) పైగల కుంతి, యుధిష్ఠిర, భీముని ఆలయాలు, శ్రీకాకుళంలోని జుమ్మామసీదు చూడతగిన ప్రాచీన కట్టడాలు.

అరసవిల్లి సూర్యనారాయణ దేవాలయం, శ్రీ కూర్మం కూర్మనాధ స్వామి ఆలయాలు ఈ జిల్లాలో ప్రసిద్ధికెక్కిన యాత్రా కేంద్రాలు.

1757 లో విజయనగరం, బొబ్బిలి రాజాల మద్దతుతో ఫ్రెంచి బలాలమధ్య జరిగిన యుద్ధానికి చిహ్నంగా 1891 లో బొబ్బిలిలో యుద్ధ స్మృతిచిహ్నం స్తంభం నాటబడింది.

క్రీ. పూ. 260 లో అశోక చక్రవర్తిచే జయించబడిన కళింగపట్నం పూర్వ కళింగ రాజ్యంలో ముఖ్యమైన కోస్తా పట్టణం.

ఇతర విషయాలు


ఈ జిల్లా 1950 లో పాత విశాఖ పట్నంనుంచి విడదీసిన ప్రాంతంతో ఏర్పాటు అయింది. అది ఉత్తర అక్షాంశం 18o-20', 19o-10' కి, దీర్ఘాంశం 83o-5', 84o-50' కి మధ్య ఉంది. దీనికి ఉత్తర, పశ్చిమాల ఒరిస్సారాష్ట్రం, తూర్పున బంగాళాఖాతం, దక్షిణాన విశాఖపట్నం జిల్లా వున్నాయి. ఈ జిల్లా ఈశాన్యంనుంచి నైఋతి మూలకు వ్యాపించివుంది. దీని మిక్కిలి ఉత్తర భాగం సన్నగా ఉంటుంది. ఈ జిల్లాలో మూడు రెవిన్యూడివిజన్లు, శ్రీకాకుళం, టెక్కలి, పార్వతీపురం ఉన్నాయి. 11 తాలూకాలు ఉన్నాయి. 1. ఇచ్ఛాపురం 2. సోంపేట (మందస సబ్-తాలూకాతో) 3. పలాస సబ్-తాలూకాతో టెక్కలి 4. హిరమండలం సబ్-తాలూకాతో పాతపట్నం. 5. నరసన్నపేట. 6. శ్రీకాకుళం. 7. పొందూరు సబ్-తాలూకాతో చీపురుపల్లి. 8. రాజం సబ్-తాలూకాతో పాలకొండ. 9. కురుపాం సబ్-తాలూకాతో పార్వతీపురం. 10. బొబ్బిలి 11. సాలూరు. మొదటి నాలుగు తాలూకాలు టెక్కలి డివిజన్‌లోనూ, 5 నుంచి 7 వరకు శ్రీకాకుళం డివిజన్‌లోనూ, మిగిలినవి పార్వతీపురం డివిజన్‌లోనూ ఉన్నాయి.

ఈ జిల్లాను స్థూలంగా 1. కొండ ప్రాంతాలు 2. మైదానాలు అని రెండుగా విభజించవచ్చు. కొండ ప్రాంతాలలో పాలకొండ, పార్వతీపురం, సాలూరు తాలూకాల ప్రాంతాలు కొన్ని చేరివున్నాయి. వీటికి ఏజన్సీ ప్రాంతాలు అని పేరు. ఇచ్ఛాపురం, సోంపేట, టెక్కలి, నరసన్నపేట, శ్రీకాకుళం, చీపురుపల్లి తాలూకాలు కోస్తాన వున్నాయి. పాతపట్నం, టెక్కలి, సోంపేట తాలూకాలలో కొన్ని కొండ ప్రాంతాలు ఉన్నాయి. కాని అవి ఏజన్సీగా ప్రకటింపబడలేదు. ఇచ్ఛాపురం, సోంపేట తాలూకాల కొన్ని ప్రాంతాలకు ఉద్దానం అని పేరు. ఇక్కడ విస్తారమైన కొబ్బరి తోటలు ఉన్నాయి.

వంశధార, నాగావళులు యీ జిల్లా ముఖ్య నదులు. ఇవి కాక ఇచ్ఛాపురం తాలూకాలో బాహుదానది, సోంపేట, పాతపట్నం తాలూకాలలో మహేంద్రతనయ. సాలూరు తాలూకాలో వేగావతి వున్నాయి.

ఈ జిల్లా కొండలు, నదులు. మైదానాలు, అరణ్యాలు.

చెరువులు విస్తారమైన కొబ్బరి తోటలతో కలకలలాడుతూ వుంటుంది. దీనికి 120 మైళ్ల సుదీర్ఘమైన తీరమున్నది. ప్రకృతి సంపద పుష్కలంగా వుంది. దీనిలో చాల భాగాన్ని వినియోగానికి తేవలసివుంది. ఈ జిల్లాలో మూడు వంతుల ప్రాంతం మాజీ జమీందారీ ప్రాంతం. 1948 జమీందారీల రద్దు చట్టం వచ్చే వరకు ఇక్కడ ఫ్యూడలిజం రాజ్యమేలింది. ఇది యీ జిల్లా అభివృద్ధికి ఆటంకమయింది. ఇక్కడి ప్రజలు నాగరికతతో పాటు ముందుకు సాగలేక పోయారు. చిన్నపంట నీటి వనరులు అశ్రద్ధ చెయబడినవి. పెక్కు పంటనీటి ప్రాజెక్టులకు జమీందారుల ప్రాపకం లభించలేదు. దానికితోడు ఈ జిల్లాలో అరవవంతు భాగం ఏజన్సీ ప్రాంతం. పంచవర్ష ప్రణాళికల అమలుకు పూర్వం ప్రజల జీవన పరిస్థితులు భయంకరంగా వుండేవి. ఇక్కడ ఇతర ప్రాంతాలలోకంటె నిరక్షరాస్యత ఎక్కువ (95 శాతం) వీటన్నిటివల్ల యీ జిల్లా 'వెనుకబడిన' ప్రాంతమనే పేరు తెచ్చుకుంది,



(ఎడమ నుంచి కుడికి)
1. నాగావళి కుడికాలువ (మధ్యరకం) ప్రాజెక్టు
2. నారాయణపురం (మధ్యరకం) ప్రాజెక్టు

శీతోష్ణ స్థితి, వర్షపాతం

ఇక్కడ ఏప్రిల్ నుంచి జూన్ వరకు ఎండలు బాగా కాస్తాయి. ఈ జిల్లాకు యీశాన్య, నైఋతి పవనాలు రెండింటివల్ల వర్షాలు లభిస్తాయి. శీతోష్ణస్థితి జిల్లా తూర్పు భాగంలో సమపాళంగా ఉంటుంది. వేసవి మరీ వేడిగా ఉంటుంది. శీతాకాలంలో చలి అధికం. ఈ జిల్లా వర్షపాతం రాష్ట్రంలోని ఇతర జిల్లాలన్నిటి వర్షపాతంకంటె ఎక్కువ.

జన సంఖ్య, విస్తీర్ణం

ఈ జిల్లా జనసంఖ్య 21 లక్షల 23 వేల చిల్లరలోను 19 లక్షల 32 వేల చిల్లర గ్రామాలలో నివసిస్తారు. గ్రామాల సంఖ్య 3,052. మిగిలినవారు పట్టణాలలో నివసిస్తారు. పట్టణాల సంఖ్య 16. లక్ష 66 వేల చిల్లర షెడ్యూల్డు జాతులకు, 2 లక్షల 19 వేల చిల్లర షెడ్యూల్డు కులాలకు చెందినవారు. షెడ్యూల్డు జాతులలో 54 వేల మంది సీతంపేట, భద్రగిరి (ఎల్విన్‌పేట), సాలూరు నోటిఫైడ్ ఏజన్సీ ప్రాంతాలలో నివసిస్తారు.

ఈ జిల్లా విస్తీర్ణం 3,902 చ.మై. ఇందులో అడవులు 4,35,968 ఎకరాలు. బంజరు, సాగుకులాయకుకాని భూమి 4,52,892 ఎకరాలు. విత్తనాలు జల్లిన నికరం భూమి 8,78,927 ఎకరాలు.


స్థానిక పరిపాలన

ఈ జిల్లాలో మూడు మునిసిపాలిటీలు ఉన్నాయి. బొబ్బిలి, సాలూరు, శ్రీకాకుళం. బొబ్బిలి కొత్తగా (1958 ఆగస్టు) ఏర్పాటయింది. పాత విశాఖపట్నం జిల్లా బోర్డు నుంచి ఏర్పాటైన జిల్లా బోర్డు కూడా ఒకటి వుంది. ఇది విద్యా సంస్థలను నడుపుతుంది, రోడ్లను, బావులను నిర్వహిస్తుంది. సమాజాభివృద్ధి కార్యక్రమం, స్థానికాభివృద్ధి పనులు తదితర పథకాల క్రింద చేపట్టిన పనులకు కూడా అది తోడ్పడుతున్నది.


ఈ జిల్లాలో రెండవ తరగతి పంచాయతీలు 1199 ఉన్నాయి. వీటిలో కొన్నిటిలో తప్ప మిగిలిన అన్నిటిలోను 1131 మంది స్త్రీలు, 1096 మంది హరిజనులు సభ్యులుగా వున్నారు. వీరు సభ్యులుగా లేని కొన్నిటికి వీరిని ఎన్నుకోవలసి వుంది.

శాసన సభ, పార్లమెంటు నియోజక వర్గాలు

ఈ జిల్లా 17 శాసన సభ నియోజక వర్గాలుగా విభజించబడింది. ఇందులో 3 ద్విసభ్య నియోజక వర్గాలు. వీటి నుంచి శాసన సభకు 20 మంది సభ్యులు ఎన్నుకోబడ్డారు. రెండు పార్లమెంటు నియోజక వర్గాలుగా విభజించ బడిన



MAP
of the
SRIKAKULAM DISTRICT
83° 30'
19° 0
18° 30
PARVATIPURAM (Z)
BOBBILI (Z)
SALUR (Z)
PALAKONDA
Rajam
CHIPURUPALLE (Z)
SRIKAKULAM
Pachipenta
Pottangi
Gunupuru
Tottapalle
Vizianagaram
Visakhapatnam
Garbham
Ponduru
ZAMINDARI
ESTATE
GOVT.
VIZIANAGARAM ZAM
ZAMINDARI
V I S A K H A P A T N A M


84° 0
84° 30′
19° 0′
18° 30′
BAY OF BENGAL
PATAPATNAM (Z)
RAGHUNADHAPURAM alias TEKKALI
GOTTIPALLI alias NARASANNAPETA
NARASANNAPETA
SOMPETA
Baruva
PALLUPADA alias ICHAPURAM
BUDARASINGI
Mandasa
Parlakimidi
Tekkali
Naupada
Polaki
Srikurmam (Z)
Purushottapuram
Harsapuram
Kotta
Santhabommali
Borubhadra
REFERENCE
District head quarters
SRIKAKULAM
Division head quarters
PARVATIPURAM (Z)
Taluk head quarters
SOMPETA
Villages above 5000 inhabitants
Baruva
Other important Villages
Naupadu
Traveller's Bungalow (D. P. W. Forest & etc)
Polaki
District boundary
Taluk & Zamindari boundaries
Agency boundary
Railway line with station (Broad Gauge)
Railway line with station (Narrow Gauge)
National Highways with unbridged sections
State Highways do
Major District Roads do
Other District Roads do
Other roads
Important cart track
River, Channel Bridge
Tank, Stream
Vertical Hills (Approximate)
Zamindari, Inam
(Z) (I)
G. T. S. and height in feet above sea level
Light house, Swamp
Estate Bungalow Vizianagaram Zamin
The Longitudes are referrible to the Greenwich Meridian, taking that of Madras Observatory as 80° 14′ 54″ East.

ఈ జిల్లా నుంచి పార్లమెంటుకు ముగ్గురు సభ్యులు ఎన్నుకో బడతారు. ముగ్గురు శాసన మండలి సభ్యులు ఉంటారు. వీరిలో ఒకరు స్థానిక సంస్థల నుంచి, ఇద్దరు లెజిస్లేటివ్ అసెంబ్లీ నుంచి ఎన్నికవుతారు.

వృత్తులు, పంటలు


వరి ముఖ్య ఆహార పంట. రాగి, మొక్కజొన్న, కొర్ర, జనపనార ప్రధాన వాణిజ్య పంటలు. వేరుసెనగ, నువ్వు, పెసలు, మినుగులు, పొగాకు కూడా పండించ బడతాయి. ఇచ్ఛాపురం, సోంపేట తాలూకాల కోస్తా ప్రాంతంలో కొబ్బరి తోటలు చాలా ముఖ్యమైనవి. పనస, జీడి మామిడి తోటలు అటు తరువాత స్థానం ఆక్ర మిస్తాయి. ఈ జిల్లా ప్రధాన వృత్తి వ్యవసాయం.

రాకపోకల సౌకర్యాలు

ఈ జిల్లాలో ఒక హెడ్ పోస్టాఫీసు, 32 సబ్–పోస్టాఫీసులు. 360 బ్రాంచి ఆఫీసులు. 25 టెలిగ్రాఫ్ ఆఫీసులు, 17 పబ్లిక్ కాల్ ఆఫీసులు ఉన్నాయి.

ఈ జిల్లాలో 147 మైళ్ల బ్రాడ్‌గేజ్ రైలు మార్గము, 21 మైళ్ల నారోగేజ్ మార్గము వున్నాయి. మద్రాసు–కలకత్తా మార్గం చీపురుపల్లి, శ్రీ కాకుళం, నరసన్నపేట, టెక్కలి, సోంపేట, ఇచ్ఛాపురం తాలూకాల మీదుగా పోతుంది. టెక్కలి తాలూకా నౌపడా నుంచి నారోగేజ్ మార్గం రైలు దేరి పాత పట్నం మీదుగా ఒరిస్సాలోని పర్లాకిమిడి, గుణుపురాలను చేరుతుంది. విజయనగరం–రాయపూర్ బ్రాడ్‌గేజ్ మార్గం సాలూరు, బొబ్బిలి, పార్వతీపురం తాలూకాల మీదుగా వెడుతుంది. బొబ్బిలి నుంచి సాలురు పట్టణానికి ఒక బ్రాడ్‌గేజ్ మార్గం వుంది.

ఈ జిల్లాలో 967 మైళ్ల నిడివిగల రోడ్లు వున్నాయి. ఇందులో 134 మై. జాతీయ రహదార్లు, 38 మైళ్లు రాష్ట్ర రహదార్లు, 460 మై. జిల్లా పెద్ద రోడ్లు, 153 మై. గ్రామ రస్తాలు, 48 మై. మునిసిపల్ రోడ్లు. ఇక్కడినుంచి బయలు దేరే రోడ్లు విశాఖపట్నం జిల్లాకి, పక్కనున్న ఒరిస్సా రాష్ట్రానికి పోతాయి.



అరసవిల్లి సూర్యనారాయణాలయం

పరిశ్రమలు

బొబ్బిలిలో 2, సీతానగరంలో ఒకటి మొత్తం 3 పంచదార ఫ్యాక్టరీలు ఉన్నాయి. సహకార ప్రాతిపదికపై నెలకొల్పబడే మరొక ఫ్యాక్టరీ, ద్వితీయ పంచవర్ష ప్రణాళిక క్రింద త్వరలోనే ఆమదాలవలసలో ఏర్పాటుకాగలదని భావించబడుతున్నది.

జనపనార పరిశ్రమ, ఉప్పు పరిశ్రమ, (నౌపడా), జీడి మామిడి గింజల పరిశ్రమ (పలాస) లలో తగినంతమందికి పని దొరుకుతుంది. ఇక్కడ కొన్ని బియ్యం మిల్లులు, నూనె మిల్లులుకూడా వున్నాయి. గృహ, లఘు పరిశ్రమలు నేత పరిశ్రమలలో చాలామందికి పని దొరుకుతుంది.

అఖిల భారత ఖాదీ, గ్రామ పరిశ్రమల కమిషన్‌కి ఇక్కడ మూడు సంస్థలు ఉన్నాయి–ఎ. ఎఫ్. కె. కె. సంఘం, పొందూరు, ఉత్తరవిశాఖ సర్వోదయ సహాయక సమితి, మలియపుట్టి. జె. ఎన్. కె. సంఘం, సింగుపురం, బొంతల కోడూరు, మురపాక, హీరమండలం. చర్ఖా పరిశ్రమ, ఖాదీనేతలకు పొందూరు మిక్కిలి ముఖ్యమైన కేంద్రం ఈ జిల్లాలో అంబర్‌చర్ఖా పైలట్ పథకం 1956 - 57 లో ప్రారంభించబడింది. ఇప్పుడు దాదాపు 400 అంబర్ చర్ఖాలు పనిచేస్తున్నాయి. మామూలు చర్ఖాలపై దాదాపు 10,000 మంది నూలు వడుకుతారు, ఈ జిల్లాలో 150 గ్రామాలలో నూలు వడకటం ఎప్పుడూ కొనసాగే కుటీర పరిశ్రమ.

తరువాత ముఖ్యమైన కుటీర పరిశ్రమ నూనెగానుగలు. దీనిలో తగినన్ని గ్రామాలకు పని దొరుకుతుంది.

శ్రీకాకుళం, బొబ్బిలి, నరసన్నపేట తాలూకాలలో ఇత్తడి, కంచుపరిశ్రమలలో పెక్కుమందికి పని దొరుకుతుంది. సోంపేట, ఇచ్ఛాపురం తాలూకాలలో పీచు పరిశ్రమ

ముఖ్యమైనది. ఈ పరిశ్రమలో చాలాకుటుంబాలు నిమగ్నమయి వున్నాయి. ఈ జిల్లా కోస్తాగ్రామాలలో ముఖ్యంగా కళింగపట్నం, బారువ గ్రామాలలో మత్స్యపరిశ్రమ వర్ధిల్లుతున్నది, బొబ్బిలి తాలూకాలో వీణలు తయారవుతాయి. దాదాపు అన్ని తాలూకాలలోను కుండలు తయారవుతాయి.

విద్య

ఇక్కడ 64 సెకండరీ పాఠశాలలు, ఒక ఆర్ట్సుకాలేజీ వున్నాయి. సాంకేతిక లేక వృత్తివిద్యా కళాశాలలను ఇకప్రారంభించ వలసివుంది. విద్యా సంస్థల వివరాలు ఇవి :-

1. ఆర్ట్సుకాలేజీ, శ్రీకాకుళం 1
2. శిక్షణా పాఠశాలలు 3-1. ఒమరవల్లి వృత్తివిద్యా శిక్షణాపాఠశాల
   2. శ్రీకాకుళం ప్రభుత్వ ట్రైనింగ్ స్కూలు
   3. పార్వతీపురం ప్రభుత్వ ట్రైనింగ్ స్కూలు

పంచవర్ష ప్రణాళికలు

ఈ జిల్లాలో తొలి పంచవర్ష ప్రణాళిక సాంఘిక — ఆర్థిక పరిస్థితులలో తెచ్చిన మార్పు, చివరకుకలిగిన లాభాల ఫలితంగా ద్వితీయ పంచవర్ష ప్రణాళిక అమలుకి చక్కని అనువు ఏర్పడింది. కార్యక్రమాలలో ప్రజలు ఎక్కువగా పాల్గొంటున్నారు. వివిధ రంగాలలో చక్కని అభివృద్ధి సాధించబడుతున్నది.

ద్వితీయ పంచవర్ష ప్రణాళికా కాలంలో రూ. 548-02 లక్షలు కేటాయించ బడినవి. మామూలుగా చెప్పాలంటే, ఇంతవరకు వివిధ అభివృద్ధి కార్యకలాపాల క్రింద కేటాయింపులోసగానికిపైగా ఖర్చు చేయబడింది.

నీటి పారుదల

వంశధారా ప్రాజెక్టు భారీ ప్రాజెక్టు. ప్రణాళికలో ఒక భాగమైన ఇది ఇంకా పరిశీలనలో వుంది.

ప్రణాళికలో చేర్చబడిన 6 మధ్యరకం ప్రాజెక్టుల పని దిగువ ఘట్టాలలో వున్నది:-

1. నారాయణపురంవద్ద నాగావళిపై ఆనకట్ట - నిర్మాణంలో వుంది.
2. నాగావళి కుడి కాలవ ప్రాజెక్టు - దాదాపు పూర్తి అయింది.
3. వేగావతి ఆనకట్ట పథకం - దాదాపు పూర్తిఅయింది.
4. సీతానగరం ఆనకట్ట పథకం - రమారమి పూర్తి అయింది.
5. ఒట్టిగెడ్డ ప్రాజెక్టు - పరిశోధనలో వుంది.
6. పైడిగం ప్రాజెక్టు - పని జరుగుతున్నది.

దిగువ చిన్న పథకాలు ఆరు ప్రణాళికా కార్యక్రమాల క్రింద చేపట్టబడినవి. అవియేయేఘట్టాలలో వున్నవో దిగువ వివరింపబడినది:

1. సూరపాడు ఆనకట్ట —
2. కింతలికాలవ పథకం — పూర్తి అయినవి.
3. దేశపల్లికాలవ బ్రాంచిపనిబాగు—
4. ఓనిగెడ్డ ఆనకట్ట - పూర్తి అయినది.
5. మందగెడ్డ ఆనకట్ట - ఇటీవలే ప్రారంభమైంది.
6. రేగులపాడు గెడ్డ పథకం - పరిశీలనలో ఉంది.

పాలకొండ, పార్వతీపురం, శ్రీకాకుళం తాలూకాలకు నీరు పాతరెగ్యులేటరు అయిన తోటపల్లి రెగ్యులేటరుద్వారా లభిస్తుంది. పబ్లిక్‌వర్క్సు శాఖ కాని, రెవిన్యూ శాఖకాని పెద్ద చిన్న పంట నీటి వనరులను క్రమానుసారంగా బాగుచేస్తాయి. పూర్వ జమీందారీ ప్రాంతాలలోని పెక్కు పంటనీటి వనరులు ఇప్పుడు ప్రభుత్వం క్రిందికి వచ్చాయి. అవికూడా చెరువుల మరమ్మతు పథకం క్రింద ప్రత్యేకంగా మరమ్మతు చేయబడుతున్నాయి.

విద్యుచ్ఛక్తి

తాలూకా ముఖ్యపట్టణాలన్నిటికి విద్యుచ్ఛక్తి సౌకర్యం ఉంది. 79 గ్రామాలకు విద్యుచ్ఛక్తి లభిస్తున్నది. ఇందులో 30 గ్రామాలకు వీధి దీపాలు ఉన్నాయి. విద్యుచ్ఛక్తి మచ్ ఖండ్ ప్రాజెక్టునుంచి సరఫరా చేయబడుతున్నది. అక్కడినుంచే గరివిడి ఫ్యాక్టరీకికూడా విద్యుచ్ఛక్తి సరఫరా అవుతున్నది.

పంచాయతీలు

ప్రణాళికా కాలంలో పంచాయతీల సంఖ్య బాగా హెచ్చింది. వాటికి విరాళం ప్రాతిపదికపై అభివృద్ధి కార్యక్రమాలు అప్పగించబడుతున్నాయి.

పురపాలక సంఘాలు

శ్రీ కాకుళం, సాలూరు, పార్వతీపురాలలో నీటిసరఫరా

పథకాలు మంజూరు చేయబడినవి. వాటిపై పనిజరుగుతున్నది.

పరిశ్రమలు

పంచవర్ష ప్రణాళిక చలవన బారువలో పీచు పరిశ్రమ కేంద్రం, శ్రీకాకుళంలో కమ్మరం, వడ్రంగం కేంద్రం ఏర్పడినవి. ఆపైన పారిశ్రామిక సహకార సంఘాల ఏర్పాటు, అప్పుల మంజురులద్వారా పెక్కు ఇతర పరిశ్రమలకు ప్రోత్సాహ మివ్వబడింది.

విద్య

శ్రీకాకుళం ఆర్ట్సుకాలేజీ భవనం నిర్మాణంలో వుంది. ప్రణాళికా కాలంలో పెక్కు సెకండరీ, ప్రాథమిక పాఠశాలలు తెరువబడినవి.

సహకారం

ప్రణాళికా కాలంలో బుడితి, లక్ష్మీనరుసుపేటలలో ఇత్తడి, కంచు పనివారి పారిశ్రామిక సహకార సంఘం, పెక్కు బహుళార్థ సాధక, పరపతి సహకార సంఘాలు ఏర్పరచబడినవి.

వ్యవసాయం

ప్రణాళికా కాలంలో వ్యవసాయం క్రింద జరిగిన కొన్ని ముఖ్య కార్యక్రమాలు ఇవి :- రాగోలు పరిశోధన-ప్రదర్శన క్షేత్రం, ట్రాక్టర్లు, ఆయిల్ఇంజన్ల సరఫరా, విత్తనాలక్షేత్రాలు, విత్తనాల కొట్టుల ప్రారంభం.

పశుపోషణ

ప్రణాళికా కాలంలో జరిగిన ముఖ్య కార్యక్రమాలు ఇవి: శ్రీకాకుళంలో పశుల విస్తరణ కేంద్రం, పెక్కు ప్రథమ చికిత్సాకేంద్రాల ప్రారంభం, ఉత్తమ పశువులు, జాతి పశుల సరఫరా, రానికేట్ వ్యాధి నిర్మూలన పథకం,

సమాజాభివృద్ధి

ఈ జిల్లా 34 అభివృద్ధి కేంద్రాలుగా విభజించబడింది. ఇప్పుడు 17 కేంద్రాలు పనిచేస్తున్నాయి. వీటిలో 11మొదటి అంచెవి, 4 రెండవ అంచెవి, 2 పూర్వవిస్తరణ కేంద్రాలు. అభివృద్ధి కేంద్రాల వివరాలు ఇవి :—

వరుస సంఖ్య	కేంద్రం పేరు	రకం	ప్రారంభమయిన తేదీ	గ్రామాల సంఖ్య	చ. మైళ్ళలో విస్తీర్ణం	జనాభా
1.	ఇచ్ఛాపురం	రెండవ అంచె	4–4–54	51	87.58	78,761
2.	ఆమదాలవలస	,,	4–4–54 1–4–55	50	63.30	62,685
3.	సరిబుజ్జిలి	,,	1–4–58	137	105.46	62,823
4.	గార	,,	4–4–54 1–4–55 1–4–59	28	64.61	70,077
5.	పాలకొండ	మొదటి అంచె	1–4–56 1–4–58	94	70.66	63,218
6.	సోంపేట	,,	1–4–56 1–4–58	129	76.55	73,491
7.	మందస	,,	1–4–56 1–4–58	166	59.09	63,865
8.	షేర్‌మహమ్మదుపురం	,,	1–4–56 1–4–58	66	86.54	76,859
9.	నరసన్నపేట	,,	1–4–57 1–4–58	84	91.34	75,624

వరుస సంఖ్య	కేంద్రం పేరు	రకం	ప్రారంభమయిన తేది	గ్రామాల సంఖ్య	చ. మైళ్ళలో విస్తీర్ణం	జనాభా
10.	పరవకోట	,,	1–4–57 1–4–58	169	149.79	67,613
11.	కోటబొమ్మలి	,,	2–10–57 1–4–58	84	109.08	71,881
12.	సీతంపేట (ఏజన్సీ)	,,	2–10–57 1–4–58	155	194.73	25,604
13.	భద్రగిరి	,,	1–4–58	199	244.50	24,855
14.	పురపాక పూర్వవిస్తరణ కేంద్రం. మొదటిఅంచె కేంద్రం		1–4–58 1–4–59	97	126.43	73,148
15.	రామభద్రపురం	మొదటిఅంచె	2–10–58	171	242.71	72,777
16.	బొబ్బిలి	,,	1–4–59	58	100.66	66,136
17.	చెక్కలి	పూ. వి. కేంద్రం		92	65.70	54,016
				1828	1908.23	1061,195

మొత్తంమీద ఈ జిల్లాలోను ప్రధానంగా అభివృద్ధి కేంద్రాలలోను జపాను పద్ధతి వరిసాగు, పచ్చి యెరువు వాడకం, పెంట ఎరువు తయారీ, రసాయన ఎరువుల వాడకాలు సర్వ సాధారణ విషయాలయినవి. బాపట్లలోని భూసార పరిశోధన కేంద్రం చక్కగా వినియోగించుకోబడింది. భూమి నమూనాలు ప్రతి అభివృద్ధి కేంద్రంనుంచి పంపబడినవి. కార్యక్రమాలన్నిటిలోను మొక్కల రక్షణ మిక్కిలి జనాదరణ పొందుతున్నది.

అభివృద్ధి కేంద్రాలక్రింద మొత్తం 48 శాతం ప్రాంతం ఉన్నది. సమాజాభివృద్ధి కార్యక్రమాల క్రింద మొత్తం 48 శాతం ప్రజలున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల స్థాపనకు, గ్రామ రస్తాలు, మంచి నీటి బావులు, పాఠశాలా భవనాల నిర్మాణానికి విరాళాలతో ప్రజలు ముందుకు వస్తున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల స్థాపనకు దాదాపు అన్ని కేంద్రాలు విరాళాలతో సిద్ధంగా ఉన్నాయి. 16 కేంద్రాలలోను రెండు ఏజన్సీ కేంద్రాలు. ఒకటి పంచాయతీ కేంద్రం. గార సమితి కేంద్రం కళింగపట్నం శివారు తాన్‌సాహెబు పేటలో కుటుంబానికొక ప్రణాళిక పథకం అమలు పరచబడింది. ఆదర్శ పథకాల అమలుకై గార కేంద్రంలో రెండు గ్రామాలు ఎన్నుబడినవి. ప్రతి గ్రామ స్థాయి కార్యకర్త గ్రూపులోను ఒక ఆదర్శ రైతు వ్యవసాయంలో ఆధునిక పద్ధతుల అమలుకై ఎన్నబడ్డాడు. 4 అభివృద్ధి కేంద్రాలలో సుమారు 4.000 ఎకరాలలో రాబీ ఉద్యమం ఆరంభించ బడింది. అద్భుతమైన ఫలితాలు సాధించబడినవి. ఖరీఫ్ ఉద్యమం కూడా ప్రారంభించబడింది. ఒక ప్రదర్శనలో వ్యవసాయ స్టాలును చూడటానికి ఢిల్లీకి, ఆధునిక పద్ధతులను చూడటానికి ఇతర జిల్లాలకు ఈ జిల్లాకర్షకులు పంపబడ్డారు. ఈ జిల్లా అంతటా కళాశాల, పాఠశాలా విద్యార్థులు జపాను పద్ధతిలో నాట్ల పనిలో క్రమం తప్పకుండా పాల్గొంటారు.

స్థానిక అభివృద్ధి పనులు

ఈ పథకం 1953-54 నుంచి అమలులో ఉంది. 1.4.56 కి పూర్వం రూ॥ 10,65,770 సాధారణ గ్రాంటు క్రింద 135 పనులు చేపట్టబడినవి. రూ॥ 6,05,240 ఖర్చుతో 131 పనులు పూర్తి చేయబడినవి.

ద్వితీయ పంచవర్ష ప్రణాళిక ప్రారంభమాది (అనగా 1.4.56) వివిధ తరగతులక్రింద చేపట్టబడిన, పూర్తి చేయబడిన, వాయిదాలలోనున్న పనుల వివరాలు దిగువ ఇవ్వబడినవి.

	చేపట్టిన పనుల సంఖ్య	పూర్తైన వాటి సంఖ్య	వాయిదాలోనున్న వాటి సంఖ్య
బావులు	92	85	7
లిఫ్టు ఇరిగేషన్ పనులు	2	1	1
రోడ్లు	14	2	12
పాఠశాలలు	14	—	14
డిస్పెన్సరీలు	3	—	3
పఠన మందిరాలు, లైబ్రరీహాల్సు, వసతి గృహాలు వగైరా ఇతర పనులు.	2	—	2
	127	88	39

గ్రామ రస్తాల అభివృద్ధి సహకార పథకం

ఇది 1955-56 నుంచి అమలులో ఉంది. ప్రస్తుత ప్రణాళిక సమాప్తి వరకూ అది కొనసాగవచ్చు.

ఈ పథకం ఆరంభమాది కేంద్ర ప్రభుత్వంచే 14 పనులు మంజూరు చేయబడినవి. వీటిలో 9 పూర్తి అయినవి. మిగిలినవి జరుగుతున్నవి.

గ్రామ ప్రణాళిక పథకాలలో రోడ్లు

ఈ పథకం 1957-58 నుండి అమలులో ఉంది. 1957-58 లో రూ॥ 98,750 లు మంజూరు చేయబడినవి. దాదాపు మూడు లక్షలు ఖర్చయే 14 పనుల అమలు ప్రారంభించబడింది. 31-3-58 నాటికి రూ॥ 2970 ఖర్చు చేయబడినవి. 1958-59 లో రూ॥ 39,500 లు మంజూరు చేయబడినవి. వీటిలో 31-3-59 నాటికి దాదాపు రూ॥ 27,000 ఖర్చు చేయబడినవి.

జాతీయ గ్రామనీటి సరఫరా, పారిశుద్ధ్య కార్యక్రమం

ఈ పథకంక్రింద యిచ్ఛాపురం. సోం పేట. టెక్కలి. నరసన్నపేట, శ్రీకాకుళం, చీపురుపల్లి తాలూకాల సముద్రపు వైపు గ్రామాలు. పాతపట్నం తాలూకా సరుబుకోట మొదటి అంచె కేంద్రం గ్రామాలు వున్నాయి. సర్వేపని జరుగుతున్నది.

ఈ పనులకు దాదాపు రూ. 9. - 5 లక్షల ఖర్చు కాగలదని అంచనా.

సాంఘిక సంక్షేమం

ప్రణాళికా కాలంలో 6 ప్రభుత్వ వసతి గృహాలు (5 మగ పిల్లలకు, ఒకటి బాలికలకు), 17 సాం. సం. పాఠశాలలు, 15 సబ్సిడీ హాస్టల్సు, 7 గృహ వసతి కాలనీలు చేపట్టబడినవి. పేద విద్యార్థులకు, అవసరంలోవున్న విద్యార్థులకు విద్యార్థి వేతనాలు ఇవ్వబడినవి. హరిజనులకు మంచినీటి బావులు తదితర సౌకర్యాలు కల్పించబడినవి. 100 ఎకరాల భూమి దాదాపు 1600 కుటుంబాలకు ఇళ్లస్థలాలుగా ఇవ్వబడింది. సాంఘిక సంక్షేమ పాఠశాలల్లో చదివే పిల్లలందరకు మధ్యాహ్నంభోజనాలు సరఫరా చేయబడుతున్నవి.

ఏజన్సీ అభివృద్ధి

ఏజన్సీ అభివృద్ధిక్రింద 5 గిరిజన కాలనీలు. పెక్కు బాటలు నిర్మించబడినవి. ఆపైన గిరిజనుల శ్రేయోభివృద్ధికై పెక్కు గ్రాంటు యిన్ యెయిడ్ పథకాలు చేపట్టబడినవి.

స్త్రీ సంక్షేమం

ఈ శాఖక్రింద ఒకవృత్తి విద్యా శిక్షణాకేంద్రం, అయిదు స్త్రీ సంక్షేమ కేంద్రాలు నెలకొల్పబడినవి.

జిల్లా ప్రాజెక్టు అమలు సంఘం

ఈ సంస్థ క్రింద యీ జిల్లాలో 10 సాంఘిక సంక్షేమ కేంద్రాలు పనిచేస్తున్నాయి.

ఈజిల్లా శా. స. స., పా. స., శా. మం. స. వివరాలు ఇవి:-

1.	శ్రీ బి. రాజగోపాలరావు.	పా. స.	ఆమదాలవలస
2.	శ్రీ బి. సత్యనారాయణ దొర.	పా. స.	వీరఘట్టం
3.	శ్రీ డి. సూర్య దొర.	పా. స.	తోనం
4.	శ్రీ సి. హెచ్. సత్యనారాయణ.	శా. స. స.	షేర్ మహమ్మదుపురం
5.	శ్రీ పి. ఎస్. నారాయణ.	,,	శ్రీకాకుళం
6.	శ్రీ టి. పాపారావు.	,,	నగరికటకం
7.	శ్రీ ఎం. సత్యనారాయణరావు.	,,	చీపురుపల్లి
8.	శ్రీ కె. పున్నయ్య.	,,	చీపురుపల్లి
9.	శ్రీ పి. ఎస్. అప్పారావు.	,,	పాలకొండ
10.	శ్రీ సి. హెచ్. శ్రీరంగనాయకులు.	,,	
11.	శ్రీ అడ్డాకుల లక్ష్మీనాయుడు.	,,	నాగూరు
12.	శ్రీ వి. సి. హెచ్. చూడామణీదేవ్.	,,	పార్వతీపురం
13.	శ్రీ కె. సీతారామస్వామినాయుడు.	,,	బొబ్బిలి
14.	శ్రీ పెద్దింటి రామస్వామి నాయుడు.	,,	బలిజిపేట
15.	శ్రీ బోయిన రాయియ్య.	,,	సాలూరు
16.	శ్రీ ఎస్. జగన్నాథం.	,,	నరసన్నపేట
17.	శ్రీ అల్లు ఎరుకు నాయుడు.	,,	సాలూరు
18.	శ్రీ ఎల్. లక్ష్మణదాస్.	,,	పాతపట్నం
19.	శ్రీ పి. గున్నయ్య.	,,	పాతపట్నం
20.	శ్రీ ఆర్. ఎల్. నరసింహం.	,,	టెక్కలి
21.	శ్రీ ఎన్. రాములు.	,,	బ్రాహ్మణతర్ల
22.	శ్రీ జి. లచ్చన్న.	,,	సోంపేట
23.	శ్రీ యు. రంగబాబు.	,,	ఇచ్ఛాపురం
24.	శ్రీ టి. రాఘవేందర్.	శా. మం. స.	శ్రీకాకుళం
25.	శ్రీ సి. హెచ్. పరశురాము నాయుడు.	,,	పార్వతీపురం
26.	శ్రీ బి. కూర్మన్న.	,,	టెక్కలి

మహాంధ్రము

శ్రీ అన్నాప్రగడ శ్రీరామమూర్తి.

సీ॥ ఏనాఁటి యేలిక ఈ నాటి పీలిక
ఈ నాఁటి కేక మౌటెవరి చలువ
నాగార్జునుని పేర నాల్గు కోట్ల కడుపు
మంటలు చల్లార్చు మాన్యులెవరు
సాహిత్య సంస్థలో శారద గజ్జియల్
గలుగల్లుమనిపించు ఘటికు లెవరు
జానిసత్వమ్ములో మానుషత్వమ్మనే
మేలుకొల్పిన ప్రబుద్ధాళి యెవరు
ఈ మహాంధ్రమ్ము మనకిట్టు లిచ్చి రెవరు
ఈ నవోదయ మాంధ్రులకిచ్చి రెవరు
తెలుఁగువెలుఁగును వెలుఁగును తెలుఁగుచేయు
సుకృతి పరతంత్రులాంధ్ర నాయకులువారు

సీ॥ అలనాటి కవికోటి కలగీతి వినిపించు
నొక కోకిలమ్మ కుహూ కుహూ మన
అలప్రజావాహిని యలజడి అనిపించు
ఈ వాహిని యప్రవహించుచుండ
నాగార్జునుని మహోన్నతి యెల్ల కనిపించు
నీ పర్వతమ్ము స్థాయి తిలకింప
విశ్వవిద్యాలయ విభవమ్ము తలపించు
ఈ పాఠశాలా నిరీక్షణమున
బహు శతాబ్దుల క్రిందటి పట్టణమ్ము
విజయపురియందు నేడు కన్పించుచుండె
కవిగ బ్రతికెడు నొక్క మానవుని కనుచు
గత చరిత్రను మదిలోన కాంచునపుడు.

సీ॥ ఇదియచే తిక్కన్న యెనసిబ్రహ్మత్వమ్ము
పదునేను పర్వాలు వ్రాయుచోటు
ఇదియొ కో కవియైన కృష్ణరాయని కళా
కాంతుల తళతళల్ గలుగు నేల
ఇదిగదా పల్లవులెన్ని కంగన్నట్టి
శిల్పమ్ము మొగ్గవేసిన స్థలమ్ము
ఇదె బాలచంద్రుని యెనలేని శౌర్యమ్ము
సూర్యాతపమ్ముగా సోకిన యిల
ఈ మహాంధ్రమ్ము నలుమూల లెంచియెంచి
ప్రగతి పథముల ప్రజమనోరథముతోడ
నడచు గాత ప్రభుత్వయంత్రమ్ము నేడు
సంస్కృతికి సంపదకు ప్రతిష్ఠను గడించి.

ఎంత అల్ప కార్యమైనా సరే, శక్తివంచన లేకుండా దాన్ని నిర్వహించాలి, అతి ప్రధానమైన కార్యానికి ఎంత శ్రద్ధ వహిస్తామో అల్పమైన కార్యం పట్ల కూడా అలాంటి శ్రద్ధాసక్తులే కనపరచాలి. ఎందుకూ అని ప్రశ్నిస్తారేమో; అలాంటి అల్పకార్యాల నిర్వహణలో మీరు చూపిన శ్రద్ధాసక్తులనుబట్టే లోకం మీగూర్చి చెప్పుకుంటుంది.

— మహాత్మాగాంధీ

*   *   *

ఆరోగ్యం, ప్రతిభాసంపత్తులు, శక్తిసామర్థ్యాలు, కార్య సాఫల్యత, ఆనందకరమైన బాల్యం, సుఖప్రదమైన గృహ జీవితం — ఇవన్నీ మీకు ఒనగూరాయంటే రావలసి వుండి వచ్చాయనుకోకండి. అవన్నీ కలిసి వొచ్చిన అదృష్టాలు. వాటిని పొందినందుకు గాను కృతజ్ఞతాసూచకంగా మీరు కూడా ఇతరుల జీవితాలకోసం ఎంతో కొంత త్యాగం చెయ్యాలి.

— ఆల్బర్ట్ష్వైజర్

నరసంపేట బహుళార్థ సాధక ప్రాజెక్టు

కోయ ప్రజల పూర్తి సహకారం

వరంగల్లు జిల్లా నరసంపేటలో 1-4-56 నుంచి ఒక బహుళార్థ సాధక ప్రాజెక్టు నెలకొల్ప బడింది. కాని అది పనిమాత్రం 1-4-57 నుంచి ఆరంభించింది. అప్పటి రాష్ట్ర ప్రణాళికలు, అభివృద్ధి శాఖా మంత్రి దానిని 27-6-57 న శిలాంఛనంగా ప్రారంభించారు. ఈ ప్రాజెక్టు క్రింద నరసంపేట, ములుగ్ తాలూకాలలోని కొన్ని ప్రాంతాలు ఉన్నాయి. దాని క్రింద 276 గ్రామాలు, 417.1 చ. మై. ప్రాంతం ఉన్నాయి. జనాభా దాదాపు 50,000. ఇందులో రమారమి సగం గిరిజనులు. వీరిలో ఎక్కువ మంది కోయలు లేక గోండ్లు.

ఈ ప్రాజెక్టు ప్రాంతం మరీ పెద్దది అయినందున ములుగ్ తాలూకా ఏటూర్‌నగరంలో ఉప ముఖ్య కార్య స్థానం ఏర్పాటును ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ ప్రాజెక్టు ప్రాంతం జిల్లాలో మిక్కిలి వెనుకబడిన ప్రాంతం. చాలా గ్రామాలలో జనాభా బహు పలచగా ఉంటుంది. గ్రామాలు దూరదూరంగా ఉన్నాయి. రాకపోకల సౌకర్యాలు బహు తక్కువ. ఈ ప్రాంతంలో అత్యధిక భాగం దట్టమైన అరణ్యాలచే కప్పబడి ఉంటుంది. ఈ అరణ్యాలు మాత్రం అమూల్యమయినవి. కోయలు బహు పేద వారు. వారి వ్యవసాయ పద్ధతులు బహు ప్రాచీన మయినవి.

పరిసరాల పారిశుధ్యం, వైద్య సహాయం, గృహవసతి, విద్య, రోడ్లు వగైరా సౌకర్యాల కల్పనద్వారా గిరిజనుల సర్వతోముఖాభి వృద్ధికి కృషి చేయటం ఈ ప్రాజెక్టు ప్రధాన ఆశయం. వారి వ్యవసాయ పద్ధతుల అభివృద్ధి, పశు సంపద రక్షణ కూడా ప్రాజెక్టు కార్యక్రమంలో ఉన్నాయి. కోళ్ల పెంపకం, పశు పోషణ, తేనె టీగల పెంపకాలవంటి ఉప వృత్తుల కల్పనకూడా ఉద్దేశించ బడింది. కోయలకు వడ్రంగం, కమ్మరం, చర్మకార పరిశ్రమ, చేనేతలలో శిక్షణ ఇవ్వటానికై నరసంపేటలో ఒక ఏకీకృత శిక్షణ-ఉత్పత్తి కేంద్రం ప్రారంభింపబడింది. ఇందువల్ల కోయలకు కొత్త అవకాశాలు లభిస్తాయి ఈ విధంగా వారి ఆర్థిక స్థాయిని హెచ్చించి, వ్యవసాయం, పశు పోషణ, పరిశ్రమలలో సాధించబడిన వైజ్ఞానికాభి వృద్ధులను వారికి అందు బాటులోనికి తేవాలని సంకల్పం.

వ్యవసాయం

కోయల ప్రధాన వృత్తి వ్యవసాయం, వారి కమతాలు దూరదూరంగా వున్నందున సౌష్టవమైన చవుక పద్ధతిలో వారు వ్యవసాయం చేయలేక పోతున్నారు. ఇదే వారి అతి పేదరికానికి కారణం. అరణ్యాల కంట్రాక్టరులు వారిచే చెట్లు కొట్టించుకొంటారు. బీడీ ఆకులు యేరటం వగైరా పనులు చేయించు కుంటారు. ఈ ప్రాంతం బాగా మెట్ట ప్రాంతం. మాగాణీ సాగు క్రింద బహు స్వల్ప ప్రాంతం వుంది. మొక్కజొన్న, జొన్న, ఇతర మెట్ట ధాన్యాలు ఇక్కడి ప్రధాన పంటలు. ఈ ప్రాంతానికవసరమయిన విత్తనాల తయారీకై వరి విత్తనాల ఉత్పత్తి క్షేత్రం నెల కొల్పబడింది. నానాటికి హెచ్చుగా వాడబడుతున్న ఉత్తమ మొక్కజొన్న విత్తనాల వుత్పత్తికై వ్యవసాయ శాఖ మరొక విత్తనాల క్షేత్రాన్ని నెలకొల్పుతున్నది. ఉత్తమ విత్తనాలను రసాయన ఎరువుల్ని అందుబాటు చేయటానికై గిడ్డంగులు నిర్మించ బడుతున్నాయి. అప్పుడే గూడూరులో ఒక గిడ్డంగి చేపట్టబడింది. ఇది కోయలకు బాగా అందుబాటులో ఉంటుంది. ఉత్తమ రకాల విత్తనాలు, రసాయన ఎరువుల వాడకం వ్యాప్తికై సబ్సిడీలు ఇవ్వ

బడుతున్నాయి. 1726 మణుగుల వుత్తమ విత్తనాలు, 4.964.4 మణుగుల రసాయన ఎరువులు పంపిణీ చేయబడినవి. ఈ సంవత్సరం రూ॥ 2,500 వరకు సబ్సిడీలు ఇవ్వబడినవి. ఆధునిక వ్యవసాయ పద్ధతుల ప్రచారానికై ప్రదర్శనలు, మేలాలు ఏర్పాటు చేయబడుతున్నాయి. ఈ కార్యక్రమంలో ఒక భాగంగా, పచ్చి ఎరువు వాడకం వ్యాప్తికై కృషి చేయబడుతున్నది. కొందరు కోయలు పచ్చి ఎరువును వాడుతున్నారు. కాని ఈ ప్రాంతాన్ని విస్తరించటానికై తీవ్ర కృషి ప్రారంభించబడుతున్నది. వచ్చే ఋతువులలో పొలాల సరిస్సు కాలువల వారే కానుగ చెట్లను నాటాలని సంకల్పం.

వ్యయసాయ కార్యక్రమం క్రింద మొక్కల రక్షణ చర్యల ప్రచారానికై వసతి కల్పించబడింది, ఇందువల్ల 15, 20 శాతం నష్టం తప్పగలదు.



కోయ నృత్యం.

పశుపోషణ

ప్రాజెక్టు ప్రాంతంలో పశు సంతతి అభివృద్ధి రక్షణలకు రూ॥ 60.000 కేటాయించబడినవి. పశుసంతతి అభివృద్ధికి ద్విముఖమయిన చర్య తీసుకొనబడుతుంది. ప్రకృతి సిద్ధమయిన జాతి అభివృద్ధి, కృత్రిమ పిండోత్పత్తి విధానాల అవలంబన కూడా ప్రబోధింప బడుతున్నాయి. కృత్రిమ పిండోత్పత్తి కేంద్రంతోపాటు ప్రభుత్వం నరసంపేటవద్ద ఒక కీలకగ్రామ కేంద్రాన్ని కూడా మంజూరు చేసింది. ఈ విధంగా ఈ ప్రాజెక్టు ప్రాంతమంతా సాధ్యమయినంత త్వరలో ఈ కృషి క్రిందకు రాగలదని ఆశించ బడుతున్నది. పశు చికిత్స విషయంలో గ్రామమందుల పెట్టెల సరఫరాకై వసతి కల్పించ బడింది. ఇందువల్ల పశుచికిత్సా సౌకర్యాలు గిరిజనుల ఇళ్ల వద్దనే లభిస్తాయి.

కోళ్లజాతి అభివృద్ధి విషయంలో, ఈ సంవత్సరంలో నరసంపేటలో ఒకటి, ఏటూరు నగరంలో ఒకటి రెండు కేంద్రాలను నెలకొల్పాలని సంకల్పం. ఈ కార్యక్రమం క్రింద గిరిజనులకు మార్పిడి ప్రాతిపదికపై విదేశీ పుంజులను సరఫరా చేయాలని సంకల్పం. ఈ విధంగా స్థానిక పుంజుల తొలగింపు ద్వారా స్థానిక పక్షిజాతి అభివృద్ధి పరచబడుతుంది. ఇందువల్ల దేశవాళీ పెట్టలు ఎక్కువ గుడ్లు పెడతాయి కూడా. అభివృద్ధి చెందిన పక్షులు రోగాలకు తట్టుకొని కష్ట భూయిష్టమయిన స్థానిక పరిస్థితులలో బాగా మనగలుగుతాయి. గుడ్లు ఏభై శాతం వాపసు ప్రాతిపదికపై అనగా లాభం పొందిన వ్యక్తి పిల్లలలో సగం గుడ్లు పొడిగే కేంద్రానికి ఇచ్చే పద్ధతిపై సరఫరా చేయబడతాయి. ఈ పద్ధతి కోయలు కోళ్ల పెంపకాన్ని ఉప వృత్తిగా చేపట్టటానికి బాగా తోడ్పడు తుంది. కార్యక్రమంలో ఒక భాగంగా శాస్త్రీయ పద్ధతిలో పెంపకానికై కోయలు విదేశీ పుంజులను, పెట్టలను తీసుకొనటానికి ప్రోత్సాహ మివ్వబడుతుంది.

గిరిజనులకు విరాళం ప్రాతి పదికపై ఆబోతుల సరఫరాకై ప్రాజెక్టు బడ్జెటులో వసతి వుంది. 1957 ఏప్రిలు, 1958 జనవరి నెలల మధ్య గేదెలను, పోతులను కొనటానికి వారికి ప్రోత్సాహ మివ్వబడింది. 2169 పశువులకు చికిత్స

చేయబడింది. 3020 పశువులకు టీకాలు వేయ బడినవి. 220 నాసి ఎడ్లకు విత్తు కొట్టబడింది.

సహకారం

సహకారం క్రింద ఈ బడ్జెటులో రూ॥ 2 లక్షలు కేటాయించబడినవి. ఇదంతా గ్రాంటు. ఈ విషయంలో పథకాలకు ఇంకా తుది రూప మివ్వ బడలేదు.

ప్రాజెక్టు కార్యక్రమం ఆరంభమయే సరికి 5 సహకార సంఘాలుండేవి. ఈ స్వల్ప కాలంలో 15 సహకార సంఘాలు యేర్పాటు చేయబడినవి. వాటా మూలధనంగా రూ॥ 3,849 సేకరించ బడినవి. 567 మంది సభ్యులు చేర్చబడ్డారు. నరసంపేటలో పెద్దరకం పరపతి సంఘం ఏర్పాటుకి ఇటీవలి వరకు కృషి చేయబడింది. మొత్తం మీద ప్రజలంతా వెనుకబడి వున్నందున వాటా మూల ధనంగా రూ॥ 5,000 సేకరించటం కష్టమయింది. చిన్న పరపతి సంఘాలను ఏర్పాటు చేయమని ఇటీవలే ఆదేశాలు ఇవ్వబడినవి. సాధ్యమయినన్ని చిన్న పరపతి సంఘాల ఏర్పాటుకి ఇప్పుడు తీవ్రంగా కృషి చేయబడుతుంది.



కోయ కుటుంబం — నరసంపేట అశోకనగరం కాలనీలో అలంకృతమయిన స్వగృహంలో.

ప్రాజెక్టు కార్యక్రమంలో ఒక భాగంగా పారిశ్రామిక సహకార సంఘాల ఏర్పాటుకి కృషి చేయబడుతున్నది. నరసంపేటలో వడ్రంగులకు ఒక సహకార సంఘం ఏర్పాటు చేయబడింది.

గ్రామకళలు, వృత్తులు, పరిశ్రమల క్రింద పథకాలు ఇటీవలే ఆమోదించ బడినవి. నరసంపేటలో ఒక ఏకీకృత శిక్షణ—ఉత్పత్తి కేంద్రం ఏర్పాటు చేయబడింది. ఇక్కడ ఇచ్చే శిక్షణ కోయలు వడ్రంగం, కమ్మరం, తోలు వస్తువుల తయారీ, నేత మున్నగు పరిశ్రమలను చేపట్టటానికి ప్రోత్సాహమివ్వగలదు.

5 గ్రామాలలో గ్రామనాయకుల శిక్షణాశిబిరాలు నడుప బడినవి, 274 మంది గ్రామనాయకులకు శిక్షణ ఇవ్వబడింది. 17—1—58 న మధ్వాడలో ప్రత్యేకం గిరిజనులకు ఒక శిబిరం నడుపబడింది. ఆ సందర్భంలో 35 మంది గిరిజన నాయకులకు శిక్షణ యివ్వబడింది.

కొన్ని కాలనీలను నిర్మించి వివిధ గ్రామాల గిరిజనులు ఒక చోట స్థిరపడే యేర్పాటు చేయబడింది. వారికి గృహ వసతి సౌకర్యాలు కల్పించబడ్డాయి. వ్యవసాయానికి భూమి యివ్వబడింది. కాలనీ ప్రజలకై పాఠశాలలు కూడా ప్రారంభించబడ్డాయి. కాలక్షేపానికి వారికెంతో యిష్టమయిన వినోద కార్యక్రమాలు కూడా యేర్పాటుచేయబడుతూ వుంటాయి.

ప్రజా సహకారం

కోయలు రెండు సంవత్సరాలకొక సారి ములుగ్ తాలూకా మేదరంలో పెద్ద జాతర చేసుకుంటారు. అది లోపలగా పబ్లిక్ వర్క్సుశాఖ రోడ్డు నుంచి ఎమారమి 12 మైళ్లదూరంలో వుంది. అది ఫిబ్రవరిలో పున్నం తరువాత వచ్చే మొదటి గురువారం జరుగుతుంది. వారు సమ్మక, సరళమ్మలను ఆరాధిస్తారు, వారికి విగ్రహారాధన లేదు. అందరి గిరిజనులవలనే వారు సామాజికంగా జీవిస్తారు. ఈ



కోయ పిల్లల డ్రిల్లు—నరసంపేట వల్లభనగరం కాలనీ

కారణం వల్లనే సమాజాభివృద్ధికి వారి సహకారం లభించింది. గడచిన 20 సంవత్సరాలుగా వారికి సాంఘిక సేవ శాఖ నుంచి ప్రభుత్వ సహాయం లభిస్తూనే వుంది.

ఈ కార్యక్రమం గిరిజనులను క్రమేణా ప్రభావితులను చేస్తున్నది. వారి నిమిత్తం తయారయిన వివిధ పథకాల క్రింద గరిష్ఠలాభాన్ని పొందటానికి వారిప్పుడు ఆత్రుత చూపుతున్నారు. పంట వసరుల బాగు, రోడ్ల నిర్మాణం పట్ల వారి ఆసక్తి మరీ యెక్కువగా వుంది. ప్రాజెక్టు సలహా సంఘంలో ముగ్గురు గిరిజనులు చేర్చుకోబడ్డారు. ముఖ్యంగా శ్రీరాగలింగయ్య శిక్షితుడయిన గ్రామ నాయకుడు. అతను ప్రాజెక్టు కార్యక్రమంలో శ్రద్ధ తీసుకుంటున్నారు. కనీసం యిద్దరు ముగ్గురు గిరిజనులకు గ్రామస్థాయి కార్యకర్తలుగా శిక్షణ నిచ్చి బ్లాకు సిబ్బందిలో చేర్చుకోటానికి కృషి జరుగుతున్నది. ఇట్టి చర్యవల్ల గిరిజనుల సహకారం హెచ్చగలదని గుర్తించబడింది.

పరివర్తన

శ్రీ ఉ. నాగేశ్వరశర్మ

కళ్యాణపురం ప్రకృతిశోభలతో తులతూగుతుండే మనోహర ప్రదేశము. రామశాస్త్రి ఆ వూళ్ళోతల్లోనాలిక వంటివాడు. కాంతమ్మ రెండోవివాహానికి చేసుకున్న అతని ధర్మపత్ని. హైదరాబాద్‌లో కాలేజిలో చదువుకొంటున్న కాంతారావు ఆ దంపతుల ఏకైకపుత్రుడు. రామశాస్త్రి బహూ ఛాందసుడు. సనాతన ఆర్యధర్మాలు, వైదిక జ్ఞానాలు, అతని విభూతి పిండికట్లలో, మెళ్లోని రుద్రాక్షమాలలో, స్వర్ణాక్షరాల్లా కనబడుతుంటవి. వృద్ధాప్యంలో అతని ఆశయం కాంతారావుకి మంచి సాంప్రదాయం, స్థితిగతులు కలిగిన సంబధంచూచి ఓ ఇంటివాణ్ణిగా చెయ్యాలనే. అందుచేతే రోజూ ఒక అరడజను జాతకాల్ని తిరగేస్తుంటాడు. కాంతారావు సంస్కృతి వేరు. తండ్రికి తనపై గల వాత్సల్యాన్ని, అనురాగాన్ని, అతను బాగా అర్థంచేసికొన్నా, తన వివాహంపట్ల ఆయన వైఖరి మాత్రం అతనికి నచ్చలేదు. పోతే కాంతమ్మకు ఈ భిన్నస్వభావాలు బాగా తెలిసుండినా, కాంతారావు వివాహంపట్ల, ఇటు చండశాసనుడైన తనభర్తనైనా, అటు తనకుండేటికి మూడేకాళ్లని సాధించే కొడుకునైనా సమర్థించే సాహసంలేదు.

ఆ రోజు రోహిణి కార్తిక— "అయితే నేను అనుకొన్నంతా అయిందీ...." కాఫీ పొడి సీసా తోగుమ్మాని కానుకొని తెల్లబోయి చూస్తున్న కాంతమ్మతో అంటున్నాడు శాస్త్రి :

"చూస్తున్నావూ?....వద్దన్నా కాలేజి చదువో అని మొత్తుకొన్నావు....ఊర్కో అన్నారా 'స్త్రీ బుద్ధిః ప్రళయాంతకః' అని ఇప్పు డవగాహనమైంది. ఆ కాంపౌడులో ఎవతెనోచూచుకొన్నాడు....అదీ, వీడు, నవ్వుకొన్నారు. తర్వాత షికార్లు, సినీమాలు, ఈ వ్యవహారాలన్నీ మామూలుగా జరిగి ఉంటాయి. కొంపకొచ్చి లెక్చర్లు ఇస్తున్నాడు....పెళ్లి చేసికోడంనేను గాని నీవుగాదని. అందులో స్వేచ్ఛ. స్వాతంత్ర్యం అంటూ"

అగ్నిహోత్రంలా ఉంది ఆ మధ్యాహ్నం. కాంతమ్మకు ఇదంతా అయోమయంగాఉంది, ముమ్మందు ఇంకేం రభస జరుగుతుందో అనిగాభరాపడుతూ అలాగే నిలబడిపోయింది.

రామశాస్త్రి మరీఅందుకొని—"మన సాంప్రదాయాలకు, హోదాకు తగ్గట్టు నిక్షేపంలాంటి సంబంధం వస్తే వద్దంటావ్ ? నీకు ఈ పాడు బుద్ధి ఎలా వచ్చింది ? నిన్నింత వాణ్ణిగాచేసినందుకు ఇదా ప్రతి ఫలం ? నీకు నేనేమైనా తలెత్తుకొని బ్రతకాల్ని ఉందాలేదా ? స్వేచ్ఛట ! ఏమిటి నీ మొహం? మంచీ చెడూ చూచి పెద్దలుచేసిన పెళ్లిళ్లలో, భార్యాభర్తలు కొట్టుకొని చస్తున్నారని. ప్రేమించి పెళ్లిళ్ల చేసుకొన్నవారంతా ఉద్ధరిస్తున్నారనా ?....ఇదిగో ఏది ఏమైనాసరే....నీ యిష్టాలు గిష్టాలు. ఈ ఉపన్యాసాలు ఏది పనికిరావు ఈ విషయంలో. పెద్దనైన నామాట విన్నావా సరే. లేదా నీదారినీది, నీ యిష్టానుసారం జరగాలంటే, ఈ కొంపలో అడుగెట్టకు. అప్రతిష్టతో బ్రతకడంకన్నా ఈ క్షోభతోనైనా ఛస్తాను" అంటూ చండశాసనం చేసాడు రామశాస్త్రి.

ఇంతకూ ఈ రభసకి కారణం. కాంతారావు కాంతాన్వేషణే అని తేలిపోయింది. శాస్త్రిగారు అనుమానించి

నట్లు కాలేజి కాంపౌండులో కాకపోయిన, ఆ గాధ కళ్యాణపురంలోనే జరిగింది.

అనూరాధ రైతుగోపాలయ్యకు ఒక్కతే కూతురు. మాతృహీన. తన వృద్ధాప్యం వల్లనైతేనేమి, తన ప్రవర్తనవల్లనైతేనేమి, గోపాలయ్య ఆ వూళ్లో రైతుజనంలో ప్రత్యేక స్థానం సంపాదించుకొని, వారి ఆదరాభిమానాలకు పాత్రుడైనాడు. రామశాస్త్రికికూడా గోపాలయ్యంటే ఎంతో అభిమానం.

కాంతారావు అనూరాధల బాల్యస్నేహం వారిద్వరిలో అనురాగమై పెరిగింది. తన్నెవరు ఎంతన్నాసరే; అటు తన మిత్రబృందం—ఏ సంస్కృతి, విద్యలేని పల్లెటూరి దాన్ని వివాహం చేసుకొంటానంటావేమిరా ఫూల్ ! అన్నాసరే; లోకం, కులగౌరవాలు పాటించక 'రౌడీ'లా ప్రవర్తిస్తున్న కుర్రకుంక అన్నాసరే–అనూరాధని తప్పమరెవ్వర్ని వివాహం చేసుకోనని దృఢనిశ్చయంచేసి కొన్నాడు.

ఆ రోజు—శరత్పూర్ణిమ—రేరాజు చిలకపోసిన పండు వెన్నటి జల్లులో రాధకు ప్రమాణం చేసాడుకూడా—ఏదో ఉద్యోగం సంపాదించుకొన్నాక వివాహంచేసికొని స్వేచ్ఛగా బ్రతుకుదామని. ఆ ఆనందంలో భావికాలపు మధుర జీవితాన్ని అప్పుడేకలలు కంటూంటే, జీవితరంగంలో మధుర తరంగమొక్కటేదో తిరిగి పోయింది.

సరే ఇక ప్రేమగాధల ఆచారంగా కాంతారావు సాహసం ప్రారంభమయింది. సంఘాచారాల్ని సనాతనధర్మాన్ని, ప్రతిఘటించి, కాంతారావు తన ఆశయాన్ని నెరవేర్చుకో సంకల్పించాడు. ఆజ్ఞానుసారం ఇంటి మొఖం పట్టకుండా, కళ్యాణపురానికి ఆమడ దూరంలో ఉన్నగౌరిపూర్‌లో మధుమూర్తి ఇల్లు చేరాడు, అక్కడ్నుంచి ఏదోఉద్యోగాన్వేషణ చేసికోవచ్చని తన పరీక్ష ఫలితాల్ని ఎదురుచూస్తూ—

* * *

రెండు మూడు కేలండరు కాగితాలు కాల ప్రవాహంలో కొట్టుకుపోయినవి. అనూరాధలో భౌతికంగా ఏదో మార్పు కలిగడం మూలాన. కళ్యాణపురం మహిళాజనంలో కొన్ని సందేహాలు పులకరించి పోయినాయి. మందిరాల్లో, మంచి నీళ్లబావుల వద్ద, పౌరుగమ్మల గుసగుసలు, నోర్లు నొక్కుకోడాలు రాధమ్మ సహించుకోలేక పోయింది. కళ్యాణపురంలో అందరూ తన్నువేలెత్తిచూపు తున్నట్టుంది. ఇంతకు వారన్నదేమంటే—ఇక సందేహంలేదు. అనూరాధకిది మూడో........ఆ వాతావరణాన్ని సహించుకోలేక అనూరాధ కళ్యాణపురం వదిలి పోయింది. దారిలో వంతెనవద్ద దాహం తీర్చుకొనడానికని నదిలోకి దిగబోయి, కాలుజారిపడ్డంతో గాజులు బ్రద్దలైపోయినవి. కాసేపయాక, తెమలుకొని దాహం తీర్చుకొని గౌరీపూర్‌వైపు వెళ్లిపోయింది.

ఆ సాయింత్రం కాంతారావు ప్రియురాలికోసం ఇసుక దిబ్బలమీద నిరీక్షించి నిరీక్షించి విసుగెత్తి వెళ్లిపోతూవంతెన వద్దకి నడిచాడు. అక్కడగాజు ముక్కల్ని చూచి ఖంగారెత్తిపోయాడు. తనకు బాగాతెలుసు. అవి అనూరాధ చేతివని. ఏమి చెయ్య తోచక, ఆదుర్దాగా కళ్యాణపురం వెళ్లాడు. అక్కడ అనూరాధ కాంతారావుతో లేచిపోయిందని, గోపాలయ్య అవమానంతో మంచం బట్టాడని వారు వీరు అనుకొంటున్నారు. ఎవ్వరితోనూ చెప్పుకోలేని బాధతో కృశించిపోతూ. తనేదో జీవితంలో అమూల్య వస్తువును పోగొట్టుకొన్నట్టు, ఏదోనేరం చేసినట్టు బాధపడ్డాడు. ఆ రాత్రి మధుమూర్తితో—"మధు, నా జీవితమంతాకలత చెందిపోయింది. అనూరాధ ఇంత చేస్తుందని నేనెప్పుడూ అనుకోలేదు. హైదరాబాదు వెళ్లి ఏదోఉద్యోగం చూచుకొని, నా తిప్పలు నేను బడ్తాను" అని రుద్ధ కంఠంతో మాటాడుతుంటే—మధుమూర్తివద్దన లేకపోయాడు. ఆ రాత్రే, కాంతారావు హైదరాబాదు చేరుకొన్నాడు.

* * *

కళ్యాణపురంలో పుత్రవియోగంతో మంచం బట్టింది కాంతమ్మ. ముందున్న దారు మబ్బులకాలాన్ని కొంతైనా ఆలోచించకుండా విర్రవీగి పోతున్నాడు మార్తాండుడు ఆ రోజు. మరలా ఏదోప్రళయం ప్రారంభమయింది శాస్త్రి గారింట్లో.

"వాడు సంతోషంగా ఉంటే మనమూ సంతోషంకాదూ" అంది కాంతమ్మ మూలుగుతూ.

"చాల్లే....లోకంలో కొడుకులున్న వాళ్లందరూ ఇలాగే ఉన్నారా ?" అన్నాడు రామశాస్త్రి విసుక్కుంటూ. ఔన్సు గ్లాసులోకి మందుపోస్తూ.

"వాడేం తప్పుచేశాడని ? వాడూ చదువుకొన్నవాడే

కదా ? పని వాడంటూవుంటే ఏదో అభాండం వేస్తూనే ఉంటుందిలోకం'' అంది కాంతమ్మ దగ్గుతూ.

"చాల్లె అట్టె తెలివితక్కువగా మాటాడకు. ఏంచేశా డంటావ్ వెధవ సలుగు తలెత్తుకోకుండా చేశాడు నన్ను" అన్నాడు రామశాస్త్రి మందు అందిస్తూ.

"ఏ మైనా పుర్రితనం కదుటండీ ! మీరేం తక్కువ తిన్నారని మర్చారేమిటండీ. నేను కాపురానికి వచ్చిన రోజుల్లో ఈ ఊళ్లో జానకిని తమ రుంచుకొన్న రోజుల్ని ....'' అంటూ మూలుగుతూ లేచి కూర్చుంది.

రామశాస్త్రికి తనకి వేయి ఇంజక్షన్లు ఇచ్చినట్లయింది ఆ మాటతో ''ఓసి భడవా, నోరు మూస్తావా లేదా'' అంటున్నా ఆగకుండా అరిచేస్తూంది కాంతమ్మ.

"నా నోరు మూయగలరు గాని, లోకాన్ని చాప గొట్ట లేరు గదా ? చెప్పండీ జానకి దే కులం ? అప్పుడు మీ ఆచారాలు, ఈ నీతులు ఏమైనవి? సుశీల, మీ...." అని ఏదో చెప్పబోతూ ఆపేసింది శాస్త్రిగారి పెనుకేకకు హడలి పోతూ.

అంతటితో నిశ్శబ్దం ఆవరించి పోయింది. ఎన్నడూ లేని తిరస్కారం నేడు తనమీదచూపింది కాంతమ్మ, కాలం గంటలకొద్ది అలా గడచి పోయింది. కాంతమ్మ ఖంగు ఖంగున దగ్గుతున్నా వినిపించింది కాదు రామశాస్త్రికి, తన పాతి కేళ్ల జీవితమంతా ఒక్కసారి పరామర్శచేసికొన్నాడు. ''జానకి''—''సుశీల'' తన్నుచూసి వికటంగా నవ్వుతు న్నట్లు అగుపించారు. తన నేరాన్ని, ద్రోహాన్ని ఎత్తి చూపు తున్నట్లు అగు పించారు వారిద్దరూ ఆ రాత్రి. అర్థం కాని మార్పేదో ఆవరించింది రామశాస్త్రిని. కడపటికి అతని అంతరాత్మ నైతిక ధర్మానికి ప్రబోధించింది. అజ్ఞా నంగా జరిగిపోయినదాని కంతా విచారించాడు రామశాస్త్రి. అలా యోచిస్తూండగా ఎంత కాలం జరిగి పోయిందో ఉద యం ఏడు గంటలకు గాని తెలిసింది కాదు శాస్త్రిగారికి. తక్షణం కాంతారావుకోసం పరువులు తీసాడు. ఏ మాత్రము ఆలస్యం చెయ్యకుండా గౌరిపూర్ వెళ్లాడు రామశాస్త్రి.

* * *

పాతికేళ్లనాటి మాట—

అవి కాంతమ్మ కాపురానికొచ్చిన క్రొత్త రోజులు. జానికికి కూతురు పుట్టిందనడంతో కళ్యాణపురమంతా ఎన్నో విధాల పీకించింది రామశాస్త్రిని. శాస్త్రిగారి భోగట్టా తెర కెక్కి నీలాటిరేవు వద్ద కాంతమ్మ చెవుల్లోను పడ్డది ఆ చరిత్ర.

తమ సంబంధం కళ్యాణపురంలో రంగమెక్కిందని తత్కారణంగా తనకు అప్రతిష్ఠ రాగలదని తనొనర్చిన అపచారానికి పరిహారంగా రెండువేల రూపాయలు పుచ్చు కొని ఎక్కడికైనా వెళ్లిపొమ్మని, ఓ రాత్రి రామశాస్త్రి ప్రాధేయ పడుతుంటే, ఆ వెలయాలి హృదయం ఝల్లు మంది. యౌవనపుబిగి ఉన్నప్పుడు రామశాస్త్రి తన్ను ఆశ్రయించినాడు. తన్నుగూర్చి ఎన్నోగ్రంథాలు చదివాడు. తుదకు ఎవరేమన్నా సరే తన్ను వదలి పెట్టనన్నాడు. అంటూనే పెళ్లిచేసికొని, ఈనాడు అపచారానికి పరిహార మంటూ, డబ్బుతో నచ్చచెప్పుతున్నాడు. ఆ వంచనతో జానకికి జ్ఞానోదయమైంది—తన కులవృత్తిమీద విరక్తి కలిగింది. ఆ పరివర్తనతో చిట్టిసుశీలను ప్రచ్ఛన్నమైన జీవితంతో తన సర్వశక్తులూ ధారపోసి, ఆదర్శ ప్రాయమైన ఆధునిక హిందూ యువతిలా తయారు చెయ్యాలని కంకణం కట్టింది.

ఆ, ఆవేశంతో హైదరాబాదు చేరుకొని, ఎన్నో ఆపదలు కష్టాలు గడిచి సుశీల్నిచదివించి. పెంచి పెద్దదాన్నిగా చేసింది తన ఆరోగ్యం హీనమౌతున్నా లెక్క చేయకుండా.

కడపట హాస్పిటలులో ఓ రోజు, జానకి, సుశీలతో తన గత జీవితాన్నిగూర్చి, రామశాస్త్రిగురించి, చెప్తూ తనను కొన్నట్లు ప్రచ్ఛన్నమైన సాంఘిక జీవితం సాగించడానికి ప్రమాణం తీసికొని కళ్లు మూసికొంది. సుశీల ఆ చరిత్ర విని ఆశ్చర్యపోయింది. ఆనరక కూపం నుంచి తప్పించిన తన వేశ్యమాతకు ధన్యవాదాలు అర్పించింది. రామశాస్త్రిని. ఆగత జీవితాన్ని తల్చుకొంటే ఆవిడ హృద యం తరుక్కుపోయింది. ఆ ఆవేదనలోనే కుమిలి కుమిలి ఏడ్వటం తప్పమరేమి చెయ్యగలదు ?

తల్లి పోవడంచేత పై చదువులు మానెయ్యవలసి వచ్చింది సుశీల. వెంటనే 'నర్స్ ట్రైనింగ్'లోచేరి ఉత్తీర్ణు రాలైంది సుశీల. హైదరాబాదులోనే ఓ చికిత్సాలయంలో,

వందరూపాయల జీతంమీద నర్స్ ఉద్యోగం సంపాదించుకోగలిగింది. సుశీల హైదరాబాదులో ఇ.టరు చదువుతున్నప్పుడు, కాంతారావు తన క్లాసుమేటు. ఈ రెండు లేత హృదయాలకు అప్పుడు తమ తల్లితండ్రుల గత జీవితాల్ని గురించి ఒకళ్లనొకళ్లు తెలసి కోవలసిన ఆవశ్యకతగాని, ప్రమేయంగాని గలుగలేదు.

* * *

ఆనాడు కళ్యాణపురం వదలిన అనూరాధ గౌరిపూర్ చేరుకొంది ఆ రాత్రే. ఆ రాత్రి ఊళ్లో ఎలాగోగడిపి ఉదయం మధుమూర్తి ఇల్లేదో విచారించి తెలుసుకొని అక్కడికెళ్లింది. అతనితో తన్ను గురించి చెప్పుకొంటూ కుమిలి కుమిలి ఏడుస్తుంటే, మధు ఏదో ఆశ్చర్యపోతున్నాడు. అప్పుడే అక్కడికి చేరుకొన్న రామశాస్త్రిరాకతో, మరీఖంగారైపోయింది. రామశాస్త్రి రుద్ధ కంఠంతో 'అజ్ఞానంగా జరిగిపోయిన వాటినన్నిటినీ మరిచిపోయి, అను రాధకాంతారావులిక భార్యభర్తలై తనింట్లో సౌఖ్యంగా కాపురం చెయ్యాలని అంటుంటే మధుమూర్తి కిదంతాఏదో, సినిమా చూస్తునట్లుంది. శాస్త్రిగారికి కలిగిన పరివర్తనకు ఆశ్చర్యపోతూ, ఈ గందరగోళమంతా తలుచుకొని నవ్వుకొంటూ, మధుమూర్తి కాంతారావు అమాయకత్వాన్ని, పొరపాట్ను ఎత్తి చెప్తుంటే, అనూరాధ రామశాస్త్రిలు ఏదోశూన్యంలోకి చూస్తూనిల్చుండి పోయారు. మధుమూర్తి ప్రోత్సాహం మీద ఇక ఏ మాత్రము ఆలస్యం చెయ్యకుండా రామశాస్త్రి, అనూరాధలు కాంతారావుకోసం హైదరాబాదు చేరుకొన్నారు.

* * *

గౌరిపూర్ వదలిన కాంతారావు హైదరాబాదు చేరుకొన్నాడు. ఉద్యోగాన్వేషణకు రెండు మూడు రోజులు, ఆ మహానగరంలో తనుచూడని ఆఫీసంటూలేదు. తుదకు తన స్నేహితురాలైన సుశీల ద్వారా చికిత్సాలయంలో ఏదో ఒక తాత్కాలిక గుమాస్తా గిరి సంపాదించుకొన్నాడు.

సుశీల స్నేహపూర్వకంగా కాంతారావుని బాగా అర్థం చేసుకోబట్టి అతనే తన జీవితంలో తోడునీడై ఉండాల్ని ఆశించింది. ఆదినుంచి కాంతారావు సుశీలపట్ల చూపుతున్న వాత్సల్యం, తుదకు అనురాగంగా పరిణమించింది. కాంతారావు ఈ పరిస్థితిని ఇప్పుడే అర్థంచేసికో గలిగాడు. తనకీవిశాల ప్రపంచంలో ఎక్కడా మనశ్శాంతి అంటూ కన్పించదేమో ; ఇంక తనక్కడుండి సుశీల హృదయాన్ని గాయపరచ తలచుకోలేదు. ఆ ఒక్క రోజు ఉద్యోగాన్ని వదలుకొని వెళ్లిపోయాడు. మర్నాడు కాంతారావు తన గదిలో వదలిపోయిన ఉత్తరం చూచుకొంది సుశీల——

"సుశీ,

ఆదినుంచి నీ హృదయం గ్రహించుకోలేక పోయాను. ఇప్పుడే తెలిసికొన్నాను, నీవు నన్ను వివాహమాడగోరుతున్నట్లు. నా జీవితం అప్పుడే మరో స్త్రీ మూర్తికి అంకితమయిపోయింది. ఆ అభాగిని నా బాల్యస్నేహితురాలు అనూరాధ. ఆ విడను వివాహం చేసుకొంటానని ప్రమాణం చేసాను కూడ. కాని పరిస్థితులు విపరీతమై పోయినవి. సఘంలో వాతావరణానికి ఓర్చుకోలేక అనూరాధ ఈ ప్రపంచంనుంచే వెళ్లిపోయింది. ఆవిడ సర్వస్వాన్ని నాశనం చేసిన నా జీవితం ఇక ప్రశాంతంగా జరగాలన్న కోరికా లేదు. జరుగుతుందన్న ఆశా లేదు. నన్ను నీ సహోదరునిలా భావించి నీకునచ్చిన పురుషుణ్ణి పెళ్ళాడి సౌఖ్యంగా ఉండాల్నే ఆశిస్తున్నాను. నీకు నా అంత్యనమస్కారాలు. నీ శ్రేయోభిలాషి——కాంత ."

కన్నీటిధారలతో ఆ ఉత్తరం తడిసిపోయింది. సుశీల ఆలా ఎంతసేపు ఆ స్థితిలో ఉండిపోయిందో తెలియదు, తన్నెవరో పదిసార్లు పిల్చినంతవరకూ.

''పిల్చినా పల్కవేం ? అర్జంటుకేసు వచ్చింది. వార్డు డాక్టరుగారు కేకలేస్తున్నారు నిన్నడుగుతూ. తెమలవేం, తొందరగా'' అంది మరోనర్సు. తక్షణం దుస్తులు మార్చుకొని బరువెక్కిన హృదయంతో వెళ్లింది సుశీల. వార్డులో స్టాఫ్ నర్సు సుశీల్నిచూడ్డంతోటే అటు ప్రక్కగాబెడ్డు మీదకేసు చూసుకోమంది సుశీల. నీరసంగా ఆ బెడ్డు వైపునడిచింది. కేసు షీటు లాగిచూచింది. పేరు ''అనూరాధ !!'' నవనాడులూ ఉడికి పోయినట్లయింది సుశీలకు. తను నిల్చోకోలేక ఆ బెడ్డుమీదే చతికిల బడింది. ఆ ప్రక్కనేనిల్చున్న ఓ ముసలాయనకేసి ''మీ పేరండి ?'' అని ప్రశ్నించింది ఆత్రం కొద్దీ అతను ''నా పేరు రామశాస్త్రి'' అనటంతో ఆగక, ''ఈ విడనాకోడలండి——మాది కళ్యాణపురం''——అంటుంటే నిలువునా నీరైపోయింది సుశీల ! సరె ఆవిడభర్త కాంతారావనికూడ తెలుసుకొంది.

మరి ఏమిటి ఈ గందరగోళమంతా? కాంతారావు అనూరాధ చనిపోయిందని అనడంలో అర్ధ మేమిటి ? ఇవన్నీ ఏదో అపరాధ పరిశోధక నవలలోని సంఘటనల్లా ఉన్నాయి సుశీలకు. ఏమో రామశాస్త్రి ఎంతటి ఘాతుక కార్యానికైనా వెను దీయడు కదా ? తన మాతృమూర్తి జీవితంలో ఆరి పోని గాయం తెచ్చిపెట్టిన 'పెద్ద మనిషి' గదా—అనూరాధ–కాంతారావు జీవితాల్లోకూడా ఏంచేశాడో ఏమో ? అని పరిపరి విధాల ఆలోచిస్తూ ఆ బెడ్డుమీదే ఒరిగి పోయింది సుశీల.

* * *

చికిత్సాలయంనుంచి వెళ్లిపోయిన కాంతారావు తానేం చేసేది నిర్ధారణ లేకుండా ఏదో శూన్యంగా నడుస్తున్నాడు. పబ్లిక్ గార్డెన్సులో చల్లగా అటు నడుం వాల్చాడో లేదో, తక్షణం తన క్లాసుమేటు ఒకడు అక్కడి కొచ్చి ! "అరే నీ విక్కడ ఉన్నా వేమిటోయ్ ; నిన్నటి రోజు మీ నాన్న నిన్ను వెతుక్కుంటూ, హాస్టలుకు వస్తే, నీవు హాస్టలు ఎప్పుడో వదలి పోయావని చెప్పాను. ఇంతకూ చూచావా మీ నాన్నగార్ని ? అదేమిటోయి అలా చూస్తున్నావు ? నిన్నెక్కడైనా చూస్తే చెప్పమన్నారుకూడా—మీ అమ్మా, మరి అనూరాధ నీకోసం బెంగపెట్టుకుకూర్చున్నారని.త్వరగా తమ్ము కల్సుకోమని. ఏం ? ఇంట్లో చెప్పకుండా ఇలా తగలెడ్డా వెందుకూ ?.... ఎందుకైనా మంచిదని, నీ సుశీల .... మన్నించవోయి, నీ స్నేహితురాలు, సుశీల అడ్రసు కూడా ఇచ్చాం" అంటూ వేళాకోళం చేస్తున్నా మరేమి విని పించుకోక సరాసరి చికిత్సాలయంవైపు పరుగెత్తాడు కాంతారావు.

* * *

కళ్లు తెరచి చూచే సరికి సుశీల తన గదిలో ఉంది. ఇక ఏ మాత్రం ఆలస్యం చేయకూడదని, ఈ కథ అంతేదో తేల్చుకోవాలని రామశాస్త్రిని పిలిపించి, వెంటనే కాంతారావు తనకు వ్రాసిన ఉత్తరాన్ని చూపింది. రామశాస్త్రి ఆ ఉత్త రాన్ని సాంతం చదివి కన్నీళ్లతో అలా చూస్తూ నిలబడి పోయాడు. తన కెదురుగా గోడకి వేలాడుతున్న జానకి ఫోటో మీదికి అతని దృష్టి మళ్లింది. ఆ మబ్బు కళ్లకి ప్రపంచమంత ఒక్కసారి తిరిగిపోయినట్టగుపించింది.

సుశీల !! ఎవరు ?........తన కూతురు !!!

ఆ దుఃఖంతో తడబడుతున్న మాటల్తో "సుశీల, చాలమ్మా నా యీ వృద్ధాప్యంలో దేవుడు నా కిచ్చిన కఠోర శిక్షలు. ఇన్నేళ్లు అజ్ఞాతంలో పెరిగిన నీవు, నా కూతురివమ్మా. కాంత నీ సోదరుడు. ఇప్పుడు అంతా అర్ధ మయిందనుకొంటాను నీకు" రామశాస్త్రి కన్నీళ్లు తుడుచు కొంటుంటే సుశీల పసిపాపలా ఏడుస్తూ "నాన్న" అంటూ రామశాస్త్రి ఒడిలో వాలిపోయింది–ఓం ప్రథమంగా తన జీవితంలో ఆ రెండక్షరాల్ని ఎంతో పరవశత్వంతో ఉచ్చ రిస్తూ. తక్షణం తెములుకొని, తండ్రి కూతుళ్లిద్దరూ రాధమ్మ వద్దకి నడిచారు.

అనూరాధ పరిస్థితిలో తగ్గుముఖం ఏది కనుపించలేదు. ఆ పరిస్థితిలోకూడా ఎంత వారించినా వినిపించుకోక రామ శాస్త్రి తన ఆత్రంకొద్దీ అనూరాధకి జరిగినవన్నీ పూసగ్రుచ్చి నట్లు వివరించాడు. అంతటితో పరిస్థితిమరీ విషమించి పోయింది. రక్తపుపోటు హెచ్చింది, తుదకు ఆలా పలవ రింతలతోనే శాశ్వత సుషుప్తి పొందింది అనూరాధ. అప్పుడే అక్కడికి చేరుకొన్న కాంతారావు 'రాధ' అంటూ ఆదేహాన్ని అటూఇటూ కదలించి చూచాడు కాని ఏం లాభం ?—ఎక్కడో ఫిడేలు తంతుల శ్రావ్యలయతో అష్ట పది వినబడు తూంది.

"త్వమసిమమ భూషణం–త్వమసిమమ జీవనం
త్వమసి మమ భవజలధిరత్నం--ప్రియే చారుశీలే".

ఇల్లు కట్టి చూడు

'సుప్రసన్న'

నాగరికతా విపుల విపణి వీధిలో
అనేక విచిత్ర చ్ఛాయానివహంచూచి
వాటిని కొనుక్కొని—ఇల్లు కట్టుకోవాలని

ఎప్పుడో కట్టుకున్న చీకటి గోడల మీద
ఈ నీడలతో కప్పు వేసుకుని
ఆర్థిక సిద్ధాంతాల కిటికీలు త్రవ్వుకొని
కొత్తగా మనుష్యుల్లోకి వచ్చిన
అణుబాంబుల విద్యుద్దీపికలు నిలిపి
ఇందులో హాయిగా నివసిద్దాం రండర్రా!

సూర్యుని కుటుంబానికి దూరాన కొందరు
నల్లని కళ్లతో మనసుల్ని చూసే మనుష్యులు
క్రొత్తలోకం కట్టుకుని, సైన్సులో
అవయవాలు లేని మనుష్యుల్ని చేయడం
ఇక్కడ టెలివిజను లోంచి చూడవచ్చు.

"చూడటానికి కళ్లుండొద్దూ ?"-
కళ్లు లేకుండానే చూడుకబంధులని

ఇక్కడ ఎవడికి వాడొక్కడే ఉన్నట్టు,
ఇతరుల అస్తిత్వానికి ప్రమాణమే లేదాయె!

మృత్యువు కబరీ భరాన తురుముకొన్న
నంది వర్ధనపు పూల చెండు చైతన్యం

మృత్యు చైతన్య స్వరూప వివేచన
ఆధునిక శాస్త్ర విహారాన సుందరం చైత్య నవనిర్మితి.

ఈ క్రొత్తగా కట్టుకున్న అణుబాంబు దీపాల
ఇంటి మీద-ధ్వజంగా, ఏటవాలుగా
ఒక శరత్పయోధం శకలాన్ని నిలపండి.

అనంతమైన కాలములో అన్ని సంఘటనలకూ
సరళ రేఖలో బిందువుల వలె స్వయం వ్యక్తిత్వం లేదు.
జరిగినది లేదు. జరగ బోయేది తెలీదు
నిలుచున్న వర్తమాన బిందువు నీడలో
నీడల్లో బతకడమే సత్యం.

విద్యార్థి రచన:

పంచవర్ష ప్రణాళిక

చి॥ ఉ. వి. ఆనందకృ

(ఈ యేడు జరిగిన పంచవర్ష ప్రణాళికా వారోత్సవాల సందర్భంలో సికిందరాబాదు మునిసిపల్ కార్పొరేషన్‌వారు నిర్వహించిన తెలుగు వ్యాసరచన పోటీలో ఈ వ్యాసానికి ప్రథమ స్థానము లభించింది. రచయిత మహబూబ్‌కాలేజి హైస్కూలు విద్యార్థి. వయస్సు 16 ఏండ్లు)

నేడు ప్రపంచములోని అన్ని దేశములును తమ, తమ దేశములను అభివృద్ధి పరచుకొనుటకై కొన్ని ప్రణాళికలను తయారుచేసి వాటిని ఐదు సంవత్సరములలో ఆ ప్రణాళిక ప్రకారము పూర్తిచేయుదురు. వీటినే పంచవర్ష ప్రణాళికలందురు. అటు విధముగనే మన భారత దేశము కూడా పంచవర్ష ప్రణాళికలను తయారుచేసి మన దేశమును ఆర్థికముగా, నైతికముగా అభివృద్ధి పరచుచున్నారు.

మన దేశము మూడు శతాబ్దములు బ్రిటిషు వారి అధీనములో ఉండెను. వారు మన దేశ అభివృద్ధికొరకు ఎట్టి ప్రయత్నములను చేసెడివారు కారు. వారి పరిపాలనలో ఉన్నమనకు ఎట్టి అవకాశములును ఉండెడివి కావు.

1947వ సంవత్సరము ఆగస్టున మనకు స్వాతంత్ర్యము లభించినది కాని పూర్తి స్వాతంత్ర్యము లభించలేదు. 1959 జనవరి 26వ తేదీన మనకు పూర్తి స్వాతంత్ర్యము లభించినది. అప్పటి నుండి మన దేశ ప్రభుత్వపు చట్టములను తయారుచేసి మన ప్రభుత్వము వారు మన రాజ్యాంగమును నడుపుచున్నారు. మన దేశమును అభివృద్ధి పరచుటకొరకై పంచవర్ష ప్రణాళికలను తయారుచేసి నడుపుచున్నారు.


మనదేశము వెనుకబడిన దేశము. ఉ. ఉక్కు, స్టీలు, మొదలగు ముడి పదార్థములు మన దేశమున లేవు.

ఆహార పదార్థములు వస్తువులు, మొదలగునవి రెండవ ప్రపంచయుద్ధము నుండి ధరలు పెరిగి పోయినవి. ఈ యుద్ధ సమయములలో మన దేశము కూడా జోక్యము కలిగింపజేసు కొనవలసి వచ్చినది.

దీనితో మనకు అనేకనష్టములు కలిగినవి. అర్థకముగారి, ఆహార పదార్థములు, వస్తువులు. ఈ యుద్ధసమయములలో యంత్రములను ఎనిమిది గంటలకు గాను 16 గంటలు పనిచేయింపవలసి వచ్చినది. దానితో యంత్రములు చెడిపోయినవి. ఈ యంత్రములను క్రొత్తవి తయారుచేయుట ఒక సమస్యగా ఉండెను. మన దేశములో జనులసంఖ్య ఎక్కువయే గాక ప్రతి సంవత్సరమునకు నాలుగు పెద్ద పట్టణములుగా జనసంఖ్య పెరిగి పోతున్నది. మనదేశములో విద్య నేర్చినవారి సంఖ్య చాలా తక్కువ. విద్య లేనివారు 75% ఉన్నారు. ఈ సమస్యలను పూర్తిచేయుటకు గాను మన దేశము వారు పంచవర్ష ప్రణాళికలను తయారుచేసి సాధ్యమైనంతవరకు జయప్రదముగా నడుపుచున్నారు.

రెండవ విషయము ఏమనగా మన దేశమునుండి బ్రిటిషు వారు పోవు సమయమున ఒక చిక్కును పెట్టి పోయినారు. ఒకటిగాఉన్న మన దేశము రెండు భాగములుగా చీలికలై పోయినది. ఒకటి హిందుస్తాన్, రెండవది

పాకిస్తాన్. తూర్పు బెంగాలులో పంటలు ఎక్కువగా పండును. ఆ భాగము పాకిస్తాన్ వారికి పోయినది. దీని వలన కూడా మన దేశమునకు ఒక నష్టము కలిగినది. పశ్చిమ బెంగాలులో యంత్రాగారములు ఉన్నవి కాని వాటికి కావలసిన సదుపాయములు తూర్పు బెంగాలులో ఉన్నందు వలన యంత్రములను ఆప వలసివచ్చినది. ఆ విధముగనే జవా అను ప్రదేశముకూడా పాకిస్తానుకు పోయినది. అచ్చట మంచి పంటలు పండును. ఇటువంటి క్లిష్ట పరిస్థితులలో ఉన్న మన దేశమును మన ప్రభుత్వము వారు చేతబట్టి జయప్రదముగా నడిపించుచున్నారు. పంచవర్ష ప్రణాళికలను నడిపి మానవుడు జీవించుటకు కావలసినవి ముఖ్యముగా ఆహారము, వస్త్రములు, నివసించుటకు గృహములు మన దేశము కృషిపథమైన దేశము కనుక మొదట పంచవర్ష ప్రణాళికలో వ్యవసాయమునకే ముఖ్య ప్రాముఖ్యతను ఇచ్చిరి.



చి॥ ఉ. వి. ఆనందకృష్ణ

మొదటి పంచవర్ష ప్రణాళికలో 2436 కోట్లు వెచ్చించిరి. రెండవ పంచవర్ష ప్రణాళికలో 4800 కోట్లు ప్రభుత్వము వారు వెచ్చించిరి. 2400 ధనిక వర్గము వారు వెచ్చించిరి మొత్తం 7200 కోట్లు వెచ్చించిరి. ఈ ప్రణాళికల ముఖ్య ఉద్దేశ్యము మన దేశములోని దారిద్ర్యమును పోగొట్టి మన దేశమును వృద్ధి పరచు నిమిత్తమై ఈ ప్రణాళికలను తయారు చేయుచున్నారు. రెండవ పంచవర్ష ప్రణాళికలో వ్యవసాయమునకును, పారిశ్రామికును వృద్ధి పరచిరి. మన దేశముయొక్క ప్రతి వ్యక్తి కర్చులు విభజించిచూచినచో 225 రూపాయలు, ఒక వ్యక్తికి ఒక మాసమునకు 22% చొప్పున వచ్చును. ఇటువంటి మన బీద దేశమును అభివృద్ధి చేయుటకై ఈ పంచవర్ష ప్రణాళికలను తయారు చేసిరి. ఈ పంచవర్ష ప్రణాళికల ముఖ్యోద్దేశ మేమనగా, నిరుద్యోగ సమస్యని నిర్మూలించడము, ప్రజలకు శాంతి నెలకొల్పడము, అనగా వారికి కావలసిన సదుపాయములను ప్రభుత్వము వారు పూర్తి చేయడమే వారి కర్తవ్యము. వీటి కొరకు పారిశ్రామిక యంత్రములను నెలకొల్పిరి. ఆహార పదార్థములయొక్క ధరలను వస్తువులయొక్క ధరలను తగ్గించి వారికి చౌకగా లభించునట్లు చేయుట ప్రభుత్వము యొక్క కర్తవ్యము. మొదటి పంచవర్ష ప్రణాళికలో వ్యవసాయమునకు ఎక్కువ ప్రాముఖ్యతను ఇచ్చిరి. రెండవ పంచవర్ష ప్రణాళికలోకూడా వ్యవసాయమునకును, పరిశ్రమలకును ప్రాముఖ్యత ఇచ్చిరి.

వ్యవసాయము అనగా వ్యవసాయమునకు సంబంధించినవి. నీటి సరఫరా, ఎలక్ట్రిక్ మొదలగునవి కావలయును. అందువలన కొన్ని ప్రాజెక్టులను నిర్మించిరి. ప్రాజెక్టులను నిర్మించడమువలన రెండు లాభములు కలవు. ఒకటి నీటి

పారుదల, రెండు విద్యుత్ శక్తిని ఉత్పత్తి చేయవచ్చును. ఇట్లు ప్రాజెక్టులను నిర్మించిరి, కర్మాగారములు నిర్మించిరి. విద్య కొరకు పాఠశాలలు నెలకొల్పిరి.

ప్రాజెక్టులు

తుంగభద్ర, నాగార్జున సాగర్ మొదలగునవి. ప్రభుత్వమువారి ముఖ్య ఉద్దేశ్య మేమనగా ప్రజలకొరకు శాంతి నెలకొల్పడము. వారికి విద్య మొదలగునవి నేర్పించి అభివృద్ధి పరచడము. నిత్య జీవితమునకు అవసరములైనవి కల్పించడం. ఆహారము, వస్త్రములు మొదలగు వస్తువులను వారికి చౌకగా లభించునట్లుచేసి కాపాడడము వారి యొక్క ముఖ్య ఉద్దేశ్యము.

ప్రణాళికల వల్ల ఇంతవరకూ మనకు కలిగిన అనుభవాలను ఒక మారు పర్యాలోకనం చేసుకుంటే భారతదేశ సమస్యలను భారతీయులే స్వయం కృషి వల్ల పరిష్కరించుకోవాలనీ. ఇతర దేశాల వారు అయా దేశాలలో చేసిన కృషిని మక్కికి మక్కి అనుకరించినందు వల్ల ప్రయోజనం లేదనీ విశదమవుతుంది.

— జవహరలాల్ నెహ్రూ

* * *

చంద్రకాంత శిలా ఫలకంపై లిఖించినా అది ఒకప్పటికి క్షయమైపోవచ్చు. లోహంపై చెక్కి వుంచినా కాల గమనంతో అది చెరిగిపోవచ్చు. కాని అమరమైన హృదయంపై లిఖించుకొని సారాంశాన్ని మనస్సుకు పట్టించుకున్నామంటే అది శాశ్వతమై, జాజ్వల్యమానంగా ప్రకాశిస్తూ వుంటుంది.

— డేనియల్ వెబ్‌స్టర్

హాస్య నాటిక:

డెవలప్‌మెంటు బ్లాకులో గిరీశం

(గత సంచిక తరువాయి)

రచన: "వాణీకుమార"

(రెండవ భాగం)

స్థలం:— బ్లాక్ హెడ్ క్వార్టర్సు

గిరీశం, బుచ్చమ్మ, వెంకటేశం వరండాపైకి వస్తారు

వెంక:- అక్కయ్యా, డెవలప్‌మెంట్ కమీషనర్‌గారు లేరట.

బుచ్చ:- లోపలికెళ్లి కనుక్కొచ్చావులురా ?

వెంక:- కనుక్కొచ్చా. వరద రిపోర్టులొచ్చేసరికి హుటాహుటి రాజమండ్రి బైలుదేరి వెళ్లారట. పి. ఎ. గారిని ఇంటర్వ్యూ తీసుకోమని ఆర్డర్ వేసి పొయ్యారట.

గిరీ:- డామిట్, పి. ఎ. తోనా నా ఇంటర్‌వ్యూ! ఇటువంటి ఎంతమంది పి. ఎ.లనూ, సెక్రటరీలనూ చూచాను. ఏదో కమీషనరంటే నేషనల్ గవర్నమెంటు ఉద్యోగి కదా, అంతా సమానమే కదా అని చూడ్డానికి ఒడబడ్డాగాని.....

బుచ్చ:- అదిగో అక్కడే పొరబడుతున్నారు, అంతా సమానమే అనుకున్నప్పుడు పి. ఎ. గారిని చూస్తే న్యూనతేవిఁటి ?

గిరీ:- ఏమో వొదినా, నాకు మనస్కరించడం లేదు. మహారాజా వారి దర్శనం చేసుకున్న వాడికి పి. ఏ.ల దగ్గర పడిగాపులా.

బుచ్చ:- అదిగో మీరు మళ్లీ మొదటికొచ్చారు. ఇహ మీకూ నాకూ కుదురదు. నే వెడతాను.

గిరీ:- ఆఁఆఁ అంతపని చెయ్యకు వొదినా, నా మీద ఒట్టు. నువ్వు చెయ్యమన్నదల్లా చేస్తాను. తత్వం నాకెప్పుడో బోధపడిందిలే. ఇటీజ్ ది వుమన్ దట్ సెడ్యూసెస్ ఆల్ మాన్‌కైండ్. కాబట్టి దానికి నేను మినహాయింపా. నా శిష్యుడు వెంకటేశం మినహాయింపవుతాడా.

వెంక:- పి. ఎ. గారు మీ కోసం లోపల కాచుక్కూచున్నారు. లోపలికెళ్లండి.

గిరీ:- ఎవడి కోసం కూచుంటాడోయ్. ఈ గిరీశం ఇంటర్‌వ్యూ కొచ్చాడంటే మాటలా. హడలిపోడూ. ఇంతకూ ఇతడికి ఏమి హోదా పట్టిందోయ్. నన్నే నిలవేసి క్రాసెగ్జామిన్ చెయ్యబోతున్నాడు. ఏం చేస్తాను. అనుకున్నది కావాలంటే చెయ్యవలసింది చెయ్యక తప్పదు. ఆబ్లిగేషన్సన్నీ అంతే.

బుచ్చ:- ఇక లోపలికెళ్లండి. మేం ఇక్కడే వుంటాం.

గిరీ:- ఆల్‌రైట్. బట్ సెరోమోనియల్‌గా ఇంటర్‌వ్యూ చేస్తాలొను. మైడియర్ వెంకటేశం. కాస్త కనిపెట్టుకుండవోయ్ ఇక్కడే.

వెంక:- అలాగే వెళ్లండి.

(గిరీశం లోపలికికొస్తాడు-గదిలో-)

గిరీ:- హలో పి. ఎ. గారూ.

పి.ఎ.:- (నిలబడి -) హలో గిరీశంగారూ, ఎక్స్యూజ్ మీ సార్. నన్ను నేనే పరిచయం చేసుకోవాలి. కమీషనర్‌గారి పి. ఎ. ను. వారు అర్జెంటుగా ఈ ఉదయం బైలుదేరి వెళ్లవలసివొచ్చింది. మిమ్మల్ని కలుసుకొని భోగట్టా అంతా రికార్డుచేసి, మీ సర్వీసెస్ గవర్నమెంటు వారికి ఏ విధంగా ఉపయోగపడతాయో డిటేల్డు ప్రిపోజల్సు పెట్టమని నాకు ఆర్డరు వేసి వెళ్లారు. ప్లీజ్ టేక్ యువర్ సీట్.

గిరీ:- థాంక్యూ సార్. మన కమీషనర్‌గారు నీవు దొరల్ని బాగా ఎరిగుంటారనుకుంటాను.

పి.ఎ.:- ఏం ?

గిరీ:- ఏమీ లేదులెండి. నేను కూడా ఆ సర్కిల్సు చూచిన వాణ్ణి కాబట్టి తెలుసుకుందామని అడిగాను.

పి.ఎ.:- ఓహో, అదా సంగతి - మీరు పొలిటికల్ సఫరరా ?

గిరీ:- అదేమిటండీ ?

పి.ఎ.:- అంటే రాజకీయబాధితులా.

గిరీ:- ఎబ్బే. నేను లోకమరామత్తు బాధితుణ్ణండీ. లోకోపకారం చేసిచేసి చివరకు షెల్టర్ లేకుండా అయ్యాను.

పి.ఎ.:- అవును, మీ గూర్చి వినేకదా కమీషనర్ గారు చాలా ఇంట్రెస్టు చూపారు.

గిరీ:- మరేనండీ. ఆయన దర్శనం అవుతుందని వచ్చాను. కాని నా మిస్ ఫార్చ్యూన్. అన్నీ మిస్ ఫార్చ్యూన్సే. సరే, మీరు వారి రిప్రిజెంటేటివ్ కదా. మీ ఇష్టమొచ్చిన ప్రశ్నలు మీరడగావచ్చు. నా కిష్టమైన సమాధానాలు నే చెప్పావచ్చునుకుంటా.

పి.ఎ.:- నిరభ్యంతరంగా. కాని ఫాక్ట్సు మాత్రమే కావాలి.

గిరీ:- ఫాక్ట్సు, ఫిగర్సు, ట్రూత్ ఏబ్ స్ట్రిక్టు ట్రూత్ ఇలాంటివన్నీ నేనెరుగుదునండీ. చూడండీ. నే కొంచెం స్వేచ్ఛగా మాట్లాడతాను. మీరేమీ అనుకోరు గదా.

పి.ఎ.:- అలాగే. మీ ఎడ్యుకేషన్ ఎంతదాకా అన్నారు.

గిరీ:- ఎడ్యుకేషన్ ! నాతో మాట్లాడ్డమే ఒక ఎడ్యుకేషన్ అని లోకమంతా అంటూవుంటే అలా అడుగుతారేమండీ ! నాకు చాలా చిన్నతనంగా వుంది మీప్రశ్న.

పి ఎ.:- సరే, ఏయేగ్రంథాలు చదివారు మీరు ?

గిరీ:- లెఖ్ఖఎలా చెప్పనండీ. ఉపనిషత్తులూ, బైబిలూ, పరాశరస్మృతీ, అమర నిఘంటువు, బృహన్నారదీయం, షేక్సుపియర్, వీరేశలింగం, చమకం, నలచరిత్ర. రాజశేఖర చరిత్ర—ఓ యెన్ని గ్రంధాలు పారాయణం చేశానండి. ఎంత ఎస్సెన్సు లాగానండీ.

పి.ఏ.:- టెస్టిమోనియల్సు ఏమైనా వున్నాయా ?

గిరీ:- వున్నాయండీ, అయితే అన్ రిటెన్ కాన్‌స్టిట్యూషన్సులా నావన్నీ వ్రాతపూర్వంగా లేని కితాబులండీ. ఇదిగో, దివాన్ బహదూర్ రాజారాంగారు నా గూర్చి అన్నమాటలు వ్రాసి పెట్టుకొన్నాను. చదువుతావినండి. 'ఇతనిని సంఘ సంస్కారము వారు కెప్టాన్ అంటారు. సాహసౌదార్యాలు గల మనిషి. కోటి విద్యలున్నాయి. దొర్లకి ఇతనంటే సరదా. బుద్ధిలో ఒరిజినాల్టీ వుంది. ఎంతటి వాడికైనా ఇతన్ని చూస్తే సరదా. ఇతని మాటలు లేబరింతుల్లా వుంటాయి."

పి.ఎ.:- అధికార్ల టెస్టిమోనియల్సు ఏమైనా....

గిరీ:- ఆమాటా నేనే చెప్పుకోవాలా. మునసబుగారూ, డిప్టీ కలెక్టరు గారూ ఎన్నిక చేసిన మనిషిని. కవితారసం వారి లాగ్రహించేవారేరీ. నా కవిత్వమంటే కలెక్టరుగారు చెవి కోసుకునేవారు.

పి.ఎ.:- మీరు కవిత్వం కూడా వ్రాస్తారా ?

గిరీ:- అవునండీ. చిత్తగిస్తారా.

చుక్కలవలె కర్పూరపు
ముక్కలవలె నీదుకీర్తి ముల్లోకములన్
క్రిక్కిరిసి పిక్కటిల్లెను.

అని పద్యం చెప్పేసరికి ఆశుకవిత్వాల అవధానిగారు నా వైపు ఎగాదిగా చూచేరండీ. ఇక ఇంగ్లీషులో-

ఐ లౌ ది విడో, హూ ఎవర్ షీబీ
మారీడ్ ఆర్ సింగిల్ ఫ్రీ
వాట్‌వర్ ది ఎర్త్
బట్ ఫర్ హెర్ బర్త్

అని చదివే సరికి ఆమధ్య ఇంగ్లండు నుంచి వొచ్చిన కవి బృందంవారు గుండె కొట్టుకున్నా రంగి. ఇది తరువాత 'రిఫార్మర్' పత్రికలో అచ్చు కూడా పడింది.

పి.ఏ.:- మరి మీకు కథలు వ్రాయడం వొచ్చా.

గిరీ :- వొచ్చా ! ఎన్ని కథలల్లానండీ, ఎంత ఇమాజినేషన్ చూపాను ! చూడగలిగితే నా క్యారీర్‌లో అడుగడుక్కీ కథలే కదండీ.

పి.ఏ.:- మరి తర్జుమాలు చెయ్యగలరా ?

గిరీ :- ఎన్ని తర్జుమాలు చేశానండీ. షేక్స్పియర్ కవి "వాటీజ్ ఇన్ ఎ నేమ్"-అంటే నేను దాన్ని "పేరులోన నేమి పెన్నిధి యున్నది" అని చిన్న గీతి ముక్కగా తర్జుమా చేశాను. ఇంకా రకరకాల తర్జుమాలున్నాయి. అవన్నీ ఓ పెద్ద గ్రంథం.

పి.ఏ.:- వ్యవహారకాండ ఏమైనా తెలుసా మీకు ?

గిరీ :- ఆహా, జటాంతస్వాధ్యాయి అగ్నిహోత్రావధానులు గారికి వారు దాఖల్చేయించిన పిటీషన్లమీద ఆర్డర్లు చదివి పెట్టి, వారి దగ్గరుండే కాగితం ముక్కలన్నిటికీ జాబితాలు వ్రాసి, వాటి తర్జుమాలు చేసి, కోర్టు వ్యవహారాల్లో క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ సెక్షన్లు కూడా ఉదహరించి, జబల్పూరు హైకోర్టు వారిచ్చిన తీర్పు యారరుపు పెట్టి ఎన్ని సలహాలు చెప్పానండీ.

పి.ఏ.:- జబల్పూరు హైకోర్టా ?

గిరీ :- మరేనండీ, ఇప్పుడు తీసేశారేమో లెండి.

పి.ఏ.:- ఒహో. మరి మీకు ఉపన్యాసాలివ్వడం చేతవునా?

గిరీ :- అడగవలసిన మాట అడిగారు, ఎప్పుడడుగుతారా అని నేనూ చూస్తున్నాను. తరచుగా లెక్చర్లు ఇస్తూ వుండడం నా వృత్తి కదండీ. ఎవరైనా సరే, లెక్చరిచ్చి మనస్సు మళ్లిస్తాను. అగ్గిరాముణ్ణి లొంగదీసే యలోక్వెన్సు వుంది. విడో మేరేజీ విషయమై, నాచీ కొశ్చన్ విషయమై ఎన్ని లెక్చర్లిచ్చాను. పూనా డక్కన్ కాలేజీలో నేను చదువుతూన్నప్పుడు ది ఇలెవెన్ కాజెస్ ఫర్ది డిజనరేషన్ ఆఫ్ ఇండియాను గూర్చి మూడు గంటలు ఒక్క బిగిని లెక్చరిచ్చే సరికి ప్రొఫెసర్లంతా డంగై పొయ్యారు కదండీ. మొన్న బంగాళీవాడు ఇక్కడి కొచ్చినప్పుడు ఒక్కడికైనా నోరు పెకిలిందీ. అప్పుడు నేనే కమ్ముకొని. ఆంధ్రుల పరువు నిలబెట్టాను కదండీ. సౌజన్యారావు గారంతటి కొమ్ములు దిరిగిన ప్లీడరుకూడా 'నా భావం బాగా ఉపన్యసించాడు' అని ప్రశంసలు కురిపించాడు కదండీ నామీదా.

పి.ఏ.:- వేరే వ్యాపకా లేవైనా వున్నాయా మీకు ?

గిరీ:- వాటి మాటేమోగాని కొన్ని వెర్రులు మాత్రం నాకున్నాయండీ, వాటినే నేను షడ్గుణాలంటాను. మీరేమంటారో! ఒకటి: మనసుకూ మాటకూ కత్తు, రెండు: మంచివాళ్లు కన్పిస్తే పూసుకోని తిరగడం. మూడు: ఎదిరించిన వాడి మీద కాలు దువ్వడం. నాలుగు: కష్ట సాధ్యమైన పని తటస్థించి ఫలితం మంచిదని తోస్తే ముందూ వెనకా చూడకుండా అందులోకి ఉరకడం. ఐదు: లైఫ్‌లో వుండే చమత్కారాలు వెదుక్కుంటూ పోవడం. ఆరు: పెద్దల శలవు ప్రకారం నడచు కోవడం.

పి.ఏ.:- బాగావుంది. ఒక విషయం చెప్పండీ, మీకు గ్రామ జీవితమంటే ఇష్టమేనా ?

గిరీ :- అందు కభ్యంతరమేమిటండీ. నిజంగా కంట్రీ లైఫ్‌లో చాలా చమత్కారం వుంది, బెస్టు టొబాకో బెస్టు గేదె పెరుగు, మంచి ఘీ, చక్కని ప్రకృతి దృశ్యాలు. అందుకే కదండీ పొయట్సంతా కంట్రీ లైఫ్ కంట్రీ లైఫ్ అని కలవరించారు. పర్సువర్తు సంగతి నేను మీకు చెప్పాలా.

పి.ఏ.:- అవుననుకోండీ. కాని ఈ నాటి చదువుకున్న కుర్రాళ్లకి కంట్రీ లైఫ్ ఇష్టం లేదంటారు.

గిరీ :- వాళ్లెందు కలా అంటారో నాకు తెలుసండీ. సీమలోలాగ మన దేశం కంట్రీ సైడున బ్యూటిఫుల్ షెపర్డెస్లూ, లవ్ మేకింగూ వుండవని వాళ్లకి పెద్ద అసంతృప్తి. గ్రాస్ గరల్సు తగు మాత్రంగా వుంటారు గాని మాడర్టీ స్మెల్. ఎంతైనా ఇంగ్లీషు చదువుకొన్న కుర్రాళ్లు కదండీ, వాళ్లకీ సీమవాళ్ల సెంటిమెంట్సు వంటపట్టాయి.

పి.ఏ.:- మరి అటువంటి వాళ్లు డెవలప్ మెంటుకు పనికి రారు.

గిరీ :- నా సంగతి అలా కాదండీ. వ్యాపకం వుండాలి గాని నాకు టౌనూ కంట్రీ సమంగా ఇష్టమండీ అవకాశం వుంటే ఎక్కడైనా కేంపేసుకుంటాను.

పి.ఏ.:- మరొక మాట. సుఖాలు. సౌకర్యాలతో పొద్దుపుచ్చే వాళ్ల వల్ల డెవలప్‌మెంటు పని అసలు కాదు.

గిరీ :- నాకు డ్యూటీ ముందు, ప్లెజర్ తరువాతా నండీ. అది మా గురువుగారి ఆజ్ఞ.

పి.ఏ.:- చాలా మంచిది. మరి డెవలప్‌మెంట్ అంటే మీరేం అర్థం చేసుకున్నారో చెప్పండీ.

గిరీ :- అసలు ప్రశ్న అడిగారు. ఇక కూర్చొని సమాధానం చెప్పడం నా వల్లకాదు. నిల్చొని చెప్పడానికి పర్మిషనివ్వండి. లెక్చరు వల్ల గాని విషయం నిగ్గు తేలదు.

పి.ఏ.:- అలాగే చెప్పండి.

గిరీ :- సోషల్ రిఫార్ము అంటు తెలుసుకున్న వాణ్ణి డెవలప్‌మెంటు అర్థం చేసుకోననుకున్నారా అసలు ఆంధ్ర దేశానికి మేలు అంటూ తలపెట్టినవాణ్ని మొదట నేను. భీముని పట్నానికి పాల సముద్రం విశాఖ పట్నానికి చెరుకు సముద్రం తెస్తానని ఆనాడన్నానంటే అది సింబాలిక్‌గా అన్న మాట. దాని అంతరార్థం డెవలప్‌మెంటూ, వెల్ఫేరూ నరే అడిగారు గనక చెప్పక తప్పదు. ఇప్పుడు మన దేశమంతా జారూ, బురదా, గట్టూ గతుకులూగా వుంది. వీటన్నిటినీ తొలగించి మాంచి దిమ్మిసా కొట్టిన హైరోడ్డు పడాలి, స్కూళ్లూ అస్పత్రులూ పడాలి. చెరువులూ కుంటలూ ఏర్పడాలి. ఆనకట్టలు రిజర్వాయర్లు అమరాలి. పల్లెలూ పట్నాలూ ఏకం కావాలి. బీదా బిక్కీ బాగు పడాలి. కార్యాలు కరామతులూ జరగాలి. ఇంకా ఎన్నో పనులు జరగాలి. ఈ డెవలప్ మెంటనే బండికి రెండు చక్రాలు. ఒకటి ఫైవియర్ ప్లాన్సు అనగా ప్రతిపనీ ప్లాను ప్రకారం జరగడం. రెండవది కమ్యూనిటీ డెవలప్ మెంటు—అనగా ప్రత్యేకంగా గ్రామ సీమల అభివృద్ధి. గ్రామాలు బాగుపడ్డాయంటే ఇండియా ఇంప్రూవ్ అయిందన్న మాటే.

పి.ఏ.:- బాగా చెప్పారు. అయితే మీకు కాయ కష్టమంటే ఇష్టమేనా?

గిరీ :- నిమ్మదిగా అంటారేమిటీ. పని వంటి వస్తువ లోకంలో లేదని మొదట నేనే కదండీ చెప్పింది. ఊరికే కూచుంటే నాకు వూపు పోదు. ఏదో ఓ కసరత్తుండాలి. సోమరితనం నేవొప్పనండీ. డిగ్నిటీ ఆఫ్ లేబర్ అన్న షేక్స్పియర్ సూక్తిని నేనే కదండీ ప్రచారం చేస్తా. రుబ్బురోళ్లు పట్టాను. యాతాం వేశాను. గొప్పుతవ్వాను. మళ్లతడిపేశాను. కాబట్టే కదండీ, ఇనుంలాంటి శరీరమైంది. కొడితే కర్ర విరిగి పోవాలి గాని ఈ వొళ్లు చెక్కుచెదర్దు.

పి.ఏ.:- దీనినే ఇప్పుడు శ్రమదానం అంటున్నాము.

గిరీ:- శ్రమదానం ఏమిటండీ. ఒకళ్లకు దానంచేసేదేమిటీ. శ్రమ యజ్ఞం అనండీ. ఎవరికి వాళ్లు ముందుకొచ్చి ఈ యజ్ఞం చేసి తరించాలి.

పి.ఏ.:- ఉద్దేశం అదే. దాన్ని మీరు మా కార్యకర్తలందరికీ బాగా బోధపరచగలరనుకుంటాను.

గిరీ:- బాగా యేమిటండీ. నా దగ్గర చదువుకున్న వాడు ఒక్కడూ అప్రయోజకుడు కాలేదు. వెంకటేశం మీకు తెలుసా.

పి.ఏ.:- అవునూ. అతను రాష్ట్రంలో బెస్టు విలేజ్ లెవల్ వర్కర్సులో ఒకడు. మీకు పరిచయస్తుడా?

గిరీ:- నా శిష్యుడండీ. ఇక్కడే వున్నాడు. (బిగ్గరగా) ఎమోయ్ వెంకటేశం, ఇలా లోపలికిరా. పి.ఏ. గారు నిన్ను చూస్తారట.

(వెంకటేశం, బుచ్చమ్మ ప్రవేశిస్తారు)

వెంక:- నమస్కారాలు సార్.

పి.ఏ.:- ఓ నమస్కారాలు. నీవా మిస్టర్ వెంకటేశ్వర్లూ.

వెంక:- అవునండీ; వీరు మా గురువుగారు. ఈమె మా సిస్టర్ బుచ్చి — ఇక్కడ యస్. ఈ. వో.

పి.ఏ.:- అవునూ, వీరు మీకెలా తెలుసు?

వెంక:- మేమంతా ఒకచోటనండీ. ఇక్కడ మళ్లీ కలుసుకున్నాం.

బుచ్చ:- అవునండీ.

పి.ఎ.:- (ఆశ్చర్యంగా-) అంతా ఒక్కటే! మళ్లీ కలుసుకున్నారా!

గిరీ:- అక్షరాలా నిజమండీ.

పి.ఏ.:- అయితే మీరంతా వాళ్లా మహానుభావా, వారా మీరు. అయితే వీల్లేదు. మిమ్మల్ని ఈ బ్లాకులో వెయ్యమని నేను ప్రపోజల్ పెట్టలేను. ఇంపాసిబిల్. ఇప్పట్లో ఇది జరగడానికి వీల్లేదు. ఎఫిషెన్సూ. ఎఫర్టూ దెబ్బతింటాయి. అసలు మొదటికే మోసం వొస్తుంది.

గిరీ:- ఎందుచేత పి. ఏ. గారో.

పి.ఏ.:- మీరెందుకొచ్చారో నాకు తెలుసు గిరీశంగారో. మరి కొన్నాళ్లు పోయిందాకా మీ ఇంటెన్షన్సు సాగవు. అందాకా ఏజెన్సీ బ్లాకులో యేడాది ప్రొబేషన్ చెయ్యండి. సెలవ్. (వెడతాడు)

గిరీ:- శిష్యా వెంకటేశమ్.

వెంక:- ఏం గురో.

గిరీ:- వొదినా. బుచ్చి:

బుచ్చ:- యామండీ.

గిరీ:- డామిట్. మళ్లీ కథ అడ్డం తిరిగింది.

(తెర)

[ఆధారం:- కీ.శే. గురజాడ అప్పారావుగారి నాటకం "కన్యాశుల్కం"]

(అయిపోయింది)

సమగ్ర సుందరమైన ప్రజాస్వామ్యం కూడా సాంఘిక పరిణామ వ్యవస్థలో తుది దశ కాదు, అది విశాలమైన ఒక మెట్టు మాత్రమే. అక్కడి నుంచి సంఘజీవియైన మానవునికి ఆత్మచైతన్యం కలిగి సంఘంలో తానేమిటో తెలుసుకోగలుగుతాడు.

— శ్రీ అరవిందమహర్షి

* * *

విజ్ఞాన సాంకేతిక శాస్త్రాలు లేనిదే మనకు భవిష్యత్తు లేదు. అయితే మన గతాన్ని మనం విస్మరించి ప్రవర్తించామంటే ఆ భవిష్యత్తు మేడిపండు వంటి దవుతుంది.

— జవహరలాల్ నెహ్రూ

ఈ భారం

"కులపతి"

ఎవరు పెట్టింది నాకీ భారం?
తరంగాల తాకిడికి నదిలో మునగబోయే పడవలాంటి
గుడ్డపేలికలు అడ్డం పెట్టిన మంచినీళ్ల కడవలాంటి
జీవితాన్ని కన్యగా చేసి సీమంతాన తిలకరేఖ దిద్దేపని
ఆమె మదిలోని దుష్టాలోచనల సిరామచ్చ లద్దేపని
ఎవరు పెట్టింది నాకీ భారం?

దారిప్రక్క మురికి కూపంలోంచి దుర్గంధం కొడుతున్నప్పుడు
పురోద్యానవనంలోని పూవుల తావుల ప్రసక్తి తెచ్చి
ఎక్కడో దివిలోని సౌందర్యమిల మీదికి రప్పించే పని
ఎప్పుడూకనిపించని ఎవ్వంత వెలుగుయింత మందిలోకి చొప్పించేపని
ఎవరు పెట్టింది నాకీ భారం?

నామీదుగా నడిచి వెళ్ళిన అధర్మం అడుగుజాడల క్రింద
మిగిలిన యిసుక రేణువుల్ని యుగానికి చిహ్నంగా దాచి
కన్నీటితో తడసిన మట్టితో భావికి గుడికట్టే పని
కాలగమనం సూచిస్తూ సరిగ్గా గంటలు కొట్టేపని
ఎవరు పెట్టింది నాకీ భారం?

నిన్న చెప్పిన మాట ఎన్నో ఏండ్ల క్రిందనిపించేటంత
వేగగామి కాలంలో భాగంగా ప్రవహించాలని
రాత్రింబవళ్లు యోచించి రమణీయ భావాలు కూర్చేపని
వర్తమానాన్ని భుజాల మీద మోసుకెళ్ళి ఆగామిలో చేర్చేపని

ఎవరు పెట్టింది నాకీ భారం?

మదపుటేనుగులాంటి మనసుకు ఆశను అంకుశం చేసి
అంతో యింతో కలిగే తృప్తిని అంబారిగా దానిపై వేసి
మనిషి చేసే ప్రయాణంలో మంచీ చెడూ చూసేపని
మరీ కొండ ఎక్కలేకుంటే, డోలీవేసి మోసే పని
ఎవరు పెట్టింది నాకీ భారం?

బడిలో చెప్పని చదువు బ్రతుకుతూ బాధతో నేర్చి
బాధ అని ఆదిలో అనుకున్నది బ్రహ్మానంద పదవిగా తోచి
వేసుకుంటే పూలబాటే జీవితమని చాటే పని
ఎందుకో యిది మెదడు పనిలో తెలివి మొక్కలు నాటే పని
ఎవరు పెట్టింది నాకీ భారం?

మంచి అనేది వేగంగా సిద్ధించదు. అది ఎప్పుడూ చాలా సకృత్తుగా జరుగుతూ వుంటుంది. మంచి చేసేవారు స్వార్థపరులు కారు గనక వారికి ఆత్రం, తొందర వుండవు. ఇతరులకు మంచి చెయ్యాలంటే అది ఒక్క రోజుతో అయ్యేది కాదనీ దానికి కొంతకాలం పడుతుందనీ వారికీ తెలుసు.

— మహాత్మా గాంధి

* * *

ప్రతి మహర్షికీ ఒక గతం అనేది వున్నట్లే ప్రతి పాపికీ ఒక ఆగతం వుండాలి.

— యస్. రాధాకృష్ణన్

అఖిల భారత సహకార వారోత్సవాలు

"సహకారమనేది జీవిత సూత్రాలలో ఒకటి. ఇదేదో ఇంద్రజాలం కాదు. ఇది పరస్పర సహనాన్నీ, పరస్పరం అర్థం చేసుకోవడాన్నీ పెంపొందజేస్తుంది. ప్రకృతి సిద్ధంగా మంచి స్థితిలో వున్నవారు అలాంటి స్థితిలో లేనివారికై కృషి చేయవలెనని సహకారం బోధిస్తుంది. 'ఏమీ లేని దానికంటె ఏదో కొంత నయం కదా' అన్న భ్రాంతిని తొలగించి, చేస్తూ వున్నది ఉత్తమ కృషే. దానివల్ల తప్ప కూడా సత్ఫలితాలు కలుగుతాయి అన్న విశ్వాసాన్ని ఈ ఉద్యమం కలుగజేయాలి" అంటూ యూనియన్ ప్రభుత్వ సామాజికాభివృద్ధి, సహకార మంత్రి శ్రీ యస్. కె. దే 1959 నవంబర్ 13వ తేదీతో ముగిసిన అఖిల భారత సహకార వారోత్సవాలకు సందేశమిస్తూ అన్నారు.

ఈ ఉత్సవాలను జరుపడానికై హైద్రాబాదు సెంట్రల్ కో-ఆపరేటివ్ యూనియన్ వారు హైద్రాబాదు, సికింద్రాబాదు జంట నగరాలలో విస్తృతమైన కార్యక్రమాన్ని రూపొందించారు. ఈ సంవత్సరపు ఉత్సవాలలో ముఖ్యంగా చెప్పుకోదగిన విశేషం సహకారోద్యమం పట్ల, దాని సిద్ధాంతాల పట్ల ప్రజలు స్వచ్ఛందంగా చూపిన శ్రద్ధాసక్తులు.

యూనియన్ ప్రభుత్వ పనులు, గృహ వసతి సరఫరాల శాఖా మంత్రి శ్రీ కె. సి. రెడ్డి 8వ అంతర్జాతీయ సహకార దినోత్సవాన్ని, అఖిలభారత సహకార వారోత్సవాలనూ ప్రారంభిస్తూ ప్రజలు దీక్షతో సహకారోద్యమాన్ని విజయవంతం చేయవలెనని విజ్ఞప్తి చేశారు. "పూర్వం నుంచీ మనకు కొన్ని సంప్రదాయాలున్నాయి. కొన్ని పద్ధతులూ, మర్యాదలూ వున్నాయి. కొన్ని వ్యవస్థలూ వున్నాయి. ముఖ్యంగా గ్రామ పంచాయతీ వ్యవస్థ ఎప్పటి నుంచో మనకు పరంపరా గతంగా వస్తూవుంది. ఇటువంటి చరిత్ర, సత్సంప్రదాయాలు గల మనం నేడు సహకారోద్యమానికి జీవం పోసి దాన్ని చైతన్య విలసితం చేసి అది మనకు సత్ఫలితాలిచ్చేట్టు చేయాలి" అని శ్రీ రెడ్డి అన్నారు. తమ ప్రసంగాన్ని ముగిస్తూ శ్రీ రెడ్డి ఇలా అన్నారు: "దేశంలో సహకారోద్యమాన్ని వ్యాపింపజేయడానికై ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం ప్రముఖ పాత్ర వహించడం నాకెంతో సంతోషంగా వుంది. దేశంలో సహకారోద్యమంతో చాలా కాలం నుంచి సంబంధం కలిగివున్న నవాబ్ మెహదీ నవాజ్ జంగ్ ఇక్కడి ఉద్యమానికి నాయకులు కావడం కూడా నాకు సంతోషకరంగా వుంది." ఈ ఉత్సవాలకు రాష్ట్ర సహకార మంత్రి నవాబ్ మెహదీ నవాజ్ జంగ్ అధ్యక్షత వహించారు.

పారిశ్రామిక సహకార సంఘాల ఫెడరేషన్ అధ్వర్యాన "ఉత్పత్తిదారుల దినోత్సవం" జరుపబడింది. రాష్ట్ర శాసన సభ డిప్యూటీ స్పీకర్ శ్రీ కొండా లక్ష్మణ్ అధ్యక్షత వహించారు. ఈ ఉత్సవంలో రాష్ట్ర మార్కెటింగ్ ఆఫీసర్ శ్రీ సి. అన్నామలై, వాణిజ్య పరిశ్రమల శాఖ జాయింట్ డైరెక్టర్ డా. ఆర్. వి. రావు, శ్రీ వై. బాలయ్య తదితరులు పాల్గొన్నారు. శ్రీ మాధవరావు అన్వారీ ఈ ఉత్సవాన్నీ, సహకార పరిశ్రమల ఉత్పత్తుల ప్రదర్శనాన్నీ ప్రారంభించారు.

నవంబర్ 9వ తేదీన మహబూబ్ కాలేజీ హైస్కూలు ఆవరణలో ఆ కాలేజీ ప్రిన్సిపాలు శ్రీ యం. యస్. కోటీశ్వరన్ అధ్యక్షతన యువజన దినోత్సవం జరిగింది. సికింద్రాబాదులోని అనేక పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉత్సవంలో పాల్గొన్నారు.

నవంబర్ 10వ తేదీన కో-ఆపరేటివ్ యూనియన్ కార్యాలయావరణలో జరిగిన మహిళల దినోత్సవానికి రాష్ట్ర స్త్రీ జనాభ్యుదయ శాఖ డైరెక్టర్ కుమారి జమునాబాయి అధ్యక్షత వహిస్తూ రాష్ట్రంలోని మహిళలు అధిక సంఖ్యలో సహకార సంఘాలలో చేరి, స్త్రీ జనాభ్యుదయానికై తల

పెట్టబడ్డ అభివృద్ధి కార్యకలాపాలను విజయవంతం చేయవలెనని ఉద్బోధించారు.

మలక్‌పేటలో రాష్ట్ర శాసన సభ్యులు శ్రీ మీర్ అహమదలీ ఖాన్ అధ్యక్షతన ''పట్టణ దినోత్సవం'' జరుపబడింది. నవాబ్ మెహదీ నవాజ్ జంగ్ ఉత్సవాలను ప్రారంభించారు. ఆయన తమ ప్రారంభోపన్యాసంలో సహకార సంఘాలు విజయవంతంగా నిర్వహింప బడడానికై పింఛనుదారులు సహాయపడవలెనని అంటూ సహకార సంఘాల ద్వారా పట్టణవాసుల స్థితిగతులను బాగుచేయడానికై యూనియన్ చేస్తున్న కృషిని ప్రశంసించారు.

నవంబర్ 12వ తేదీన యూనియన్ కార్యాలయం ఆవరణలో ''ప్రణాళికా రచనలో సహకారోద్యమ స్థానం'' అను విషయంపై ఇంగ్లీషులో చర్చాగోష్ఠి జరిగింది. తెలంగాణా ప్రాంతీయ కమిటీ ఛైర్మన్ శ్రీ కె. అచ్యుతరెడ్డి అధ్యక్షత వహించారు.

చివరి రోజున రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి శ్రీ పి. తిమ్మారెడ్డి అధ్యక్షతన ''సభ్యత్వ దినోత్సవం'' జరుపబడింది. ఆనాడు సహకారోద్యమ ప్రగతి సమీక్ష చేయబడింది. సహకార సంఘాలు తమ సభ్యత్వాన్ని హెచ్చించుకోవడానికీ, వాటా ధనాన్ని ఎక్కువ చేయడానికి శాయశక్తులా కృషి చేయవలెనని ప్రబోధం చేయబడింది.

ఈ వారోత్సవాలలో ఉత్సాహంగా పాల్గొని వీటిని జయప్రదంగా జరుపడంలో తోడ్పడ్డ వారికి శ్రీ పి. తిమ్మారెడ్డి బహుమతులు పంచిపెట్టారు.

నవంబర్ 8వ తేదీన ''రచయితల సమావేశం'' జరిగింది. ఈ సమావేశంలో రచయితలు సహకారోద్యమ సిద్ధాంతాలు తమకు వైవిధ్యంగల ఇతివృత్తాలను ఇవ్వగలవని అంగీకరించారు.

అవతలి మనిషి చెప్పిన మాట నమ్మదగింది కాదు అని అనుకోవడానికి తగు కారణమేమీ కనిపించనప్పుడు దాన్ని యథాతథం నమ్మడమే మనం చేయవగిన పని. అలా చేయడమే ఉదాత్తంగా వుంటుంది. లేకపోతే ఈ ప్రపంచంలో నెగ్గుకు పోలేము.

— మహాత్మా గాంధీ

* * * *


దానధర్మాల కంటె మించిన పుణ్యకార్యమేదీ లేదు. చేయి చాచే వాడి కంటే ఇచ్చే వాడే ఎప్పుడూ గొప్ప వ్యక్తిగా పరిగణింపబడతాడు. భగవంతుడు మానవునికి చేతులిచ్చింది చెయ్యెత్తి దానం చేయడం కోసమే.

— స్వామీ వివేకానంద

పదేండ్ల పరిశోధన

హైదరాబాదులోని ప్రాంతీయ పరిశోధనశాల దశమ వార్షికోత్సవాలను రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నీలం సంజీవ రెడ్డి 1959 నవంబరు 7వ తేదీన ప్రారంభించారు.

అసలు ఈ ప్రాంతీయ పరిశోధనశాల 1944 నుంచి పని చేస్తూవుంది. ఆ సంవత్సరమే అప్పటి హైదరాబాదు ప్రభుత్వం ఈ పరిశోధనశాలను నెలకొల్పింది. అప్పుడు దీనిని విజ్ఞాన శాస్త్ర, పారిశ్రామిక పరిశోధన కేంద్ర ప్రయోగశాల అని వ్యవహరించేవారు. అయితే ఈ పరిశోధనశాలలో 1948 నుంచి మాత్రమే చురుగ్గా క్రమబద్ధమైన పరిశోధన కార్యకలాపం ఆరంభమైంది. 1948లో డా. ఎస్. హుసేన్ జహీర్ డైరెక్టరుగా నియమింప బడ్డారు. ఆయన పరిశోధనశాల స్వరూపాన్ని గూర్చి, జరగవలసిన పనులనుగూర్చి ఒక నివేదిక దాఖలు చేశారు. పరిశోధనశాల నూత్న భవనాలకు 1949 నవంబరు 6వ తేదీన మేజర్ జనరల్ జె. ఎన్. చౌదరి శంకుస్థాపన చేశారు. 1954 జనవరిలో భారత ప్రధాన మంత్రి శ్రీ జవహర్‌లాల్ నెహ్రూ నూత్న భవనాలకు ప్రవేశోత్సవం జరిపారు.



పరిశోధనాకృషి (లేబొరేటరీలో ఒక గది)



రాష్ట్ర ముఖ్యమంత్రి, రెవెన్యూ మంత్రులు పనిని పరిశీలిస్తున్నారు (లేబొరేటరీలో మరొక గది)

1956 సంవత్సరంనుంచీ హైదరాబాదులోని ఈ ప్రాంతీయ పరిశోధనశాల భారత ప్రభుత్వ వ్యవస్థయైన విజ్ఞాన శాస్త్ర పారిశ్రామిక పరిశోధనామండలి అధ్వర్యాన జాతీయ పరిశోధన శాలల్లో ఒకటిగా పనిచేస్తూవుంది. అయితే ఇతర పరిశోధనశాలలన్నీ ఒక్కొక్కటి ఒక్కొక్క రంగంలో ప్రత్యేక కృషి జరుపుతూవున్నాయి. కాని హైదరాబాదులోని పరిశోధనశాల అలాగాక అనేక హంశాలకు సంబంధించిన పరిశోధనా కేంద్రంగా పనిచేస్తూవుంది. క్రమబద్ధమైన పరిశీలన, పరిశోధనల ద్వారా ఈ ప్రాంతంలో లభించే ముడి సరుకులను ఏవిధంగా వినియోగానికి తేవడమా అన్న విషయంలో ఈ పరిశోధనశాల హెచ్చు శ్రద్ధ వహిస్తూవుంది. అంతేగాక కొత్త పరిశ్రమల స్థాపన విషయంలోనూ, సరుకుల తయారీ పద్ధతిని, ఫలితాలనూ మెరుగుపరిచే విషయంలోనూ ఇది ప్రైవేటు పరిశ్రమలవారికి, ప్రభుత్వానికి పరీక్షా సౌకర్యాలనూ, సాంకేతిక సలహాలనూ, సహాయాన్ని అందజేస్తూవుంది. పరిశోధన ముఖ్యంగా ఈ హంశాలనుగూర్చి జరుగుతూవుంది; వంటచెరుకు పదార్థములు, కొవ్వులు, నూనెలు, ఉపరితలం పూతలు; భారీ రసాయనములు, రసాయనిక ఎరువులు, పింగాణీ, ఔషధములు, బయోకెమిస్ట్రీ, కెమికల్ ఇంజనీరింగు, జనరలు ఇంజనీరింగు, ఆపరేషనల్ రీసెర్చి.

ఈ రాష్ట్రంలో రసాయనిక ఎరువుల ఫ్యాక్టరీని స్థాపించే విషయమై ఈ పరిశోధనశాల 1954 నుంచే భోగట్టా సేకరిస్తూ వచ్చింది. కొత్తగూడెంలో ఫ్యాక్టరీ స్థాపనకై ఆర్థిక, సాంకేతిక భోగట్టాతోసహా చక్కని నివేదికను సిద్ధం చేసింది.

ఈ పరిశోధనశాల పేటెంటు ఆధారంగా, దీని సాంకేతిక సహాయంతో భారత జాతీయ పరిశోధన అభివృద్ధి కార్పొరేషన్‌వారు ఆక్టివ్ కార్బనులు ఉత్పత్తి చేస్తున్నారు. వాటిని బొంబాయి మెసర్సు వోల్టాస్ లిమిటెడ్ కంపెనీవారు దేశంలో అమ్ముతున్నారు. ఈ ఉత్పత్తివల్ల మనకెంతో

విదేశ మారకద్రవ్యం మిగులుతూవుంది.

రాష్ట్ర ముఖ్య మంత్రి నవంబరు 7వ తేదీన పరిశోధన శాల దశమ వార్షికోత్సవాలను ప్రారంభిస్తూ విదేశాలనుంచి సాంకేతిక విజ్ఞాన శాస్త్రసహాయం తీసుకోనవలసిన అగత్యం మనకేనాడు తప్పుతుందో అది మనదేశానికి గర్వకారణమైన రోజు కాగలదని అన్నారు. దాన్ని సాధించడంలో ఇలాంటి పరిశోధనశాలలు చేయవలసినదెంతైనా వున్నది. దేశాన్ని ముందుకు తీసుకుపోవడానికై దేశంలోవున్న శాస్త్రజ్ఞులు దీక్షతో కష్టించి పనిచేయవలసివుందని ముఖ్య మంత్రి అన్నారు.

ముఖ్య మంత్రి ప్రసంగానికి ముందు పరిశోధనశాల డైరెక్టరు డా. హుసేన్ జహీర్ గడచిన పదేండ్లలో పరిశోధనశాల సాధించిన ఫలితాలను సమీక్షిస్తూ పొగరాకుండా ఉండేటువంటి వంటచెరకు — అనగా కోల్‌సైటును రోజుకు 1600 టన్నులు సిద్ధం చేయగల పారిశ్రామిక కర్మాగారాన్ని నెలకొల్పడానికై సహాయం చేయగల స్థితి. స్తోమత పరిశోధనశాలకు కలదని తెలిపారు. హైదరాబాదు, సికింద్రాబాదు నగరాల ప్రజలకు పరిశోధనశాల ప్రతి నెల 300 టన్నుల కోల్‌సైట్ సప్లయి చేస్తూవుందని డాక్టర్ జహీర్ తెలియజేశారు. బొంబాయి, నాగపూరు తదితర పట్టణాల నుంచి కోక్‌సైట్ సప్లయికి విజ్ఞాపనలొచ్చాయని వెల్లడించారు. బొగ్గును వాయువుగా మార్చే పద్ధతిద్వారా హైదరాబాదు సికిందరాబాదు నగరాలకు గ్యాస్‌ను సప్లయి చేసే పథకాన్ని తమ పరిశోధనశాల సిద్ధంచేసిందనీ. దాన్ని ఎప్పుడైనా అమలు జరుపుటకు తాము సిద్ధంగావున్నామనీ డాక్టర్ జహీర్ తెలియజేశారు.

మొత్తంపై ఈ పరిశోధనశాల గత పది సంవత్సరాల నుంచీ ఎంతో ప్రయోజన కరమైన కృషి చేసింది. పరిశ్రమలవారు తలపెట్టే పరిశోధన కార్యకలాపాలను చేపట్టగల స్థితిలోవుంది పరిశ్రమలలో ఉత్పత్తి పద్ధతులను అభివృద్ధి పరిచే విషయంలోనూ, కొత్త పరిశ్రమలు నెలకొల్పే విషయంలోనూ తగు సాంకేతిక సహాయం చేయగల శక్తి స్తోమతలు దీనికున్నాయి.

జ్ఞానం అనేది నిలిచివుండి సుస్థిరం కావాలంటే అది తేజోవంతమూ. పరివ్యాప్తమూ కావాలి. జ్ఞానానికి ఏ మాత్రం చాపులోనైనా అజ్ఞానాన్ని మనలనివ్వాపుంటే మానవ సమాజాన్ని తిరిగి అనాగరక ఆటవిక దశకు పోగల ప్రమాదానికి గురి చేశాన్నమాటే.

— శ్రీ అరవింద మహర్షి

* * * *

మంచిని కళాభిజ్ఞతకు లోటుగ కట్టెయ్యా కూడదు. అయితే మంచి అనేది సుందరంగా ప్రమోదదాయకంగా వుండాలి. లేకపోతే అది మంచి అనిపించుకోదు.

— శ్రీ అరవింద మహర్షి

జిల్లాల వార్తలు

ఆదిలాబాదు

ప్రథమ చికిత్సాకేంద్రం :-సిర్పూరు మొదటి అంచె బ్లాకులోని ముత్తంపేట గ్రామంలో 26-10-59వ తేదీన పశువుల ప్రథమ చికిత్సా కేంద్రం ఒకటి తెరువబడింది.

అనంతపురం

పథకం మంజూరు:- రాయదుర్గం తాలూకాలో తక్లకెరరాయ సముద్రం. పథకాన్ని రాష్ట్ర విద్యుచ్ఛక్తి బోర్డు మంజూరు చేసింది. ఈ పథకానికి సుమారు రూ 1 లక్ష ఖర్చవుతుంది.

సెప్టెంబరు నెలలో ఎనిమిది ప్రాథమిక పాఠశాలలు తెరువబడినవి.

స్త్రీలకు శిక్షణ:- పెనుగొండ తాలూకాలోని కురబవండ్లపల్లి గ్రామంలో 24-9-59 తేదీ నుంచి 26-9-59 తేదీ వరకు స్త్రీలకొరకు గ్రామ సహాయకుల శిక్షణాశిబిరం నిర్వహించబడింది. "కుటుంబాని కొక ప్రణాళిక" పథకాన్ని అమలుపరచడానికి గ్రామం ఎన్నిక చేయబడింది.

అనంతపురంలో 2-10-59 వ తేదీన వన్యమృగ దినోత్సవం జరుపబడింది.

గుంటూరు

దుస్తుల తయారీ కేంద్రం:- లఘుపరిశ్రమలు, గ్రామీణ పరిశ్రమల కార్యక్రమం క్రింద రాజుపాలెం బ్లాకులోని తాళ్లూరు గ్రామంలో దుస్తుల తయారీ కేంద్రం ఒకటి తెరువబడుతుంది.

రాజుపాలెం బ్లాకులోని దొడ్లేరులో 20 మంది సభ్యులతో గ్రామస్థుల రేడియో గోష్ఠి ప్రారంభించబడింది.

వరిసాగు:- రాజుపాలెం బ్లాకులో 275 ఎకరాలలో జపాను పద్ధతి వరిసాగును ప్రవేశ పెట్టాలని లక్షించగా 292 ఎకరాలలో ఇది ప్రవేశపెట్ట బడింది.

ఖమ్మం

పాఠశాలా భవనం ప్రారంభం:- స్థానికాభివృద్ధి పనుల పథకం క్రింద కృష్ణపురంలో నిర్మించబడిన నూత్న పాఠశాలా భవనానికీ, ఖాజీపురంలో మరొక దానికీ రాష్ట్ర కార్మిక, స్థానిక పరిపాలన శాఖా మంత్రి శ్రీ డి. సంజీవయ్య ప్రారంభోత్సవం చేశారు.

కల్లూరు బ్లాకులోని కృష్ణవరం గ్రామంలో 14-10-1959వ తేదీన చిన్నరకం పశుచికిత్సాలయం తెరువబడింది.

విద్యార్థుల శ్రమదాన శిబిరం:- రాష్ట్ర హోంశాఖా మంత్రి శ్రీ ఎం. నరసింగరావు 27-10-1959వ తేదీన కారేపల్లిలో విద్యార్థుల శ్రమదాన శిబిరంలో ప్రసంగించారు.

జిల్లా కలెక్టరు శ్రీ సయ్యద్ హాషిమ్అలీ 27-10-1959వ తేదీన సర్దేపల్లిని సందర్శించి అచ్చట జరుగుతున్న అభివృద్ధి పనులను తనిఖీ చేశారు. సర్దేపల్లి ఈ జిల్లాలోని ఆదర్శ గ్రామం.

కృష్ణా

పంచాయతీ సమితి :- గూడూరు పంచాయతీ సమితికి 5-11-1959వ తేదీన శాసన సభ సభ్యుడు శ్రీ ఆర్. అచ్యుతరామయ్య ప్రారంభోత్సవం చేశారు.

తిరువూరులో వన్యమృగ వారోత్సవం జరుపబడింది. 3-10-59 వ తేదీన బహిరంగ సభ జరిగింది.

వృత్తి విద్యా పాఠశాల :- నందిగామలోని ప్రాథమిక పాఠశాల 1-10-59వ తేదీన వృత్తి విద్యా ప్రాథమిక పాఠశాల క్రింద మార్చ బడింది.

కృష్ణా జిల్లాలోని పెనుగంచిప్రోలు బ్లాకులో 2-10-1959వ తేదీ నుంచి పూర్వ విస్తరణ పనిని ప్రారంభించమని ప్రభుత్వం ఆదేశించింది.

మహబూబ్ నగరం

రోడ్డు ప్రారంభం :- రాష్ట్ర పబ్లిక్ వర్క్స్ శాఖ మంత్రి గద్వాల-అయిజ రోడ్డుకి 27-10-59వ తేదీన ప్రారంభోత్సవం చేశారు. మంత్రిగారు అదే రోజున గద్వాల-వెంగాపురం రోడ్డుకి పునాది రాయి వేశారు.

పూర్వ విస్తరణ బ్లాకు :- మక్తల్ తాలూకాలో ధన్వాడ పూర్వ విస్తరణ బ్లాకుకి రాష్ట్ర ఆర్థిక శాఖా మంత్రి శ్రీకాసు బ్రహ్మానంద రెడ్డి ప్రారంభోత్సవం చేశారు.

కల్వకుర్తి ఖాదీ గ్రామోద్యోగ సంఘం తాలూకు సోప్ యూనిట్ భవనం 17-10-59 తేదీన తెరువబడింది. శ్రీసాధు సుబ్రహ్మణ్యం, శ్రీ ప్రభాకర్జీ ప్రభృతులు బహిరంగసభలో ప్రసంగించారు.

మెదక్

గోసంవర్ధన దినం :- పటన్ చెర్వు పంచాయతీ సమితి అధ్యక్షుడు శ్రీ పి. రామచంద్రా రెడ్డి అధ్యక్షతన సంగారెడ్డిలో 8-11-1959 వ తేదీన గోసంవర్ధన దినోత్సవం జరుపబడింది. జిల్లా కలెక్టరు శ్రీ టి. యస్. కపూర్ బహుమతి పొందిన పశువుల యజమానులకు బహుమతులు పంచిపెట్టారు.

1959 అక్టోబర్ 2వ తేదీ నుంచి గజ్వేల్‌లో పూర్వ విస్తరణ బ్లాకును ప్రభుత్వం మంజూరు చేసింది.

నల్గొండ

లంబాడీ కాలనీ :- చెరెపల్లిలో సాంఘిక సంక్షేమ శాఖ నిర్మించిన లంబాడీ కాలనీకి కార్మిక, స్థానిక పరిపాలన శాఖా మంత్రి 18-10-59వ తేదీన ప్రారంభోత్సవం చేశారు.

జిల్లా కలెక్టరు శ్రీప్రకాష్ కుమార్ 5-10-59 వ తేదీన దేవరకొండలో పంచాయతీ అధ్యక్షుల గోష్ఠిని ప్రారంభించారు.

పోచంపల్లిలో కుటీర పరిశ్రమల శిక్షణ—ఉత్పత్తి కేంద్రానికి 2-10-59 వ తేదీన జిల్లా కలెక్టరు ప్రారంభోత్సవం జరిపారు. 28-10-59 న నక్రేకల్లు బ్లాకులోని తాడికల్లులో సాంఘిక సంక్షేమ కాలనీని కూడ ఆయన ప్రారంభించారు.

నారాయణపురం బ్లాకులోని గట్టుప్పల్ గ్రామంలో 9-11-59 వ తేదీన జిల్లా కలెక్టరు నూతన పాఠశాలా భవనాన్ని ప్రారంభించారు. రాష్ట్ర శాసన సభ ఉపాధ్యక్షుడు శ్రీకొండా లక్ష్మణ్ బాపూజీ సభకు అధ్యక్షత వహించారు.

రాష్ట్ర ప్రభుత్వం నల్గొండ పట్టణానికై నీటి సరఫరా పథకాన్ని మంజూరు చేసింది.

నల్గొండ తాలూకాలోని నెమ్మాని గ్రామంలో 5-10-59వ తేదీన కొత్తగా ఎక్స్ట్రా డిపార్టమెంటల్ బ్రాంచి పోస్టాఫీసు ఒకటి తెరువబడింది.

నెల్లూరు

గ్రామస్థుల రేడియో గోష్ఠి:- ఈ జిల్లాలోని వెంకటాచలం, తోటపల్లి గూడూరు, గూడూరు, నాయుడుపేట, వెంకటగిరి బ్లాకులలో గ్రామస్థుల రేడియో గోష్ఠి పథకం ప్రవేశపెట్ట బడుతుంది.

నిజామాబాదు

రక్తం బ్యాంకు:- నిజామాబాదు సివిల్ ఆసుపత్రిలో జిల్లా కలెక్టరు శ్రీ జి. నారాయణచెట్టి 28-10-59వ తేదీన రక్తం బ్యాంకుకి ప్రారంభోత్సవం చేశారు. మునిసిపల్ అధ్యక్షుడు శ్రీ కిషన్‌దాస్ ప్రభృతులు విరాళాలిస్తామన్నారు. సేఠ్ మన్నారామ్ బ్యాంకుకి రు. 21 ల విరాళం ఇచ్చారు.

అగ్రస్థానం

చిన్న మొత్తాల పొదుపు వసూళ్లలో ఈ జిల్లా తిరిగి మొదటి స్థానాన్ని ఆక్రమించింది. మొత్తం వసూళ్లలో ఇది రాష్ట్రంలో ద్వితీయ స్థానం పొందింది.

ఈ జిల్లాకు కేటాయించబడిన మరొక పూర్వ విస్తరణ కేంద్రం ఎల్లారెడ్డిలో నెలకొల్పబడుతుంది. ఎల్లారెడ్డి తాలూకా పూర్తిగా ఈ కేంద్రం క్రిందికి వస్తుంది.

బాన్సువాడ పంచాయతీ సమితికి జిల్లా కలెక్టరు 4-11-59వ తేదీన ప్రారంభోత్సవం చేశారు. సమితి అధ్యక్షుడు శ్రీ ఎన్. లింగయ్య గుప్త సభికులకు స్వాగతం చెప్పారు. శాసన సభ సభ్యురాలు శ్రీమతి వై. సీతాకుమారి ప్రభృతులు ఈ సందర్భంలో ప్రసంగించారు.

శ్రీకాకుళం

షేర్‌మహమ్మద్‌పురం పంచాయతీ సమితికి 1-11-59వ తేదీన ప్రారంభోత్సవం జరిగింది. సమితి అధ్యక్షుడు శ్రీ కె. సత్యనారాయణ జాతీయ పతాకాన్ని ఎగురవేశారు.

శా. స. స. శ్రీ సి. హెచ్. సత్యనారాయణ అధ్యక్షతన బహిరంగ సభ జరిగింది.

హరిజన గ్రామంలో పాఠశాల:- షేర్ మహమ్మద్ పురం బ్లాకులోని హరిజన గ్రామమైన పెయ్యలవాని పేటలో బ్లాకు నిధులతోనూ, ప్రజల సహాయంతోను నిర్మించబడిన నూత్న పాఠశాలాభవనాన్ని శా. స. సభ్యుడు శ్రీ సి. హెచ్. సత్యనారాయణ 2-10-59వ తేదీన తెరిచారు. భవన నిర్మాణంలో హరిజనుడైన శ్రీపెయ్యల సింహాద్రి ముఖ్య పాత్ర వహించారు. జిల్లా కలెక్టరు శ్రీ సింహాద్రి కృషిని ప్రశంసించారు.

మందస మొదటి అంచెబ్లాకులో రంగోయి, పొత్ర కొండ, ములిపాడు, మందస, మెట్టూరు గ్రామాలలో 1959 అక్టోబరు నెలలో అయిదు కోళ్ల పెంపకం యూనిట్లు ప్రారంభించబడినవి. తళ్లభద్ర, గూడూరు గ్రామాలలో రెండు బహుళార్థ సాధక సహకార సంఘాలు, డబరు, దేవుపురం గ్రామాలలో రెండు ప్రయోజన విద్యా కేంద్రాలు తెరువబడినవి. అయిదు పిల్లల గ్రంథాలయాలు కూడా స్థాపించ బడినవి.

విశాఖపట్నం

పరిశ్రమలపై గోష్ఠి:- 1959 సెప్టెంబరు మొదటి వారంలో విశాఖపట్నంలో పరిశ్రమలపై గోష్ఠి జరిగింది. పరిశ్రమలు, ధర్మాదాయాలశాఖా మంత్రి శ్రీ ఎ. భగవంత రావు గోష్ఠిని ప్రారంభించారు. ప్రొ.ఎం.ఎస్. కృష్ణన్, డా. సి. మహాదేవన్, శ్రీ వి. ఆర్. చిత్రి, శ్రీ కె. ఎస్. దత్. శా. స. స. శ్రీ బి. జి. ఎం. ఎ. నరసింగరావు, ప్రైవేటు పారిశ్రామిక వేత్త శ్రీ ఎ. కూర్మారావు ప్రభృతులు గోష్ఠిలో ప్రసంగించారు, జిల్లా కలెక్టరు శ్రీ ఐ. జె. నాయుడు, ఐ. ఎ. ఎస్. అధ్యక్షత వహించారు.

ఉన్నత పాఠశాలా భవనం:- జమిలో కొత్తగా నిర్మించ బడిన ఉన్నత పాఠశాలా భవనానికి 25-10-59వ తేదీన జిల్లా కలెక్టరు ప్రారంభోత్సవం చేశారు. శాసన మండలి సభ్యుడు శ్రీ జి. బి. అప్పారావు ఉత్సవానికి అధ్యక్షత వహించారు.

ప్రజారోగ్యం. సాంఘిక వైద్యంలో అఖిల భారత సిస్టర్ ట్యూటర్ల మూడవ రిఫ్రెషర్ కోర్సును జిల్లా కలెక్టరు 26-10-59వ తేదీన కింగ్ జార్జి ఆసుపత్రిలో ప్రారంభోత్సవం చేశారు.

కోటవురట్ల బ్లాకులో కొండల అగ్రహారం సమీపంలో వరాహనదిపై నిర్మించ తలపెట్టబడిన వంతెనకు ఆర్థిక శాఖామంత్రి శ్రీకాసు బ్రహ్మానందరెడ్డి 16-10-59వ తేదీన శంకుస్థాపన చేశారు. ఇదేనదిపై నర్సీపట్నం బ్లాకులో చిడిగుమ్మలవద్ద నూత్నంగా నిర్మించబడిన వంతెనకు అదే రోజున మంత్రిగారు ప్రారంభోత్సవం చేశారు. ఈ రెండు ఉత్సవాలకూ శా. స. స. రాజా సాగి సూర్యనారాయణ రాజు అధ్యక్షత వహించారు.

ఎ. కోడూరు బ్లాకులోని కొత్తవూరు ముత్యాలపాలెం గ్రామంలో 28-9-59వ తేదీ నుంచి 30-9-59వ తేదీ వరకు గ్రామ సహాయకుల శిక్షణాశిబిరం నిర్వహించబడింది.

వరంగల్

కొత్త అభివృద్ధి కేంద్రం:- వర్ధన్నపేట మొదటి అంచె బ్లాకును జిల్లా కలెక్టరు శ్రీ మొహిసిన్‌బిన్ షబీర్ ఐ. ఎ. ఎస్.. 5-10-59వ తేదీన ప్రారంభించారు. ఈ సందర్భంలో శా. స. స. శ్రీ బి. కేశవరెడ్డి అధ్యక్షత వహించారు.

పరకాల పంచాయతీ సమితికి 3-11-59వ తేదీన శా. స. స. శ్రీ. బి. కేశవరెడ్డి ప్రారంభోత్సవం చేశారు.

జిల్లా కలెక్టరు ములుగు పంచాయతీ సమితికి 5-11-59వ తేదీన ప్రారంభోత్సవం జరిపారు,

జనగామ పంచాయతీ సమితిని 8-11-59వ తేదీన జిల్లా కలెక్టరు ప్రారంభించారు. శా. స. స.లు శ్రీ గోపాలరెడ్డి, గోకా రామలింగంగార్లు. సమితి అధ్యక్షుడు శ్రీ నరహరి ఈ సందర్భంలో ప్రసంగించారు.

పశ్చిమ గోదావరి

కళాశాలా ప్రజాశికా ఫోరం:- భీమవరం డబ్ల్యు. జి. బి. కళాశాలా ప్రజాశికా ఫోరం వారు 1959 అక్టోబరు 15, 16, 17 తేదీలలో జాతీయ ప్రజాశికా దినం జరిపారు. కళాశాలా విద్యార్థులు, అధ్యాపకులు ఇంటింటికి తిరిగి చిన్న మొత్తాల పొదుపుకి వసూళ్లు చేశారు. కళాశాలా ప్రిన్సిపాల్ శ్రీ ఇ. లక్ష్మీకాంతరావు లలిత కళలు, చేతి పనులు, లఘు పరిశ్రమల ప్రదర్శనను ప్రారంభించారు.

నర్సాపురం పూర్వ విస్తరణ బ్లాకును రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది.

పెంటపాడు మొదటి అంచె బ్లాకులోని మీనవల్లూరు, బి. కొండేపాడు, కోరిమిల్లి, రావిపాడు. చింతపల్లి, కాసిపాడు గ్రామ పంచాయతీల సభ్యులు తదితరులు ఎర్ర కాలువ గట్టులను ఎత్తు చేయటంలో తోడ్పడ్డారు.

రాష్ట్రంలో

ప్రజాస్వామ్య వికేంద్రీకరణ సూత్రంపై పరిపాలన-చర్చావేదిక

గ్రామాభివృద్ధి. గ్రామ ప్రజల సంక్షేమ కార్యక్రమం యేదైనా విజయం చెందాలంటే, స్వయం సహాయ, పరస్పర సహాయ ప్రేరితులయిన ప్రజలు దానిలో వుత్సాహంతో పాల్గొనాలి. ప్రజలకు సన్నిహితమయిన ప్రజా సంస్థలకు అధికారం, బాధ్యత అప్పగించబడనిదే అటి కార్యోత్సాహం జనించదని అనుభవం వల్ల తెలిసింది. కాబట్టి. అభివృద్ధి రంగంలో, జిల్లా పరిపాలనలో ప్రజాస్వామ్య వికేంద్రీకరణను ప్రవేశపెట్టవలసిన అవసరం జాతి విస్తృతంగా గుర్తించబడింది. ఈ సిద్ధాంతం అమలులో. 1959 ఆంధ్రప్రదేశ్ పంచాయతీ సమితులు, జిల్లా పరిషత్తుల చట్టం ఆమోదం ద్వారా ఆంధ్రప్రదేశ్ అగ్రగామిగా నిలుస్తున్నది,

ఈ కొత్త శాసనంలో జిల్లాలో సువ్యవస్థితమయిన ప్రజాస్వామిక పరిపాలన యేర్పాటు తలపెట్టబడింది. ఇందులో ప్రణాళికలు, గ్రామాభివృద్ధి పథకాల అమలు విషయంలో కేంద్ర స్థానమని పేరుపడిన గ్రామ పంచాయతీలు పై స్థాయిలోని ప్రజా సంస్థలతో అనగా అభివృద్ధి కేంద్రం స్థాయిలో పంచాయతీ సమితులు, జిల్లా స్థాయిలో జిల్లా పరిషత్తులతో కలుపబడుతాయి, ఈ కొత్త చట్టం ఒక విధంగా పాతబడి కొత్త చట్రంలో యిమడని జిల్లా బోర్డులను కూడా రద్దు చేస్తుంది.

1. పంచాయతీ సమితులు

ఒక అభివృద్ధి కేంద్రంలోని పంచాయతీల అధ్యక్షులందరూ పంచాయతీ సమితి సభ్యులుగా వుంటారు. వారు ఒక మహిళను, షెడ్యూల్డు కులాలు లేక షెడ్యూల్డు జాతుల ప్రతినిధినొకరినీ. సహకార సంఘం సభ్యునొకరినీ; పరిపాలన. ప్రజా జీవితం, గ్రామాభివృద్ధి లేక సాంఘిక సేవలో అనుభవం గల వ్యక్తుల నిద్దరినీ కో-ఆప్టు చేసుకోవాలి. రాష్ట్రి లెజిస్లేచర్ సభ్యులు, సమితులు లేక వాటి స్థాయి సంఘాల సమావేశాలకు హాజరయి చర్చలలో పాల్గొనవచ్చు. వారికి ఓటు హక్కు మాత్రం వుండదు. సమితులు, వాటి స్థాయి సంఘాల విషయంలో తమతమ ఆధిపత్యం క్రింద గల ప్రాంతాలలో రెవిన్యూ డివిజనల్ ఆఫీసర్లకి కూడా రాష్ట్ర లెజిస్లేచర్ సభ్యులకుగల అధికారాలే వుంటాయి. అభివృద్ధి కేంద్రం పూర్తి బాధ్యతను పంచాయతీ సమితులు వహిస్తాయి. అవి దిగువ వాటిని అమలుపరచాలి. 1. సమాజాభివృద్ధి కార్యక్రమం. 2. వ్యవసాయం. పశుపోషణ, సహకారం, విద్య, కుటీర గ్రామ పరిశ్రమలు, సాంఘిక సంక్షేమం, స్త్రీ సంక్షేమం, ప్రజారోగ్యాల వంటి మామూలు ప్రభుత్వ శాఖలు బదిలీ చేసిన అభివృద్ధి పథకాలు. 3. సమితులకు బదిలీ అయిన జిల్లా బోర్డుల కార్యకలాపాలు.

సమితుల కార్యకలాపాలు చురుగ్గా సాగటానికై ప్రతి సమితికి దాని సభ్యుల నుంచి అయిదు స్థాయి సంఘాలు యేర్పాటు కావాలి. వీటిలో ఒక్కొక్కటి పరస్పర సంబంధంగల కొన్ని విషయాలను, కార్యకలాపాలను చూస్తుంది. కొంతవరకు పథకాలను, పనులను మంజూరు చేయటానికి యీ స్థాయి సంఘాలకు తగినంత అధికారం వుంటుంది.

బ్లాకు అభివృద్ధి అధికారి పంచాయతీ సమితి ప్రధాన కార్య నిర్వహణాధికారిగా వుంటారు. సమితిలో పని చేసే సిబ్బంది అంతా ఆయన క్రింద పని చేస్తారు. సమితి. దాని స్థాయి సంఘాల తీర్మానాల అమలు విషయంలో సమితి అధ్యక్షుడు బ్లాకుఅభివృద్ధి అధికారికి పై చేయిగా వుండవచ్చు.

పంచాయతీ సమితి నిధులలో దిగువవి వుంటాయి :—

1. సాధారణ ప్రయోజనాలకై భూమి శిస్తు నుంచి బ్లాకు

జనాభాలో తలకి 25 న. పై. కి సమానమయిన సొమ్ము.

2. రాకపోకల సౌకర్యాలకు కేటాయించబడి బ్లాకు జనాభాలో తలకి 30 న. పై. కి సమానమయిన సొమ్ము.
3. స్థానిక సెస్సును 50 న. పై. కి హెచ్చించటానికి లెజిస్లేచర్ అంగీకరిస్తే, సాధారణ ప్రయోజనాలకై బ్లాకులో వసూలు చేయబడే భూమి శిస్తులో (సంకల్పించిన) రూపాయకు 50 న.పై. స్థానిక సెస్సులో నుంచి వచ్చే 8 న.పై.
4. ప్రాథమిక విద్యకై (సంకల్పించిన) 50 న. పై. భూమి సెస్సు నుంచి 25 న.పై.
5. ఆస్తి బదిలీపై విధింపబడే సుంకం రాబడిలో అయిదవ వంతు.
6. సమాజాభివృద్ధికి యేర్పడిన సొమ్ము.
7. అఖిల భారత సంఘాలు వగైరాల నుంచి వచ్చే సొమ్ము.
8. పంచాయతీల నుంచి వసూలు చేయబడే విరాళాలు.
9. ప్రజల విరాళం.

2. జిల్లా పరిషత్తులు

జిల్లా పరిషత్తులో దిగువ సభ్యులు వుంటారు:

1. జిల్లాలోని అన్ని పంచాయతీ సమితిల అధ్యక్షులు.
2. జిల్లా కలక్టరు.
3. జిల్లా నుంచి రాష్ట్ర శాసన సభకు ఎన్నికయిన సభ్యులు.
4. ప్రభుత్వం నిర్దేశించగల రాష్ట్ర శాసన మండలి సభ్యులు.
5. జిల్లాలో భాగమయిన నియోజక వర్గం నుంచి ఎన్నికయి అక్కడ నివసిస్తూవున్న లోక్‌సభ సభ్యులు.
6. ప్రభుత్వం నిర్దేశించగల రాజ్యసభ సభ్యులు.
7. సమితి బ్లాకు కాని ప్రతిదానికి అక్కడి పంచాయతీల అధ్యక్షులు/సర్ పంచీలచే యెన్నికయిన వ్యక్తులు.
8. నలుగురు కోఆప్టు చేసుకోబడిన సభ్యులు. ఇందులో యిద్దరు మహిళలు, ఇద్దరు షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు జాతుల ప్రతినిధులు. వీరంతా పైన పేర్కొన్న సభ్యులచే యెన్నుకోబడతారు.

జిల్లా పరిషత్తు అధ్యక్ష ఉపాధ్యక్షులు అనధికారులనుంచి సభ్యులచే యెన్నుకోబడతారు. పంచాయతీ సమితి అధ్యక్షుడు పరిషత్తు అధ్యక్షుడుగా యెన్నుకోబడినట్లయితే అతని పంచాయతీ సమితి అధ్యక్షత పోతుంది. అయితే దాని సభ్యత్వం మాత్రం వుంటుంది.

ప్రతి జిల్లా పరిషత్తుకి అయిదు స్థాయి సంఘాలుంటాయి వీటి సభ్యులు పరిషత్తు సభ్యుల నుంచే యెన్నుకోబడతారు. వీటిలో ఒక్కొక్కటి పరస్పర సంబంధం గల కొన్ని విషయాలను, కార్యకలాపాలను చూస్తుంది. జిల్లా పరిషత్తు ప్రతి స్థాయి సంఘానికి జిల్లా కలెక్టరు ఎక్స్ అఫీషియో సభ్యుడుగానూ, అధ్యక్షుడుగానూ వుంటారు. స్థాయి సంఘాలకు కొంత వరకు పథకాలను, పనులను మంజూరు చేసే అధికారాలు వుంటాయి. ప్రభుత్వం నిర్దేశించే జిల్లా అధికార్లు జిల్లా పరిషత్తు లేక దాని స్థాయి సంఘాల సమావేశాలలో పాల్గొనవచ్చు. వారికి ఓటు హక్కు మాత్రం వుండదు.

జిల్లా పరిషత్తు అధికారాలు, పనులు యివి: 1. అభివృద్ధి కేంద్రం ప్రణాళికలను పటిష్టం చేయటం, జిల్లా ప్రణాళికను తయారు చేయటం. 2. పంచాయతీ సమితుల బడ్జెటు తయారీ. 3. పంచాయతీ సమితుల కృషిని సమన్వయం చేయటం. 4. అభివృద్ధి కేంద్రాలు లేని ప్రాంతాలలో పంచాయితీ సమితుల పనులను చేయించటం. 5. సెకండరీ, వృత్తి విద్యా, పారిశ్రామిక పాఠశాలల యేర్పాటు, నిర్వహణ. 6. తనకు బదిలీ అయిన జిల్లా బోర్డు పనులను చేయటం.

జిల్లా పరిషత్తు ఆర్థిక వనరుల వివరాలు యివి:

1. జిల్లాపరిషత్తుకి కేటాయించబడిన కేంద్ర లేక రాష్ట్ర ప్రభుత్వం నిధులు.
2. కుటీర, గ్రామ, చిన్న పరిశ్రమలాది అభివృద్ధికి అఖిల భారత సంస్థల నుంచి వచ్చే గ్రాంటులు.
3. నిర్ణయించబడగల మేరకు భూమి సెస్సు, పన్ను లేక రుసుంలో వాటా.
4. ఏ చట్టం క్రిందనైనా జిల్లా పరిషత్తు విధించగల పన్నులు లేక రుసుం వల్ల వసూలయే సొమ్ము.

5. జిల్లా పరిషత్తు నిర్వహించే ధర్మ సంస్థల నుంచి వచ్చే ఆదాయం.

6. ప్రభుత్వ వుత్తర్వు ద్వారా జిల్లా బోర్డు ఆదాయం నుంచి కేటాయింపబడగల సొమ్ము.

7. ఏ రూపంలోనైనా పంచాయతీ సమితులు లేక ప్రజల నుంచి వసూలు చేసే విరాళాలు.

8. ప్రభుత్వం ముందు ఆమోదంతో జిల్లా పరిషత్తు పంచాయతీ సమితుల నుంచి వసూలుచేసే విరాళాలు.

పూర్వ విస్తరణ, ఏజన్సీ బ్లాకులలో తప్ప, సమాజాభివృద్ధి కార్యక్రమం అమలులోనున్న 235 అభివృద్ధి కేంద్రాలలోను పంచాయతీ సమితులను, రాష్ట్రంలోని 20 జిల్లాల్లోను జిల్లా పరిషత్తులను ప్రభుత్వం యేర్పాటు చేసింది. జిల్లా బోర్డులను రద్దు చేసినది కూడా. ఈ కొత్త సంస్థల యేర్పాటుతో గ్రామ ప్రజలలో అప్పుడే నూతన చైతన్యం వెల్లి విరుస్తున్నది. ప్రస్తుత చట్టం యీ కొత్త సంస్థలు నడువవలసిన విధానాన్ని స్థూలంగా నిర్ణయించినా, ఆచరణలో, సహజంగా వివరాలకు సంబంధించిన పెక్కు సమస్యలు వుత్పత్తిల్ల వచ్చు. అయితే వాటిలో పెక్కింటిని చర్చ ద్వారా పరిష్కరించ వచ్చు, అవసరమయిన యీ చర్చా విషయంలో తోడ్పడటానికై యీ పత్రికలో ప్రతి నెలా అవకాశం కల్పించబడుతుంది, పంచాయతీ సమితులు, జిల్లా పరిషత్తుల నిర్వహణకి సంబంధించిన అభిప్రాయాలు, సూచనలు, సందేహాలు మున్నగునవి ప్రకటించబడతాయి. ఈ విషయంలో ఆసక్తికల వారంతా యీ అవకాశాన్ని సాధ్యమయినంత తరచుగా వినియోగించుకొని, నిర్మాణాత్మకమయిన సూచనలు చేసి ఉత్తమంగా మన గమ్యాన్ని చేరటానికి తోడ్పడాలని విజ్ఞప్తి.

స్వార్థం, నీచత్వం, ద్వేషం—ఇవి మూడూ చాలా దుష్టగుణాలు. జీవితంలో మరే చెడుగులనైనా మాపుకో వచ్చును గాని ఇవి మూడూ దేవత్వానికి మహా ప్రతిబంధకాలు.

— శ్రీ అరవింద మహర్షి

* * *

ఆయుధాలతో కాదు, ఆత్మోన్నత్యంతో మనస్సులను జయించాలి.

— స్పినోజా

మంత్రివర్గ నిర్ణయాలు

1959 నవంబరు 13 వ తేదీన జరిగిన ఆంధ్రప్రదేశ్ మంత్రి వర్గ సమావేశంలో రెండవ పంచవర్ష ప్రణాళిక ఆఖరు సంవత్సరానికి పెట్ట వలసిన ఖర్చు విషయంలో తుది నిర్ణయం గైకొనబడింది. ఆ సంవత్సరంలో రూ॥ ఆంధ్రలో 28కోట్ల 27 లక్షలు. తెలంగాణాలో రూ॥15 కోట్ల77 లక్షలు- అనగా మొత్తం రాష్ట్రంలో రూ॥ 44 కోట్ల 4 లక్షలు ఖర్చు పెట్ట వలెనని మంత్రి వర్గం నిర్ణయించింది. ఈ ఖర్చులో నాగార్జున సాగర్ ప్రాజెక్టుకు కేటాయింపబడ్డ ఖర్చు రూ॥ 5 కోట్ల 8 లక్షలు కూడా చేరి వుంది. అయితే నాగార్జున సాగర్ పని వేగంగా జరిగి పోతూవుంది కాబట్టి దీని కేటాయింపును ఇంకా హెచ్చించమని ప్రభుత్వం కోరగలదు.

రెండవ పంచవర్ష ప్రణాళిక ఆఖరి సంవత్సరంలో పోచంపాడు ప్రాజెక్టుకుగాను రూ॥ 1కోటి కేటాయింప బడ గలవు.

*　　　*　　　*

కొత్తగూడెంలో నెలకొల్పబడే ఎరువుల ఫ్యాక్టరీ పెట్టుబడి సొమ్ములో, ప్రజల పెట్టుబడి వాటా రూ॥ 3 న్నర కోట్లకుగాను ఒక్కొక్క వాటా విలువ రూ॥ 100 అని మంత్రి వర్గం నిర్ణయించింది. ఈ వాటా సొమ్మును ఒక్కొక్కటి రూ॥ 25 ల నాలుగు సమాన వార్షిక వాయిదాలుగా చెల్లించవచ్చు. వాటా విలువను తక్కువగా పెట్టడం, అది కూడా నాలుగు వాయిదాలలో చెల్లించే సదుపాయం కలిగించడం సాధారణ ప్రజలుకూడా ఈఫ్యాక్టరీకి పెట్టుబడి పెట్టే వీలు కలిగించడానికే. రాష్ట్రప్రభుత్వం రూ॥4 న్నర కోట్లు పెట్టుబడి పెడుతుంది. తెలంగాణా సెక్యూరిటీలను అమ్మి ఈడబ్బును సమకూర్చుకోవడం జరుగుతుంది. వచ్చే సంవత్సరం రూ॥ 1 కోటి విలువగల సెక్యూరిటీలు అమ్మ బడగలవు.

సాధ్యమైనదాన్ని కూడా అసాధ్యమన్నట్లుగా భావించి అజ్ఞానంలో పడి వుండడం కంటె పెద్ద అజ్ఞానం మరొకటి లేదు. ఎందుకంటే తెలియని దాన్ని తెలుసుకోవాలని మనకు లేదు. కనుకనే అజ్ఞానంలో పడి వుంటాము.

— ఆల్డస్ హక్సులే

ముఖ్య వార్తలు

21-10-59

ప్రభుత్వం ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రానికి పత్రికా సలహా సంఘమును నియమించింది. ఈ సంఘంలో ఆరుగురు సభ్యులున్నారు.

22-10-59

1959 సంవత్సరానికి సాహిత్యంలో నోబెల్ బహుమానం సిసిలీ కవి శాల్వటోర్ క్వాసిమోడోకు ఇవ్వబడింది. ఈయన వయస్సు 58 సంవత్సరాలు. ఈయన మిలాన్ లోని కన్సర్వేటరీ ఆఫ్ మ్యూజిక్ అను సంస్థలో సాహిత్యాచార్యుడుగా వున్నాడు.

23-10-59

భారత ప్రభుత్వ ఆరోగ్య శాఖా మంత్రి శ్రీ డి. పి. కర్మార్కర్ హైదరాబాదు, సికింద్రాబాదు కార్పొరేషనులు తమకు సమర్పించిన పౌర సన్మాన పత్రానికి సమాధానం చెబుతూ హైదరాబాదు నగరం భౌగోళికంగా, శీతోష్ణ పరిస్థితిరీత్యా భారత దేశానికి ప్రత్యామ్నాయ రాజధానీ నగరం కాదగి ఉందని అన్నారు.

24-10-59

ప్రభుత్వరంగంలో స్థాపించ బడుతున్న మందుల ఫ్యాక్టరీలలో ఒక ఫ్యాక్టరీ, యూనియన్ ప్రభుత్వం నియమించిన సంఘం వారి సిఫారసు ననుసరించి ఆంధ్రలో నెలకొల్పబడగలదు.

25-10-59

ఒరిస్సా పబ్లికు వర్క్సు మంత్రి హైదరాబాదులో ఒక సందర్భంలో మాట్లాడుతూ ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం వంశధార ప్రాజెక్టు నిర్మాణం కోసం తయారు చేసిన పథకం విషయంలో ఆంధ్ర, ఒరిస్సా రాష్ట్రాలు ఒక అంగీకారానికి రావడానికి ఎట్టి ప్రతి బంధకమూ వుండ బోదని అన్నారు.

26-10-59

1959 సంవత్సరానికి రసాయన శాస్త్రంలో నోబెల్ బహుమతి జెకొస్లోవేకియా దేశశాస్త్రజ్ఞుడు ప్రొఫెసర్ జరోస్లావ్ హైరోవిస్కీకి ఇవ్వబడింది. ఈయన పదార్థములను ఆటోమిక్ ఎలక్ట్రో విశ్లేషణ చేయగల పొలరోగ్రాఫ్ అనే యంత్రాన్ని కనిపెట్టాడు. 1959 సంవత్సరానికి పదార్థ విజ్ఞాన శాస్త్రంలో నోబెల్ బహుమతి డాక్టర్ ఎమిలియో సెగ్రీ, డాక్టర్ ఓవెన్ చాంబర్లేను అను ఇద్దరు అమెరికా దేశ శాస్త్రజ్ఞులకు ఇవ్వబడింది. వీరిద్దరూ ఆంటీప్రోటాన్‌ను కని పెట్టారు వీరిద్దరూ కాలిఫోర్నియా విశ్వ విద్యాలయంలో పని చేస్తున్నారు.

ఆంధ్ర ప్రదేశ్ పబ్లిక్ వర్క్సు మంత్రి పత్రికా విలేఖరులతో మాట్లాడుతూ మాచ్‌ఖండ్‌లో ఆరవ యూనిటు పని చేయ నారంభించడంతో విద్యుచ్ఛక్తి మొత్తం ఉత్పత్తి ఒక లక్ష యాభై వేల కిలో వాట్లు అయిందని తెలిపారు.

27-10-59

గృహ వసతి సమస్యనూ, మురికి పేటల నిర్మూలన సమస్యను పరిష్కరించడానికై భూమి సేకరణ, అభివృద్ధి పథకమును ప్రవేశ పెట్టడానికి భారత ప్రభుత్వం నిర్ణయించింది. ఇందు కొరకై రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణీత ప్రాంతాలలో పెద్ద ఎత్తున భూమిని స్వాధీన పరచుకొని దానిని అభివృద్ధి చేసేందుకు భారత ప్రభుత్వం ద్రవ్య సహాయం చేస్తుంది.

28-10-59

రాష్ట్ర విద్యా మంత్రి పత్రికా విలేఖరులతో మాట్లాడుతూ అవక తవక యాజమాన్యంతో నడుపబడు తున్నటువంటి ఎయిడెడ్ ఎలిమెంటరీ పాఠశాలలన్నిటినీ ప్రభుత్వం ఈ సంవత్సరాంతం వరకల్లా స్వాధీన పరచుకో గలదని తెలియ

జేశారు అంతేగాక విజయవాడలో సంగీత నృత్య కళా శాలను ప్రారంభించడానికి ప్రభుత్వం నిశ్చయించినదనీ, ఆ కళాశాలకు పెట్టుబడి వ్యయం రూ॥ 17,000/- కాగలదనీ సాలుసరి వ్యయం రూ॥ 35,000/-లు ఉంటుందని కూడా విద్యా మంత్రి తెలియ జేశారు.

29-10-59

రాష్ట్ర భూమ్యాదాయ శాఖా మంత్రి పత్రికా విలేఖరు లతో ముచ్చటిస్తూ భూముల గరిష్ఠ పరిమితిబిల్లులో ప్రతి పాదింప బడిన భూమి గరిష్ఠ పరిమితిని తగ్గించడం కష్ట తరమని అన్నారు. బిల్లులో ప్రతిపాదింపబడ్డ గరిష్ఠ పరి మితి సాలుకు రూ॥ 5,400/-ల ఆదాయం ప్రాతి పదికపై నిర్ణయింపబడింది. దీన్ని రూ॥ 3,600/-ల ఆదాయం ప్రాతి పదికకు తగ్గించ వలెనని కొందరు కోరుతున్నారు.

30-10-59

నిజాం ధర్మ కర్తృత్వనిధి వారు పెట్టుకొన్న రిట్ పిటీ షన్‌ను కొటివేస్తూ ఆంధ్ర ప్రదేశ్ హైకోర్టు ఇచ్చిన తీర్పు పై సుప్రీం కోర్టుకు అప్పీలు చేసుకోవడానికిగాను అనుమతి ఇవ్వ వలసిందిగా ఆ ధర్మకర్తృత్వనిధి వారు కోరగా హైకోర్టు వారు నిరాకరించారు.

31-10-59

ఆంధ్ర ప్రదేశ్ పంచాయతీ సమితులు, జిల్లా పరిషత్తుల చట్టం అమలులోకి వచ్చింది. రాష్ట్ర ఆర్థిక ప్రణాళికల మంత్రి పత్రికా విలేఖరులతో ముచ్చటిస్తూ పంచాయతీ సమితులకు సభ్యులను కోఆప్టు చేసుకోవడంలోనూ, సమి తుల అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నికలలోనూ ప్రజలు చూపిన ఉత్సాహాన్ని ప్రశంసించారు. ఈ నూతన వ్యవస్థలోకి విద్యా వంతులైన యువకులు హెచ్చు మంది వచ్చారని మంత్రి తెలిపారు.

1-11-59

ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర తృతీయ వార్షిక దినోత్సవాన రాష్ట్రంలో 235 పంచాయతీ సమితులు ఏర్పడ్డాయి.

2-11-59

విశాఖ పట్నంలోని హిందుస్తాన్ నౌకా నిర్మాణ శాలలో నిర్మించబడ్డ మొట్ట మొదటి పెద్ద నౌక "ఐ.యన్.యస్. దర్శక్"ను భారత నౌకా దళాధి నేత వైస్ అడ్మిరల్ ఆర్. డి. కటారీ సతీమణి శ్రీమతి కటారీ నౌకా సంప్ర దాయాలకు అనుగుణంగా జల ప్రవేశోత్సవం జరిపారు.

3-11-59

భారత వైమానిక దళానికి చెందిన జెట్ విమానం ఒకటి మెదకు జిల్లాలోని బుంగల వెంకటాపూరు సమీపాన అడవి ప్రాంతంలో కూలి పోయింది. ఆ విమానంలో శిక్షణ పొందుతున్న వైమానికుడు శ్రీ ఎ. కే. వర్మ తగల బడుతూవున్న విమానంలో నుంచి బైటికి దూకి చెరువులో పడగా దగ్గరలో పొలాలలో సేద్యపు పనులు చేసుకుంటూ వున్న ఆరుగురు గ్రామస్తులు అతన్ని నీటిలోనుంచి బైటికి తీసి కాపాడారు. వైమానిక దళాధికారులు ఆ ఆరుగురు గ్రామస్తులు చేసిన సహాయానికి మెచ్చి వారిని తగు విధంగా సత్కరించారు.

4-11-59

కొత్త ఢిల్లీలో డిసెంబరు 11వ తేదీన ప్రారంభమతూ వున్న ప్రపంచ వ్యవసాయ సంతలో అమెరికా ప్రదర్శన శాల ప్రారంభోత్సవానికి హాజరు కావడానికై తాము కొత్త ఢిల్లీ చేరగలమని అమెరికా అధ్యక్షుడు ఐసెన్ హోవర్ ప్రకటించారు. ఆసియా ఖండాన్ని సందర్శించనున్న మొట్ట మొదటి అమెరికా అధ్యక్షుడు ఐసెన్ హోవరే.

రాష్ట్ర ప్రణాళికా సలహా సంఘం మొదటి సమావేశం సెక్రెటెరియెట్‌లో ముఖ్య మంత్రి అధ్యక్షతన జరిగింది.

5-11-59

నోబెల్ శాంతి బహుమానం బ్రిటిష్ లేబర్ పార్టీకి చెందిన పార్లమెంటు సభ్యుడు మిస్టర్ ఫిలిప్ నోయెల్ బేకర్‌కు ఇవ్వబడింది. ఈయన పూర్వం లేబర్ పార్టీ ప్రభుత్వంలో కామన్వెల్తు సంబంధ శాఖ సెక్రెటరీగా పని చేశాడు. "నిరాయుధీకరణ" విషయమై ఒక గ్రంథం రచించాడు.

6-11-59

తృతీయ పంచవర్ష ప్రణాళికలో పరిశ్రమదార్లు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో 46 మధ్యరకం పరిశ్రమలను, 186 చిన్నరకం పరిశ్రమలను ప్రారంభించడానికై లభించగల ముడి సామగ్రి, విద్యుచ్ఛక్తి, ప్రవీణులైన పనివారు మొద లగు భోగట్టా విషయంలో రాష్ట్ర పరిశ్రమల శాఖ సర్వే

జరిపింది. ఆ సర్వే ఫలితాలను క్రోడీకరిస్తూ సిద్ధం చేయ బడ్డ కరపత్రాన్ని రాష్ట్ర స్వల్ప పరిశ్రమల మంత్రి విడు దల చేశారు.

7-11-59

కొత్త ఢిల్లీలోని ఐక్యరాజ్య సమితి తాలూకు అంతర్జా తీయ బాలలనిధి సంస్థ ఆహార పరిరక్షక విభాగం యొక్క కెమికల్ ఇంజనీరు మిస్టర్ ఆర్థర్ ఆర్. ల్యూకాస్ విజయ వాడలో మూడు కోట్ల రూ.ల ఖర్చుతో నిర్మింప బడనున్న పాడి కేంద్రం పథకాలకు తుది రూపమిచ్చేందుకై విజయ వాడ వచ్చారు. మిస్టర్ ల్యూకాస్ పత్రికా విలేఖరులతో మాట్లాడుతూ ఈ కేంద్రం నిర్మాణం మొదటిదశలో ఒక్కొక్కటి 50,000 లీటర్ల పరిమాణంగల యంత్రాలు ఒకటి విజయవాడలో, రెండవది హైదరాబాదులో నెల కొల్ప బడతాయని అన్నారు. 1960 మార్చిలో న్యూయార్కు లో సమావేశం కానున్న యునిసెఫ్ కార్యవర్గం ఈ పాడి కేంద్రాలకు 1,200,000 డాలర్ల సహాయం మంజూరు చేస్తుంది.

8-11-59

భారత ప్రభుత్వం తాలూకు నేషనల్ కౌన్సిల్ ఆఫ్ అప్లయిడ్ ఎకనమిక్ రీసెర్చి అను సంస్థవారు ఆంధ్ర ప్రదేశ్ సాంకేతిక, ఆర్థిక పరిశోధన గావిస్తున్నారు. ఈ పరిశోధన కార్యక్రమం మొదట కడపలో 8-11-59 తేదీ నుంచి ఆరంభమవుతుంది.

9-11-59

ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం ఆంధ్ర ప్రదేశ్ యువజన సంక్షేమ మండలిని నియమించింది. ఉన్నత పాఠశాలలకు యువజన సంక్షేమ సంఘాన్ని కూడా ప్రభుత్వం నియ మించింది.

10-11-59

రాష్ట్ర వ్యవసాయ మంత్రి హైదరాబాదులో అఖిల భారత పారుడువ్యాధి నిర్మూలనాధికారుల మొదటి సమావే శాన్ని ప్రారంభించారు.

11-11-59

ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్ర అగ్ని ప్రమాదనిరో ధక సంఘాన్ని నియమించింది. ఈ సంఘానికి రాష్ట్ర అగ్నిమాపక దళాల డైరెక్టరు అధ్యక్షులు.

12-11-59

రాష్ట్ర పబ్లిక్ వర్క్స్ శాఖ మంత్రి స్వయంగా మొదటి రాయి వేసి కడెం ఆనకట్ట కుడి ప్రక్క రాతి కట్టడపు పనిని ప్రారంభించారు.

13-11-59

రాష్ట్ర మంత్రివర్గం రెండవ పంచవర్ష ప్రణాళిక చివరి సంవత్సరం పెట్ట వలసిన వ్యయానికి తుదిరూపమిచ్చి అంతిమ నిర్ణయం చేసింది. ఆ సంవత్సరం పెటబడు ఖర్చు రూ. 44 కోట్ల 4 లక్షలు.

14-11-59

1948 సంవత్సరపు కార్మికుల ప్రభుత్వ భీమాచటం వరంగలులో ప్రవేశ పెట్ట బడింది. దీనివల్ల ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో మరి అయిదు వేల మంది కార్మికులకు ఆ చటం వల్ల కలిగే ప్రయోజనాలు సిద్ధిస్తాయి.

15-11-59

రాష్ట్ర పబ్లికు వర్క్స్ మంత్రి పత్రికా విలేఖరులతో మాట్లాడుతూ కృష్ణా నదిపై నిర్మింపబడనున్న శ్రీశైలం జలవిద్యుచ్ఛక్తి ప్రాజెక్టుకు సంబంధిన పూర్తి పథకాలు అంచెనాలు, ప్రాజెకు నివేదికలు సిద్ధం చేయబడి అమ్పవేయ బడ్డవని తెలిపారు.

16-11-59

విశాఖపట్నంలోని హిందూస్తాన్ నౌకా నిర్మాణశాలలో నిర్మింప బడ్డ "ధ్రువక్" అనే నౌకాదళ సర్వేనౌక జల ప్రవేశోత్సవం జరిగింది. ఈ నౌకను భారత నౌకాదళం వారు స్వాధీన పరచుకున్నారు.

17-11-59

ఆంధ్ర ప్రదేశ్‌లో హైదరాబాదు, ఖమ్మం, పశ్చిమ గోదావరి, కృష్ణా, గుంటూరు, అనంతపురం జిల్లాలలో వ్యవస్థీకరింప బడిన 54 గ్రామస్తుల రేడియో గోష్ఠులు పనిచేయ నారంభించాయి.

18-11-59

తుంగభద్ర విషయంలో మైసూరు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాల అంతరాష్ట్ర మంత్రుల సమావేశంలో కొన్ని సమస్యలను ఉభయ రాష్ట్రాల పబ్లికు వర్క్స్ మంత్రుల నిర్ణయానికి వొదిలి వేయాలనీ, వారా నిర్ణయాన్ని కేంద్ర

నీటి పారుదల, విద్యుచ్ఛక్తి మంత్రిత్వ శాఖవారి సహాయంతో గైకొంటారనీ నిర్ణయం చేయబడింది.

రాష్ట్ర ప్రభుత్వం నెలకు రూ 90/-ల కంటె హెచ్చు వేతనం పొందుతూవున్న తెలంగాణా ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు తాత్కాలికంగా మరి అయిదు రూపాయిలు హెచ్చిస్తూ మంజూరీ ఇచ్చింది. ఈ హెచ్చింపు 1958 జులై 1వ తేదీ నుంచి అమలులోకి వస్తుంది.

19-11-59

రూ. 135 లక్షల ఖర్చు అంచెనాతో విజయవాడ నుంచి హైదారాబాదుకు 132 కిలోవాట్ల ఎలక్ట్రికల్ ట్రాన్స్మిషన్ లైను వేయడానికై రాష్ట్ర మంత్రి వర్గం పరిపాలనా సంబంధమైన మంజూరీ ఇచ్చింది. ఈ లైను వేయడంవల్ల ఆంధ్ర తెలంగాణా ప్రాంతాలకు సర్వసాధారణ గ్రిడ్ ఏర్పడుతుంది.

20-11-59

రాష్ట్ర ఆంధ్ర ప్రాంతంలో అమలులో వున్న మద్రాసు విద్యా నియమావళిని ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం సవరించింది. ఈ సవరణవల్ల ఏ పాఠశాల యాజమాన్యం వారు 6, 11 తరగతుల కొరకై ప్రభుత్వం నిర్ణయించిన పాఠ్య పుస్తకాలను ఉపయోగించరో వారి పాఠశాలలకు ప్రభుత్వ పరిగణన వుండదు.

---o*o---

వ్యక్తి చేయగలిగిందాన్ని జాతి కూడా చేసి సాఫల్యం పొందవచ్చు. అలా చేయాలి కూడా. అసాధారణ వ్యక్తి అంటే భవిష్యత్ మానవుడు; అనగా మార్గ దర్శకుడు.

— శ్రీ అరవింద మహరి

* * *

స్వీయమైన బలహీనతల వల్ల తప్ప, మరే ఇతర కారణాలవల్ల ఎవ్వరూ స్వాతంత్ర్యాన్ని కోల్పోరు.

— మహాత్మా గాంధి

"ఆంధ్ర ప్రదేశ్" ప్రకటన రేట్లు

'ఆంధ్రప్రదేశ్' పత్రికలో ఈ దిగువ రేట్ల ప్రకారం ప్రకటనలు స్వీకరించబడగలవు.

వివరాలు	మూడు భాషల పత్రికలకు			ఒక భాష పత్రికకు		
	పూర్తి పేజీ రూ	సగం పేజీ రూ	పావు పేజీ రూ	పూర్తి పేజీ రూ	సగం పేజీ రూ	పావు పేజీ రూ
లోపలి పేజీ	200	125	75	100	55	30
వెనుకవైపు కవరు పేజీ	350	—	—	150	—	—
2, 3 కవరు పేజీలు	250	—	—	125	—	—

ఒక సంవత్సరం కొరకు స్థలమును కంట్రాక్టు తీసుకొన్నవారికి 20 శతం రిబేటు ఇవ్వబడుతుంది.

షరతులు

1. సాంకేతిక వివరాలు: $10\frac{3}{4} \times 8\frac{1}{2}$" డెమ్మీ.
2. ముందరి టైటిల్ పేజీపై ప్రకటనలు వేయబడవు.
3. పావు పేజీకంటే తక్కువ ప్రకటనలు స్వీకరించబడవు.
4. ప్రకటించవలసిన విషయము, అది వేయబడవలసిన స్థలము మొదలగు వివరాలూ, దానికయ్యే మొత్తమూ ప్రతినెల 8 వ తేదీలోపుగా ఈ కార్యాలయానికి చేరినట్లయితే, ఆ ప్రకటన మరుసటి నెల పత్రికలో ప్రచురింపబడుతుంది. ప్రకటనకయ్యే మొత్తమును మనియార్డరు ద్వారాగాని, లేక క్రాస్‌చేయబడని డిమాండు డ్రాఫ్ట్‌ద్వారాగాని పంపవలెను. డిమాండుడ్రాఫ్టు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సమాచార పౌర సంబంధముల శాఖ డైరెక్టర్, హైద్రాబాదు-దక్కన్ పేరిట వ్రాయబడవలెను.
5. ప్రకటన నిమిత్తమై పంపబడు బ్లాకుల విషయంలో తగు జాగ్రత్త వహింపబడుతుంది. అయితే మిషను మీద బ్లాకులు గనుక పగిలిపోయినట్లయితే అందుకు ఈ శాఖ బాధ్యతవహించదు.
6. ప్రకటన ఎంతస్థలంలో ఏ వైనం ప్రకారం వేయవలసిందీ, ఒక భాష పత్రికలో వేయవలెనా, లేక మూడు భాషల పత్రికలలో వేయవలెనా అనే వివరాలను స్పష్టంగా తెలియపరచాలి. ఉత్తర ప్రత్యుత్తరాలను, పైకమును ఈ దిగువ చిరునామాకు పంపవలెను.

డైరెక్టర్,
సమాచార, పౌరసంబంధముల శాఖ
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
హైద్రాబాదు దక్కన్—1.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం

వైశాల్యం	.	1,060̊41 చదరపు మైళ్ళు
జనసంఖ్య	...	3,12,60,133
పురుషులు	...	1,576,42 912
స్త్రీలు	...	1,55,17,221
సగటు వర్షపాతం		35 65 "
ఆంధ్ర ప్రాంతం	...	34 6 అంగుళాలు
తెలంగాణా	...	36 7 ,,
అరణ్య ప్రదేశం	...	1,40,26,000 ఎకరాలు
జిల్లాలు	...	20
తాలూకాలు	...	183
రెవిన్యూ సర్కిళ్లు	...	1,000
పట్టణాలు	...	293
గ్రామాలు	...	26,450
పంటలక్రింది ప్రదేశం	...	2,93,81,000 ఎకరాలు
1958-59 లో నీటి పారుదలను పొందిన ప్రదేశం	...	68 లక్షల ఎకరాలు
కొళ్ళ సంఖ్య	...	42,42,655
1958-59 లో వుత్పత్తి అయిన ఆహారధాన్యాలు	...	61 56 లక్షల టన్నులు
పాల వుత్పత్తి	...	15 5 లక్షల గాలన్లు
రైలు మార్గాలు	...	2,902 మైళ్ళు
జాతీయ రహదార్లు	...	1,409 ,,
రాష్ట్రీ రహదార్లు	...	2,072 ,,
జిల్లా పెద్ద రోడ్లు	...	2,527 ,,
జిల్లా ఇతర రోడ్లు	...	3,458 ,,
పాఠశాలలు	...	28,000
కళాశాలలు	...	64
వృత్తి విద్యా కళాశాలలు	...	31
ద్వితీయ పంచ వర్ష ప్రణాళిక ప్రమాణం	రూ	175.37 కోట్లు

1959—60 బడ్జెటు:

ఆదాయం	...	రూ.	71 29 కోట్లు
వ్యయం	.	... ,,	71 66 ,,
పెట్టుబడి ఖర్చు	...	... ,,	28 30 ,,

